అనుదినం... జనస్వరం

www.navatelangana.com

# నవతెలంగాణ

శనివారం 04-01-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 05 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల: 6.50

## క్షీణదశకు రూపాయి



**మరో నాలుగు పైసలు పతనం**

**డాలర్‌తో రూ. 85.79 కనిష్టానికి..**

**ముంబయి :** అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ మరింత క్షీణించి.. నూతన రికార్డ్ కనిష్టానికి పడిపోయింది. శుక్రవారం అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ నాలుగు పైసలు పతనమై డాలర్‌తో 85.79 కనిష్ట స్థాయికి దిగజారింది. భారత కరెన్సీ చరిత్రలోనే ఇది మరో అత్యంత కనిష్టం. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ బలహీనంగా ప్రారంభమై.. ఇంట్రాడేలో ఏకంగా 85.80 రికార్డ్ కనిష్ట స్థాయిని తాకింది. గురువారం సెషన్‌లోనూ 11 కోల్పోయి 85.75 వద్ద ముగిసింది. డిసెంబర్ 27న ఇంట్రాడేలో 85.80 కనిష్టాన్ని ... 15లో



సెమినార్‌లో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

### వామపక్ష రాజకీయాలతోనే
## దోపిడీ రహిత సమాజం

**పెట్టుబడిదారుల కోసమే బూర్జువా రాజకీయాలు**

**సరళీకృత ఆర్థిక విధానాలతో అసమానతలు**

**అభివృద్ధి, ఆస్తులు సంపన్నులకే పరిమితం**

**పేదలు మరింత పేదలవుతున్న దుస్థితి: సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు**

**వామపక్ష భావజాలం బలపడాలి : చెరుపల్లి సీతారాములు**

**సంగారెడ్డిలో సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా.. "వామపక్ష రాజకీయాలు- నేటి అవసరం"పై సెమినార్**

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

"బూర్జువా రాజకీయాలంటే పెట్టుబడిదారీ రాజకీయాలు. వామపక్ష రాజకీయాలంటే కార్మికులు, శ్రామికులు, కష్టజీవులు, దోపిడీకి గురయ్యే ప్రజల రాజకీయాలు. దేశంలో శ్రమ దోపిడీ, కుల, మత పీడన లేని సమాజం.. కేవలం ఒక్క వామపక్ష రాజకీయాల ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది" అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. జనవరి 25-28 తేదీల్లో సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా శుక్రవారం స్థానిక గోకుల్ ఫంక్షన్ హాల్‌లో "వామపక్ష రాజకీయాలు- నేటి అవసరం" అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు బీవీ రాఘవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసమానతలతో కూడిన భారతదేశంలో కనీస వేతనాల కోసం కార్మికులు, గిట్టుబాటు ధరల కోసం రైతులు, చేసేందుకు పని, ఉండేందుకు ఇండ్ల కోసం పేదలు చేసే పోరాటాలకు వామపక్షాలు మాత్రమే అండగా నిలుస్తున్నాయన్నారు. దోపిడీకి గురయ్యే కష్టజీవుల న్యాయమైన సమస్యల్ని పరిష్కరించడానికి ఇష్టపడని బూర్జువా పార్టీలన్నీ కూడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు, లాభాల ... 15లో

# హైదరాబాద్‌లో నీటి కొరతకు చెక్

**ఐసీసీ సెంటర్‌లో హైదరాబాద్ జలమండలి బోర్డు సమావేశం**

**సమర్థవంత తాగునీటి సరఫరా ప్రణాళికలపై చర్చ**

**2050 నాటి అవసరాలకు సరిపడేలా ప్రణాళిక :ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**మల్లన్నసాగర్ ద్వారా 20 టీఎంసీల నీటి తరలింపు**

**ఆదాయ పెంపు మార్గాలను అన్వేషించాలని సూచన**

**మంజీరా నీటి పైప్‌లైన్ స్థానంలో అధునాతన లైన్**



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాబోయే 25 ఏండ్ల భవిష్యత్ అవసరాలను అంచనా వేసుకొని, గ్రేటర్ హైదరాబాద్ సిటీలో తాగునీటి సరఫరాకు మౌలిక సదుపాయాల ప్రణాళికను తయారు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ సిటీ విస్తరణను దృష్టిలో పెట్టుకొని 2050 నాటికి జనాభా అవసరాలకు సరిపడేలా ఫ్యూచర్ ప్లాన్ ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ తాగునీటితోపాటు సీవరేజి ప్లాన్ రూపొందించాలని, అవసరమైతే ఏజెన్సీలు, కన్సల్టెన్సీలతో అధ్యయనం చేయించాలని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం హైదరాబాద్ జలమండలి బోర్డు సమావేశం జరిగింది. బోర్డు చైర్మెన్ హెూదాలో తొలిసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ప్రస్తుతం సిటీలో ఉన్న జనాభాకు సరిపడా తాగునీటిని సరఫరా చేస్తున్నామని, మొత్తం 9800 కిలోమీటర్ల డ్రింకింగ్ వాటర్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ద్వారా 13.79 లక్షల కనెక్షన్లున్నాయని అధికారులు సీఎంకు నివేదించారు. మంజీరా, సింగూరు, గోదావరి, కృష్ణా నుంచి సిటీకి నీటి సరఫరా జరుగుతోందన్నారు. కాగా, గోదావరి ఫేజ్-2 ద్వారా మరింత నీటిని తెచ్చుకొని ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ వరకు తాగునీటి సరఫరాకు డిజైన్ చేసిన ప్రాజెక్టుపై సమావేశంలో చర్చ జరిగింది. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టుకు మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసుకోవాలా? కొండపోచమ్మ సాగర్‌ను నీటి వనరుగా ఎంచుకోవాలా? అనే దానిపై చర్చించారు. కన్సల్టెన్సీ ఏజెన్సీలు ఇచ్చిన రిపోర్టుతోపాటు నీటి లభ్యత ఎక్కువగా ఉండటం, లిఫ్టింగ్ వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని మల్లన్నసాగర్ నుంచే తాగునీటి సరఫరా ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. గతంలో ప్రతిపాదించిన 15 టీఎంసీలకు బదులు, సిటీ అవసరాల దృష్ట్యా 20 టీఎంసీల నీటిని తెచ్చుకునేలా మార్పులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జలమండలి ఆదాయ వ్యయాల నివేదికను ఎండీ అశోక్ రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ... 15లో

## ఆర్‌ఆర్‌ఆర్‌కు భూసేకరణ త్వరగా పూర్తిచేయాలి

- రైతులకు మెరుగైన పరిహారమందించాలి
- పంట పొలాలున్నచోట అండర్‌పాస్‌లు
- ఆర్‌అండ్‌బీ, అటవీ శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలి
- మూడేండ్లలో రోడ్లు పూర్తి చేయాలి : సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

8లో



### సావిత్రిబాయి పూలే
## సామాజిక సంస్కర్త

**జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నివాళి**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సామాజిక సంస్కర్త, ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమె చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహా దారులు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహా దారు హర్కర వేణుగోపాల్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆదాయం పెంచే బాధ్యత మీదే

**కష్టకాలంలో బాధ్యతలు చేపట్టాం సహకరించాలి : టీజీవోల డైరీ ఆవిష్కరణలో సీఎం రేవంత్**

8లో... వివరాలు

### 2030 నాటికి 20 వేల మెగావాట్ల
## పునరుత్పాదక ఇంధనం

- ఇతర రాష్ట్రాల్లో జాయింట్ వెంచర్లు
- పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు
- జెన్‌కో భాగస్వామ్యంపై దాటవేత
- త్వరలో న్యూ ఎనర్జీ పాలసీ
- మంత్రివర్గ ఆమోదం తర్వాత అమల్లోకి...
- ఈ ఏడాది కరెంటు చార్జీలు పెంచం : పునరుత్పాదక ఇంధన పాలసీ స్టేక్ హోల్డర్స్ సమావేశంలో విద్యుత్‌శాఖ మంత్రి భట్టి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దృష్ట్యా 2030 నాటికి 20వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారంనాడిక్కడి హెచ్ఐసీసీలో తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2024 పేరుతో వాటాదారుల సంప్రదింపుల సమావేశాన్ని నిర్వహించారు. దీనికి దేశవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిదారులు, పారిశ్రామిక సంఘాల ... 8లో



15లో వివరాలు

### వారసత్వ ఉద్యోగాలపై
## క్యాబినెట్‌లో తేల్చాలి

**ప్రజాభవన్‌లో వీఆర్‌ఏల బైటాయింపు**

- వినతిపత్రం స్వీకరించిన డాక్టర్ జి.చిన్నారెడ్డి, దివ్య
- సీసీఎల్‌ఏ కార్యాలయంలో కార్యదర్శి మకరందంకు వినతి

## కౌలు రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

**మంత్రివర్గ సమావేశంలో వారిని గుర్తించాలి**

- ఆత్మహత్యల్లో వారే ఎక్కువ
- నాడు రేవంత్‌రెడ్డి రాసిన లేఖకు కట్టుబడాలి : ఎస్‌కేఎం నేతల డిమాండ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) డిమాండ్ చేసింది. శనివారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో కౌలు రైతులను గుర్తించాలని కోరింది. ఎన్నికల సంద ర్భంగా టీపీసీసీ అధ్యక్ష హోదాలో కౌలు రైతులకు రేవంత్‌రెడ్డి రాసిన బహిరంగ లేఖను అమలు చేయాలని సూచించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎస్‌కేఎం రాష్ట్ర నాయకులు విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షులు అరిబండి ప్రసాదరావు మాట్లాడుతూ సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నదనీ, దాంతోపాటు కౌలు రైతులకు ఇవ్వాలని కోరారు. రైతులతోపాటు కౌలు రైతుల దరఖాస్తులను తీసుకోవాలని సూచించారు. భూమిలేని ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. ఆ మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు. కౌలు రైతు లను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ... 15లో





## కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

**6న విచారణకు రమ్మని ఆదేశం**



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో వెలుగు చూసిన ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో విచారణ నిమిత్తం ఈనెల 6న తమ ఎదుట హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఏసీబీ.. కేటీఆర్‌ను ప్రథమ ముద్దాయిగా ... 15లో

## బైడెన్ దంపతులకు మోడీ గిఫ్ట్‌లు

**అమెరికా ఫస్ట్ లేడీ జిల్ బైడెన్‌కు బహుమతిగా 7.5 క్యారెట్ల వజ్రం**

**డైమండ్ విలువ రూ.17 లక్షలకు పైనే**

**ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్‌కు రూ.5.30 లక్షలకు పైగా విలువ చేసే బహుమతులు**

6లో..



## 'స్థానిక' ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ల అమలుకు కృషి

**బీసీలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తున్నాం : మంత్రి సీతక్క**

**ప్రభుత్వ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో సావిత్రిబాయి పూలే జయంతి**

నవతెలంగాణ-కల్చరల్

స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభిప్రాయం తీసుకుంటుందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ విషయంలో ఒక సమగ్రమైన విధానాన్ని రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో సావిత్రిబాయి పూలే 194వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సావిత్రిబాయి ఎప్పటికీ గుర్తుండాలని, ఆమె గురించి పాఠశాలల్లో చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఆమె జయంతిని రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపడం చాలా అర్థవంతమైందని కొంత మంది మహిళలు, సామాజిక ఉద్యమ నేతలు, బీసీ ఉద్యమసంఘాల నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. ఇదే అంశంపై జనవరి 1వ తేదీన సీఎం దృష్టికి తీసుకెళ్లామని, దాంతో వెనువెంటనే సాయంత్రంలోగా జీవో జారీ చేసినట్టు చెప్పారు. ఉద్యమకారులకు, త్యాగశీలులకు గౌరవం ఇవ్వాలని, అందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. గద్దర్ నుంచి గూడ అంజయ్య వరకు ఎంతో మంది కళాకారులను తమ ప్రభుత్వం గుర్తించిందన్నారు. బీసీలకు ఇచ్చిన మాట కోసం పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి కృషి ... 15లో

## ఔటర్ టు త్రిబుల్ ఆర్

**గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ల నిర్మాణానికి భూ సేకరణ**

- 40కి.మీ రేడియల్ రోడ్లు, 550 ఎకరాల భూ సేకరణ
- ఫోర్త్ సిటీ నుంచి త్రిబుల్ ఆర్ వరకు కనెక్టివిటీ
- డీపీఆర్‌కు ప్రభుత్వం ఆదేశం?
- భూ నిర్వాసితులను ఒప్పించేందుకు యత్నం



నవతెలంగాణ - రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రంగారెడ్డి జిల్లా ఓఆర్‌ఆర్ రావిర్యాల నుంచి ఆమన్‌గల్ వరకు దాదాపు 40 కి.మీ మేరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ల నిర్మాణాలకు డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించినట్టు తెలిసింది. గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్లను ఫ్యూచర్ సిటీ (ఫోర్త్‌సిటీ)కి కనెక్టివిటీ చేస్తూ చేపట్టనున్న ఈ రోడ్ల కోసం 554 ఎకరాల 34 గుంటల భూమి అవసరమవి. 15లో

### 40 కి.మీటర్లు., 6 లైన్లు...

ప్రస్తుత ఓఆర్‌ఆర్ రావిర్యాల ఎగ్జిట్ పాయింట్ నుంచి ఫ్యూచర్ సిటీ మీదుగా ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగంలో ఆమనగల్ వరకు ఈ గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డును ఏర్పాటు చేయనున్నారు. ఆరు లైన్లుగా 40 కి.మీ మేర రహదారిని నిర్మించ నున్నారు. ఈ రహదారి పరిధిలో రంగా రెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమనగల్ మండ లాలు రానున్నాయి. గతంలో ఇబ్రహీం పట్నం, కందుకూరు మండలాల పరిధిలో ఫోర్త్ సిటీలో భాగంగా భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఇటీవల యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల పరిధిలో భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేట, ఆమనగల్ వరకు రోడ్డు నిర్మాణం కోసం ఈ భూసేకరణను అధికారులు చేపట్ట నున్నారు. ఇందులో భాగంగా యాచారం మండలంలోని కుర్మిద్ద, కడ్తాల్ మండలంలోని కడ్తాల్, ముద్విన్, ఆమనగల్ మండలంలోని ఆమనగల్, ఆకు తోటపల్లి గ్రామాల పరిధిలో భూసేకరణ చేట్టాల్సి ఉంది.

# మొదలైన 'నుమాయిష్' సందడి

## పాడి పంటలను ఎంకరేజ్ చేయాలి : మంత్రులు

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నుమాయిష్ సందడి మొదలైంది. నాంపల్లిలో ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 84వ అఖిల భారత వస్తు పారిశ్రామిక ప్రదర్శనశాల (నుమాయిష్)ను మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు శుక్రవారం ప్రారంభించారు. జనవరి 1న ప్రారంభం కావాల్సిన నుమాయిష్‌ను మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిచెందడంతో ప్రభుత్వం సంతాప దినాలుగా ప్రకటించడంతో రెండ్రోజులు ఆలస్యంగా ప్రారంభించారు. జమ్మూ, ఇతర రాష్ట్రాలకు సంబంధించివి ఇక్కడే ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లభిస్తాయని మంత్రి పొన్నం తెలిపారు. గతంలో ఎనిమల్ కాంపిటీషన్ జరుగుతుండేదని దానిని మళ్లీ ప్రారంభించాలని కోరారు. పాడి పంటలను సైతం ఎంకరేజ్ చేయాలన్నారు. ప్రభుత్వ సహకారంతో మరింత అభివృద్ధి చేయాలన్నారు. విద్యా సంస్థలను మరింత ప్రోత్సహించాలన్నారు. తమ ప్రాంతంలో గిరిజనులు ఉన్నారని, ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా అక్కడ కూడా ప్రదర్శన ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రస్తుతం 28 విద్యా సంస్థలు ఉన్నాయని, వచ్చే నుమాయిష్‌లోగా 30 విద్యా సంస్థలను చేయాలని కోరారు. అనంతరం ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షులు మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. గత ఏడాది నుమాయిష్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని తెలిపారు. ఎగ్జిబిషన్ ద్వారా సొసైటీ చాలా కళాశాలలు సక్సెస్‌ఫుల్‌గా నడుపుతోందని చెప్పారు. ఒక ఎన్జీవోగా సొసైటీ నడుపుతున్నారని చెప్పారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రకటించుకున్నామని, కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీతోపాటు ఇంజినీరింగ్ కాలేజీని వచ్చే ఏడాది ప్రారంభించుకోబోతున్నామని అన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు, వారాంతాలు, సెలవు రోజుల్లో రాత్రి 11 గంటల వరకు నుమాయిష్ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ వీహెచ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కుమార్, గౌరవ ఉపాధ్యక్షులు కె.నిరంజన్, గౌరవ కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి, గౌరవ సంయుక్త కార్యదర్శి డీ.మోహన్, గౌరవ కోశాధికారి డా.బి.ప్రభాశంకర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు అశ్వక్ హైదర్, డా.డి.గంగాధర్‌రావు, సతీష్ నాయక్, బీ.ఎస్.రాజేశ్వర్, అశ్విన్ మార్గం, అజయ్ కుమార్, యం.చంద్రశేఖర్, మిలింద్ గద్వాల్కర్, డా.బి.మురళి మోహన్, డా.బీ.వెంకటేశ్వర్, అడ్వైజర్ డా.యం.సురేష్ రాజ్, కన్వీనర్ డి.సురేష్ కుమార్, పీఆర్వో రవీయాదవ్ పాల్గొన్నారు.

### నిజాం కాలంలో మొదలైన నుమాయిష్

1938లో నిజాం కాలంలో మొదలైన నుమాయిష్‌కు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ నలుమూలల నుంచి సందర్శకులు తరలివస్తారు. సందర్శకులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలూ తీసుకున్నారు. సీసీ కెమెరాలు, భద్రతా బలగాలతో పాటు సందర్శకులు మైదానంలో తిరిగేందుకు ఏర్పాట్లు చేశారు. జమ్మూకశ్మీర్ డ్రై ఫ్రూట్స్, హ్యాండ్ క్రాఫ్ట్స్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ నుంచి హస్తకళ వస్తువులు ప్రదర్శనలో ఉంటాయి. దేశంలోని అత్యుత్తమ బ్రాండ్ల ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు అన్ని రకాల స్టాల్స్ అందుబాటులో ఉంటాయి.

# అల్లు అర్జున్‌కు బెయిల్ మంజూరు

- నాంపల్లి కోర్టు ఆదేశాలు
- షరతులు వర్తింపు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి / సిటీబ్యూరో

సంధ్య థియేటర్‌లో పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మరణించిన ఘటనకు సంబంధించిన కేసులో నిందితుడైన నటుడు అల్లు అర్జున్‌కు శుక్రవారం నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీసుల ఎదుట విచారణకు హాజరు కావాలని ఆదేశించటంతో పాటు.. రూ.50 వేల పూచీకత్తును చెల్లించాలని షరతులు విధించింది. కాగా, అల్లు అర్జున్‌కు బెయిల్ మంజూరు చేయరాదంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) వాదించగా.. ఈ కేసులో అల్లు అర్జున్‌కు ఎలాంటి సంబంధాలూ లేవనీ, మరోవైపు డిఫెన్స్ న్యాయవాదులు తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి అల్లు అర్జున్‌కు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేశారు. మరోవైపు, ఈ కేసుపై హైకోర్టులో విచారణ సాగుతున్నది.

# పోలీసు శాఖలో బాక్సింగ్, క్రికెట్ పై ప్రత్యేక శ్రద్ధ

- టీజీఎస్పీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో డీజీపీ జితేందర్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర పోలీసు శాఖలో బాక్సింగ్, క్రికెట్ క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించి శిక్షణ ఇప్పిస్తామని డీజీపీ డాక్టర్ జితేందర్ వెల్లడించారు. శుక్రవారం యూసఫ్‌గూడలోని టీజీఎస్పీ గ్రౌండ్స్‌లో ఈ విభాగానికి చెందిన కానిస్టేబుళ్ల శిక్షణానంతర ముగింపు కవాతుకు డీజీపీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో తన ప్రత్యేకతను స్పెషల్ పోలీసు బెటాలియన్ కానిస్టేబుళ్లు, అధికారులు నిలుపుకున్నారని మెచ్చుకున్నారు. రాష్ట్రమేగాక ఇతర రాష్ట్రాల్లో సైతం విధులను నిర్వర్తించి మంచి పేరును సాధించారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 4077 మంది టీజీఎస్పీ కానిస్టేబుళ్లు ఈ విభాగానికి కొత్తగా జత కూడారని ఆయన అన్నారు. బాక్సింగ్‌లో అంతర్జాతీయ పతకాలను సాధించిన నిఖత్ జరీన్, క్రికెట్‌లో బౌలర్‌గా అంతర్జాతీయ ఖ్యాతిని పొందిన మహ్మద్ సిరాజ్‌లకు డీఎస్పీ హోదాలనిచ్చి రాష్ట్ర ప్రభుత్వం గౌరవించిందనీ, వీరి నాయకత్వంలోనే పోలీసు శాఖలో సిబ్బందికి బాక్సింగ్, క్రికెట్‌లలో తర్ఫీదును ఇవ్వబోతున్నామని డీజీపీ తెలిపారు. టీజీఎస్పీ బెటాలియన్ డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్ జైన్ మాట్లాడుతూ.. ఈ సారి ఎంపికైన కానిస్టేబుళ్లలో 500లకు పైగా పోస్ట్ గ్రాడ్యుయేట్లు, 2000కు పైగా డిగ్రీ స్థాయి విద్యార్థులున్నారని చెప్పారు. వీరికి శాంతి భద్రతల పరిరక్షణతో పాటు అవసరమైతే మత్తు పదార్థాల నిరోధం, యాంటీ సైబర్ క్రైమ్‌తో పాటు సీఐడీ విభాగాలలో సైతం వీరికి తర్ఫీదునిచ్చి సేవలను వినియోగించుకుంటామని తెలిపారు.

# ఏఎన్ఎం పోస్టుల సంఖ్యను పెంచాలి

- మంత్రి దామోదర రాజనర్సింహకు ఏఐటీయూసీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో వెల్లడించిన పోస్టులకు అదనంగా పోస్టులను పెచాలని తెలంగాణ రాష్ట్ర సెకెండ్ ఏఎన్ఎం యూనియన్ (ఏఐటీయూసీ) కోరింది. తద్వారా 18 ఏండ్ల నుంచి పని చేస్తున్న వారికి న్యాయం చేసినట్టవుతుందని సూచించింది. ఈ మేరకు శుక్రవారం ఆ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయుల తదితర నాయకులు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. దాదాపు 5 వేల మంది రెండవ ఏఎన్ఎంలు 18 ఏండ్ల నుంచి సేవలందిస్తున్నారని చెప్పారు.



# ఆస్తి హక్కు రాజ్యాంగ హక్కు

- తగిన నష్టపరిహారమివ్వకుండా ఏ వ్యక్తి ఆస్తినీ లాక్కోలేం : సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

న్యూఢిల్లీ : ఆస్తి హక్కు రాజ్యాంగ హక్కు అని భారత సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వకుండా ఏ వ్యక్తి ఆస్తినీ లాక్కోలేమని తెలిపింది. 44వ రాజ్యాంగ సవరణ చట్టం-1978 ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించిన విషయం విదితమే. అయితే, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 300(ఎ) ప్రకారం మానవ, రాజ్యాంగ హక్కుగా కొనసాగుతున్నదని వివరించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్ గవాయ్, జస్టిస్ కె.వి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 300(ఎ).. చట్టం ద్వారా తప్పితే.. ఏ వ్యక్తీ తన ఆస్తిని కోల్పోకూడదని చెప్పింది. బెంగళూరు-మైసూరు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ ప్రాజెక్ట్ (బీఎంఐసీపీ) కోసం భూసేకరణకు సంబంధించి కర్నాటక హైకోర్టు 2022లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీలుపై సుప్రీంకోర్టు తన తీర్పును వెలువర్చింది. ఆస్తి హక్కు ప్రాథమిక హక్కు కానప్పటికీ.. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 300(ఎ) ప్రకారం ఇది రాజ్యాంగ హక్కు అని ధర్మాసనం తెలిపింది. ఒక వ్యక్తికి చట్ట ప్రకారం తగిన పరిహారం చెల్లించనపుడు ఆ వ్యక్తి ఆస్తిని కోల్పోలేడని ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పరిహారంపై అత్యున్నత న్యాయస్థానం తన తీర్పులో స్పష్టం చేసింది.



# ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్చాలి

- సీఎం రేవంత్ రెడ్డికి మానవతారాయ్ వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రాత పరీక్ష ద్వారా ప్రతిభ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ...నాలుగేండ్ల క్రితం నియమితులైన ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను (ఓపీఎస్) జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా (జేపీఎస్ మార్చాలని తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ కోటూరి మానవతారాయ్ సీఎంను కోరారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వం సుమారు రెండు వేల మంది ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్పు చేసిందని గుర్తు చేశారు. మరో 900 మందిని మార్చుతామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిందని తెలిపారు. వారిని మార్చే ప్రక్రియలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తవని పేర్కొన్నారు. డిసెంబర్ 18న ఓయూలో విజయవంతంగా జరిగిన కృతజ్ఞతా సభ జరిగిన తీరుపై సీఎం అభినందించారని తెలిపారు. ఓపీఎస్‌ల పట్ల సీఎం సానుకూలతను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జెఏసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు హేమంత్ చౌదరి, ఓయూ నిరుద్యోగ జేఏసీ నాయకులు పుల్లగిరి అశోక్, ఎం. మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



# సంచార జాతుల స్థితిగతులపై బీసీ కమిషన్ ప్రత్యక్ష పరిశీలన

- బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సంచార జాతుల స్థితిగతులపై ఈ నెల మూడో వారంలో బీసీ కమిషన్ ప్రత్యక్ష పరిశీలన చేయనున్నదని కమిషన్ చైర్మెన్ జి నిరంజన్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మెన్ జి. నిరంజన్ అధ్యక్షతన శుక్రవారం సమావేశమైంది. సమావేశంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, కార్యదర్శి బాలమాయ దేవి పాల్గొన్నారు. గతంలో జరిగిన బహిరంగ విచారణలో తమ కులాల పేర్లను సమాజంలో న్యూనతా భావంతో చూస్తున్నారని ఆయా పేర్లను మార్చాలని వచ్చిన విజ్ఞప్తుల మేరకు దొమ్మర, పిచ్చిగుంట్ల, తమ్మలి బుడబుక్కల, కుమ్మర ,వీరముష్టి కులాల ప్రతినిధులతో జరిపిన చర్చల సారాంశం ను సమావేశంలో సమీక్షించారు. కుమ్మర, రజక, మేర, కులాల వారికి ప్రస్తుత పేర్లకు అదనంగా ప్రాచుర్యంలో ఉన్న కొన్ని పేర్లను పర్యాయపదాలుగా చేర్చాలనే విషయాన్నీ సమావేశంలో సమీక్షించారు. ఈ విషయమై నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిపై అభ్యంతరాలుంటే ఈ నెల నాలుగు నుంచి 18వరకు కమిషన్ కార్యాలయంలో పిర్యాదు చేయాలని ప్రకటించారు.



# సమగ్ర భూ సర్వే చేయాలి

- కాలయాపన కోసమే రైతుభరోసాపై దరఖాస్తుల స్వీకరణ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో సమగ్ర భూ సర్వే చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతు భరోసాపై మరింత కాలయాపన చేసేందుకే దరఖాస్తుల పల్లవిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తుకున్నదని విమర్శించారు. రైతులు, భూముల డాటా ప్రభుత్వం దగ్గర ఉన్న తర్వాత అది ఎందుకు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో సీలింగ్ విధానం పెట్టలేదని గుర్తుచేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజల జీవితాల్లో మార్పు రాలేదనీ, కాంగ్రెస్ నేతల్లో మార్పు వచ్చిందని విమర్శించారు. రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది దాటినా అన్నదాతలకు రుణమాఫీ చేయలేదని విమర్శించారు. మూడు సీజన్లు గడిచిపోతున్నాయిగానీ రైతు భరోసా మాత్రం రైతులకు అందడం లేదన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఎంఎస్పీ కంటే తక్కువ మిలర్లతో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కయ్యిందని ఆరోపించారు. ఆర్థిక మాంద్యంతో ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయనీ, వాటిని కేంద్రమే భరిస్తున్నదని చెప్పారు. పదేండ్లలో మోడీ రైతులకు విద్యుత్ కోతలు, ఎరువు కొరత లేకుండా నూతన భారతాన్ని సృష్టించారని తెలిపారు.

# కేసీఆర్ తాతను కలిసి మాట్లాడుతా....

- కేటీఆర్ తో వండర్ బేబీ ఉపాసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేసీఆర్ తాతను కలిసి మాట్లాడుతా... అంటూ వండర్ బేబీ ఉపాసన ఆకాంక్షను వ్యక్తం చేసింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన వండర్ బేబీ ఉపాసన, ఆమె తల్లిదండ్రులు శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రెండున్నర సంవత్సరాల బేబీ ఉపాసన తన అద్భుతమైన జ్ఞాపకశక్తితో ప్రతిభాపాటవాలతో నోబ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, సూపర్ టాలెంటెడ్ వరల్డ్ రికార్డ్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వంటి అనేక ప్రతిష్టాత్మక సంస్థల చేత గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే.

ఆమె మహనీయుల పేర్లు వారి చిత్రపటాలను గుర్తించుకోవడం, దేశ రాజధానులు, ప్రపంచ రాజధానుల వంటి అనేక అంశాల్లో అద్భుతమైన ప్రజ్ఞను కలిగి ఉంది. కేటీఆర్‌ని కలిసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్రంతో కూడిన కేసీఆర్ చిత్రపటానికి చెందిన పజిల్ వేగంగా కలిపి కేసీఆర్ చిత్రపటాన్ని తయారు చేసి చూపించింది.

బుజ్జి బుజ్జి మాటలు మాట్లాడే బేబీ ఉపాసన ప్రజ్ఞాపాటవాలను చూసి కేటీఆర్‌తో పాటు పార్టీ నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అతి చిన్న వయసులో మహనీయుల పేర్లు, చిత్రపటాలతో పాటు భౌగోళిక అంశాల పైన ఆమెకున్న జ్ఞాపకశక్తిని, టాలెంట్‌ని చూసి కేటీఆర్ ఆశ్చర్యపోయారు. బేబీ ఉపాసన భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరాలని దీవించి, మిఠాయిలు అందించారు.

బేబీ ఉపాసన సాధించిన రికార్డుల పత్రాలపైన ఆమె తల్లిదండ్రులు కేటీఆర్ సంతకాన్ని ఒక జ్ఞాపకంగా తీసుకున్నారు. బేబీ ఉపాసనకు మంత్రి కేటీఆర్ మిఠాయిలు అందించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# మతోన్మాద శక్తులను సంఘటితంగా ఎదుర్కోవాలి

- ఎన్ వేణుగోపాల్, మెర్సీ మార్గరేట్‌లపై పథకం ప్రకారమే దాడి : సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం, తెలంగాణ ఫర్ పీస్ అండ్ యూనిటీ రౌండ్‌టేబుల్‌లో వక్తలు

## బలమైన ఉద్యమ కార్యాచరణను రూపొందించాలి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మతోన్మాద శక్తులను సంఘటితంగా ఎదుర్కోవాలని పలువురు వక్తలు అన్నారు. అందుకోసం బలమైన ఉద్యమ కార్యాచరణను రూపొందించాలని సూచించారు. మతోన్మాదాన్ని వ్యతిరేకించే శక్తులన్నీ ఐక్యతగా ఉండాలన్నారు. హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో వీక్షణం సంపాదకులు ఎన్ వేణుగోపాల్, రచయిత్రి మెర్సీ మార్గరేట్‌లపై దాడిని వక్తలంతా తీవ్రంగా ఖండించారు. కవులు, రచయితలు, ప్రచురణ కర్తలపై దాడులు జరిగితే ప్రభుత్వం స్పందించాలనీ, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం, తెలంగాణ ఫర్ పీస్ అండ్ యూనిటీ ఆధ్వర్యంలో 'పుస్తక రచన, ప్రచురణ, విక్రయాలపై మతోన్మాద శక్తుల దాడిని ఖండిద్దాం'అనే అంశంపై శుక్రవారం హైదరాబాద్‌లో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ప్రతినిధులు మెట్టు రవీందర్, పసునూరి రవీందర్, తెలంగాణ ఫర్ పీస్ అండ్ యూనిటీ ప్రతినిధి సజయ అధ్యక్షత వహించారు.

**సంఘటిత శక్తితోనే ఫాసిజాన్ని ఎదుర్కోగలం : హరగోపాల్**

సంఘటిత శక్తితోనే ఫాసిజాన్ని ఎదుర్కోగలమని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ప్రజాస్వామ్య, అభ్యుదయ, ప్రగతిశీల శక్తులన్నీ ఐక్యంగా పనిచేయాలని సూచించారు. ఫాసిజాన్ని ఎదుర్కోవడానికి కార్యాచరణను రూపొందించాలని కోరారు. అప్పుడే మతోన్మాదులు భయపడుతారనీ, దాడులు ఆగిపోతాయని చెప్పారు. కల్బుర్గిని మతోన్మాదులు చంపినపుడు సమాజంలో ఆశించిన స్థాయిలో స్పందన రాలేదన్నారు. గౌరీలంకేశ్‌ను చంపినపుడు సమాజంలో ఎక్కువ మంది స్పందించారని గుర్తు చేశారు. ఆ తర్వాత దాడులు, హత్యలు ఆగిపోయాయని అన్నారు. మతోన్మాదులు పిరికిపందలనీ, భయపడతారని చెప్పారు. ఇక్కడ తులసిపై దాడి జరిగినపుడు ఎక్కువ మంది స్పందించారనీ, ఆ తర్వాత దాడులు ఆగిపోయాయని వివరించారు.

**పథకం ప్రకారమే దాడులు : కె శ్రీనివాస్**

పెద్ద పథకంలో భాగంగానే ఎన్ వేణుగోపాల్, మెర్సీ మార్గరేట్‌పై దాడులు జరిగాయని ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు కె శ్రీనివాస్ అన్నారు. కవులు, రచయితల శక్తిని తగ్గించే విధంగా దాడి చేయడం సరైంది కాదన్నారు. పుస్తకం మీద దాడి చేస్తున్నారని చెప్పారు. ఆ పుస్తకంలో ఏముందో తెలియకుండా కూడా వారు చదవడం లేదన్నారు. భావజాల రంగంలో విద్వేషాలకు ఆస్కారం లేని విధంగా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. రాబోయే కాలంలో భౌతిక దాడులు జరిగే ప్రమాదముందన్నారు.

**అస్తిత్వ శక్తుల మధ్య ఐక్యత రావాలి : నందిని సిధారెడ్డి**

రాష్ట్రంలో అస్తిత్వ శక్తుల మధ్య ఐక్యత, అవగాహన రావాలని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మెన్ నందిని సిధారెడ్డి అన్నారు. ప్రగతిశీల భావజాలంతో సమాజాన్ని ఆధునికంగా ముందుకుతీ సుకెళ్లాలని చెప్పారు. అందుకోసం నిలబడి కొట్లాడేలా కార్యాచరణను రూపొందించాలని సూచించారు.

**పుస్తకం నెపంతో భావజాలంపై దాడి : ఆనందాచారి**

ఎన్ వేణుగోపాల్, మెర్సీ మార్గరేట్, సజయపై దాడిని తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఆనందాచారి తీవ్రంగా ఖండించారు. పుస్తకం నెపంతో భావజాలంపై చేసిన వారిపై రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాజ్యాంగాన్ని రక్షిస్తేనే అది ప్రజలను రక్షణగా ఉంటుందని అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఎన్ వేణుగోపాల్‌పై జరిగిన దాడి గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే ప్రజలు చైతన్యవంతులు కావాలని అన్నారు.

**సీఎం దృష్టికి తీసుకెళ్తా : రియాజ్**

లౌకిక, ప్రజాస్వామిక భావజాలంపై దాడి జరుగుతున్నదని గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రియాజ్ అన్నారు. దేశంలో అత్యధికంగా రాహుల్‌గాంధీపై ట్రోలింగ్ జరుగుతున్నదని వివరించారు. దాడి మతోన్మాదులు దాడికి పూనుకున్నారని విమర్శించారు. ఇది యాదృచ్ఛికంగా జరిగింది కాదన్నారు. జాతీయ స్థాయి నుంచి కింది స్థాయి వరకు ఇదే జరుగుతున్నదని వివరించారు. అంబేద్కర్ పేరును ఉచ్చరించొద్దంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. కేరళను మినీ పాకిస్తాన్ అంటున్నారని చెప్పారు. బడిలో గురువు చేత శిష్యుని కాళ్లు మొక్కిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. దీన్ని సంఘటితంగా ఎదుర్కోవాలని అన్నారు. ప్రముఖ కవి శివారెడ్డి మాట్లాడుతూ బుక్ ఫెయిర్ ఘటనపై అందరికీ కనువిప్పు కలగాలని చెప్పారు. దీనిపై ఖండనకే పరిమితం కాకుండా దీర్ఘకాలిక కార్యాచరణను రూపొందించాలని సూచించారు. మీడియా అకాడమి చైర్మెన్ కె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్ శక్తులు కూడా పుస్తకాలను ముద్రిస్తున్నాయని అన్నారు. కమ్యూనిస్టులు, సోషలిజానికి వ్యతిరేకంగా వాటిలో రాస్తున్నారని గుర్తు చేశారు. తాము కూడా దాడులకు పూనుకోవాలా?అని ప్రశ్నించారు. మీడియా అకాడమి మాజీ చైర్మెన్ అల్లం నారాయణ మాట్లాడుతూ తెలంగాణపై కేంద్రీకరించి పనిచేస్తున్నారనీ, అందులో భాగంగా సంఘ్‌పరివార్ శక్తులు దాడులు చేస్తున్నాయని చెప్పారు. విద్వేషాలను రెచ్చగొడుతున్నారని అన్నారు. సమిష్టిగా ఎదుర్కోవాలని సూచించారు. ప్రొఫెసర్ రమామెల్కోటే మాట్లాడుతూ దేశంమొత్తం మీద జరుగుతున్న దాడుల్లో భాగంగానే ఈ దాడి జరిగిందన్నారు. ప్రజాస్వామికవాదులంతా సమూహంగా ఏర్పడి ఖండించాలనీ, ఎదుర్కోవాలని చెప్పారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్ మాట్లాడుతూ ఆందోళన కలిగించే కాలంలో ఉన్నామని అన్నారు. పసునూరి రవీందర్ మాట్లాడుతూ రచయితలపై జరుగుతున్న దాడిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులను సహించబోమంటూ ప్రకటించాలని కోరారు. పీవోడబ్ల్యూ నాయకులు సంధ్య మాట్లాడుతూ మతోన్మాదుల దాడులకు సమాధానం చెప్పేలా సంఘటిత కార్యాచరణను రూపొందించాలని సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తొలగించి మనుధర్మాన్ని అమలు చేయాలనీ, హిందూ దేశంగా మార్చాలని సంఘ్‌పరివార్ శక్తులు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు.

ఈ కార్యక్ర మంలో పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం లక్ష్మణ్, హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రధాన కార్యదర్శి ఆర్ వాసు, పబ్లిషర్ బాల్‌రెడ్డి, జనంసాక్షి ఎడిటర్ రెహమాన్, ప్రొఫెసర్ పద్మజాషా, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా, తెలంగాణ విద్యావం తుల వేదిక నాయకులు సైదులు, కుల నిర్మూలన సంఘం గౌరవాధ్యక్షులు జ్యోత్స్న, అమరవీరుల బంధుమిత్రుల సమితి నాయ కులు భవాని, కవులు, రచయితలు సుధాకర్, కొండేపూడి నిర్మల, శివాలక్ష్మి, వివి జ్యోతి, కొండవీటి సత్యవతి, కాత్యాయని, విజయ భండారు, ఘంటసాల నిర్మల, చందు, జయలక్ష్మి, అరసం నేత కేపీఎల్, ప్రజాస్వామిక రచయితల వేదిక నాయకులు దేవికీదేవి, పౌర హక్కుల నాయకులు కల్పన కన్నభిరాన్, ప్రొగ్రెసివ్ ఫోరం నాయకులు స్టాలిన్, కృపాకర్ మాదిగ, ఉష, సైబాబా, సీనియర్ జర్నలిస్టు భరద్వాజ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి మహేష్, పాలమూరు అధ్య యన వేదిక నాయకులు రాఘవ, సీఐటీయూ రాష్ట్ర నాయకులు పద్మశ్రీ, టీపీఎస్‌కే నాయ కులు భూనతి వెంకటేశ్వర్లు, తెలంగాణ సాహితి నాయకులు అనంతోజు మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## భావప్రకటనా స్వేచ్ఛ, పరిశోధనలపై దాడికి ఖండన

- ఎన్ వేణుగోపాల్‌పై దుష్ప్రచారం తగదు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'వీక్షణం' సంపాదకులు ఎన్ వేణుగోపాల్ మీద సోషల్ మీడియాలో చేస్తున్న దాడిని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఖండించింది. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛ, పరిశోధనల మీద జరుగుతున్న దాడి అని విమర్శించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వారికి నచ్చని పుస్తకాన్ని అమ్ముతున్నారనే పేరుతో వేణుగోపాల్‌పై కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం మీద పరిశోధనలు జరిపిన ఒక చరిత్రకారుడు, అది పూర్వం బౌద్ధక్షేత్రం అనీ, దానికి ఆధారాలున్నాయనీ, 40 ఏండ్ల క్రితం పుస్తకాన్ని విడుదల చేశారని పేర్కొన్నారు. ఇప్పుడు అది తెలుగులో వెలువడిందని వివరించారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఆ పుస్తకం అమ్మకానికి పెట్టడాన్ని వారు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఈ చర్యలు భావ ప్రకటనా స్వేచ్ఛ మీద, పరిశోధనల మీద దాడి అని విమర్శించారు. ఆ పుస్తకాలలో చెప్పిన విషయాలపై అభ్యంతరాలున్న వారు వాటిని ఖండిస్తూ మరో పుస్తకం రాయొచ్చని సూచించారు. ప్రకటనలు చేయొచ్చని పేర్కొన్నారు. కానీ ఒక మతానికి చెందినవారిని రెచ్చగొట్టి దాడులకు ప్రోత్సహించటం ప్రమాదకరమని తెలిపారు. ఇలాంటి చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలనీ, వాటిని ఖండించాలని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులకు విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో ఇలాంటి క్యాంపెయిన్ చేస్తున్నవారి మీద తక్షణం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే గౌరీ లంకేశ్, ప్రొఫెసర్ ఎంఎం కల్బుర్గి, నరేంద్ర దభోల్కర్, గోవింద పన్సారే లాంటి మేధావులను ఇలాంటి శక్తులు హత్య చేశాయని విమర్శించారు. రాష్ట్రంలో సీనియర్ జర్నలిస్టు తులసి చందుపై కూడా ఇదే పద్ధతిలో దాడులకు ఉసి గొల్పుతూ ట్రోలింగ్ చేస్తున్నారని తెలిపారు. శాస్త్రీయ విమర్శలకు తట్టుకోలేనివారు, మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే శక్తులు మాత్రమే ఇలాంటి చర్యలకు పాల్పడతాయని పేర్కొన్నారు. ఇలాంటి స్వార్థపరుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలనీ, ప్రజాస్వామ్య పరిరక్షణకు పూనుకోవాలని తమ్మినేని విజ్ఞప్తి చేశారు.

## మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం సముచితం

- జనవిజ్ఞాన వేదిక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిటం సముచితమని జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి అభినందనలు తెలిపింది. ఈ మేరకు శుక్రవారం వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి రాజా, సమతా సబ్ కమిటీ కన్వీనర్ డి.విమల ప్రకటన విడుదల చేశారు. దశాబ్దకాలానికి పైగా జేవీవీ ఈ డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. శతాబ్దాల నాటి ఆంక్షలకు వ్యతిరేకంగా బాలికలకు, వితంతువులకు విద్యను అందించిన సావిత్రిబాయి చదువుల తల్లీ అని శ్లాఘించారు. అనేక అవమానాలు, ఛీత్కారాలు, అవరోధాల నడుమ 1848 లోనే మన దేశ తొలి బాలికల పాఠశాలను తన భర్త జ్యోతిరావు పూలేతో కలసి ఆమె ప్రారంభించారని వారు గుర్తుచేసారు. నేడు బాలికలు అధిక సంఖ్యలో విద్యావంతులు అవుతున్నారంటే దానికి తొలి పునాదులు వేసిన ఘనత సావిత్రిబాయిదేనని, ఆమె సేవలు అనన్య సామాన్యమని పేర్కొన్నారు.

## సావిత్రిబాయి పూలే గొప్ప ఆదర్శవాది

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సావిత్రిబాయి పూలే గొప్ప ఆదర్శవాదని సుందరయ్య పార్క్ వాకర్స్ క్లబ్ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు ఆవరణలో పూలే జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. సావిత్రిబాయి తన భర్తనే తొలి గురువుగా ఎంపిక చేసుకున్నారని తెలిపారు. మహాత్మాజ్యోతిరావు పూలే తన భార్యకు విద్య, జ్ఞానం నేర్పి సామాజిక ఉద్యమకారునిగా తీర్చిదిద్దాడుని పేర్కొన్నారు.1847 నాటికి ఆమె భర్తతో కలిసి క్షుద్ర అంటరాని కులాల బాల,బాలికల, మహిళల, కోసం మొట్టమొదటి పాఠశాల నెలకొల్పారని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు పీవీ నిరంజన్ రెడ్డి రూపుల వివేక్, వెంకటకృష్ణ (బబ్బులు) సలిపెల రమేష్ రెడ్డి, అంబటి శ్రీనివాస్ రెడ్డి అయిలినేని కిషన్ రావు మహ్మద్ రఫీ ఖాన్, పి రాజు పద్మా గౌడ్ నిమ్మల రాజ శేఖర్, టి స్కైలాబ్ బాబు మానిక్ రావు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రివర్గం భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నేటి సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ లోని సచివాలయంలో జరుగనున్నది. ఈ ఏడాదిలో నిర్వహిస్తున్న తొలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

## ఆనాడే కులవివక్షపై పోరాడిన యోధురాలు సావిత్రిబాయి

- ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి
- ఆమె జయంతి సందర్భంగా సహపంక్తి భోజనాలు



నవతెలంగాణ-భువనగిరి

సనాతన ధర్మంపై, బ్రాహ్మణీయ అగ్ర కులాధిపత్యంపై, కులవివక్షపై పోరాడి బాలిక విద్యకోసం కృషి సల్పిన సామాజిక విప్లవ యోధురాలు సావిత్రిబాయి పూలే అని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని బాహార్‌పేటలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు, సతీసహగమనం అమలవుతున్న కాలంలో దళితులు, మహిళలు చదువుకోవద్దన్న ఆనాటి సనాతన సంప్రదాయాలను బద్దలుకొట్టి బాలికల విద్యకోసం తమ జీవితాన్ని అంకితం చేసిన త్యాగధనులు సావిత్రిబాయి పూలే దంపతులని కొనియాడారు. స్త్రీ విద్య ద్వారా కుటుంబం మొత్తం ప్రయోజనం చెందుతుందని, కుల వివక్ష, అంటరానితనంపై పోరాడే చైతన్యం వస్తుందని సావిత్రిబాయి చేసిన కృషి యావత్ మహిళా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు ఆమెనే అన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే నడిచిన దారిలో నడవడమంటే నేడు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న మనుధర్మ శాస్త్ర విధానాలకు వ్యతిరేకంగా పోరాడటం అని చెప్పారు. అదే సావిత్రిబాయికి నిజమైన నివాళి అని తెలియజేశారు.

మణిపూర్‌లో భారత మాతను నడిరోడ్డుపై నగ్నంగా ఊరేగించిన హృదయ విదారక ఘటన మతోన్మాద పరిస్థితిని తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కోశాధికారి కల్లూరి నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు మాయరాణి, నాయకులు అంబటి లలిత, ఎన్టీఆర్డీ జిల్లా మహిళా కన్వీనర్ కొత్త లలిత, గడ్డంవాణి, బండారు యాదమ్మ, ఎండి సుబ్బి, కల్పన, భావన, రమ్య, రాజన్న, సునీత, అంజలి, జయశ్రీ, శరణ్య, లలిత, కమలమ్మ, లక్ష్మి, పోచమ్మ, ఉప్పలమ్మ పాల్గొన్నారు.

## మహిళా విద్యకు సావిత్రిబాయి పూలే కృషి

**ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి**




నవతెలంగాణ-సూర్యాపేట

మహిళల విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషి మరువలేనిదని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం సూర్యాపేట జిల్లాలోని స్థానిక టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో తెలంగాణ ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్) జిల్లా అధ్యక్షులు జె.నర్సింహారావు అధ్యక్షతన నిర్వహించిన మహిళా ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జ్యోతిరావు పూలే తన భార్య సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పి దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారని తెలిపారు. సావిత్రిబాయి పూలే అనాథ పిల్లల కోసం అనేక ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేశారని, ప్లేగు వ్యాధికి గురైన వారికి సేవ చేసుకుంటూ అదే ప్లేగు వ్యాధితో చనిపోయారని అన్నారు. సావిత్రిబాయి పూలే సేవలను ఆదర్శంగా తీసుకొని మహిళలు సాధికారత కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే జీవితం ప్రతి మహిళా ఉపాధ్యాయురాలికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ప్రయివేటు ఉపాధ్యాయుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. వారికి హెల్త్ కార్డు, ఇన్సూరెన్స్, ఐడీ కార్డులు అందజేయాలని కోరారు. సావిత్రిబాయి పూలే అవార్డును రాష్ట్ర స్థాయిలో ప్రారంభించి మహిళా ఉపాధ్యాయులను గౌరవించాలని డిమాండ్ చేశారు. జనవరి 3న సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అంతకు ముందు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యాపేట మెడికల్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుప్రజ, టీఎన్జీవో జిల్లా కోశాధికారి పి.పద్మ, టీఎస్ యుటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అరుణ భారతి, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మద్దెల జ్యోతి తదితరులతోపాటు 95 మంది మహిళా టీచర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షులు యండి జానిమియా, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్న, టీపీటీఎల్ఎఫ్ గౌరవ అధ్యక్షులు ఎండి.జానిముయా, ప్రధాన కార్యదర్శి ఎం. వీరయ్య, బత్తిని శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బీసీలంటే కాంగ్రెస్, బీజేపీలకు చులకన

**42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి**

- కామారెడ్డి డిక్లరేషన్‌ను యధాతథంగా అమలు చేయాలి
- జనగణనలో కేంద్ర ప్రభుత్వం కుల గణన చేపట్టాలి : బీసీ మహాసభలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీలంటే కాంగ్రెస్, బీజేపీలకు చులకన భావం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన "బీసీ మహాసభ"లో ఆమె మాట్లాడారు. బీసీలను విస్మరిస్తున్న ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా కామారెడ్డి డిక్లరేషన్‌ను యధాతథంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనగణనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్మరించారని విమర్శించారు. బీసీ వర్గాల్లో ఉన్న 130 కులాలకు ఒక్కో కులానికి ఒక్కో సమస్య ఉందని తెలిపారు. వాటిని పరిష్కారం చేయడానికి సీఎంకు మనసొప్పడం లేదని విమర్శించారు. కుల వృత్తుల వారికి కేసీఆర్ అమలు చేసిన పథకాలను నిలిపివేయడం దారుణమన్నారు. కొత్త పథకాలను అమలు చేయకున్నా కనీసం పాత పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే బీసీల జనాభా ఎంత ఉంటే అంత వాటా ఇచ్చి ఎన్నికల్లోకి వెళ్లాలని సూచించారు. దొంగ లెక్కలు, కాకిలెక్కలు కాకుండా వాస్తవ లెక్కలు తీయాలని కోరారు. మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, 'కాకా కాలేల్కర్ కమిషన్' నివేదికను తిరస్కరించారని, ఇది బీసీలకు కాంగ్రెస్ చేసిన ద్రోహం కాదా అని ప్రశ్నించారు. మండల్ కమిషన్‌ను మొరార్జీ దేశాయ్ నియమించారనీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు వాటిని పక్కన పెట్టాయని వాపోయారు. మళ్లీ కాంగ్రెసేతర ప్రధాని వీపీ సింగ్ వచ్చినప్పుడే కమిషన్ నివేదికను అమలు చేసిందని గుర్తు చేశారు. కేవలం ప్రాంతీయ పార్టీలు మాత్రమే బీసీలకు న్యాయం చేశాయని చెప్పారు. బీసీ సంఘాలతో కలిసి తాము చేసిన ఉద్యమాల వల్లే సావిత్రీబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

అసెంబ్లీ ప్రాంగణంలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో పాటు, మరో నాలుగు తీర్మానాలను బీసీ మహాసభ ఆమోదించింది. శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ తుల ఉమా, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీంద్ర సింగ్, సుమిత్రా తానోబా, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రూప్ సింగ్, ముఠా జైసింహా తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో సమానత్వం తీసుకురావాలి

- అదే సావిత్రిబాయికి నిజమైన నివాళి : రిటైర్డ్ ప్రొఫెసర్ దేవరాజు మహారాజ్
- ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమీలో సావిత్రిబాయి జయంతి



నవతెలంగాణ - ముషీరాబాద్

సమాజంలో సమానత్వాన్ని చాటడమే సావిత్రిబాయి పూలేకు అర్పించే నివాళి అవుతుందనిగా రిటైర్డ్ ప్రొఫెసర్ దేవరాజు మహారాజ్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతితోపాటు ఎస్.ఆర్.శంకరన్ ఐఏఎస్ అకాడమీ 9వ వార్షికోత్సవ సభ సురేందర్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని అకాడమీలో శుక్రవారం జరిగింది. సావిత్రిబాయి పూలే తాత్విక భావనలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరాజ్ మహారాజ్ మాట్లాడుతూ.. దేశంలో మొట్టమొదటి ఆదర్శ వివాహం చేసింది మహాత్మ జ్యోతిబాపూలే- సావిత్రిబాయి పూలే దంపతులేనని చెప్పారు. మాజీ ఐఏఎఫ్ఎస్ అడిషనల్ కమిషనర్ వై.సత్యనారాయణ మాటాడుతూ.. సావిత్రిబాయి పూలే ఈ సమాజంలో చాలా ఉన్నతమైన విలువలను అందించారని, ఆ విలువల కోసం విద్యార్థులు పాటుపడాలని సూచించారు. మహనీయుల జీవిత చరిత్రను అధ్యయనం చేయాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థు లకు వివరించారు. అకాడమీ ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో సాధించిన ప్రగతిని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.సతీష్ కుమార్ నివేదిక రూపంలో ప్రవేశపెట్టారు. అకాడమీని మొగ్గలోనే తుంచేయాలని కొందరు వ్యక్తులతోపాటు కొన్ని సంస్థలు ప్రయత్నించాయని, వాటన్నింటినీ అధిగమించి సమాజానికి ఉత్తమ మానవతా విలువలు కలిగిన అధికారులను అందించే కార్యక్రమాన్ని అకాడమీ చేపట్టిందని వివరించారు. అందులో భాగంగానే రాహుల్ బొంత ఐఏఎస్, కె.విద్యాధరి ఐఏఎస్, వి.సాహిత్య ఐపీఎస్, రవిశంకర్ బేత గ్రూప్ -ఏ, నల్లమోతు బాలకృష్ణ ఐఏఏఎస్, మోనిక అడుసు మిల్లి ఐఆర్ఎస్‌ను సాధించారని, 2024లో గోకమళ్ల ఆంజనే యులు, జి.శోభన్, యూపీఎస్సీ ఇంటర్వ్యూకి సెలెక్ట్ అయ్యారని చెప్పారు. వారి బాటలోనే విద్యార్థులందరూ చదువుకుంటూ ఉన్నత స్థానాల్లోకి వెళ్లి సంస్థ పేరుని నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవరాజు మహారాజు సతీమణి కృష్ణకుమారి, వై.సత్యనారాయణ సతీమణి డాక్టర్ లక్ష్మీదేవి, రిటైర్డ్ ఇంజినీర్ సిద్ధార్థ, ఫ్యాకల్టీ జగన్నాథ్ మన్నె, అకాడమీ సోషల్ మీడియా బాధ్యులు కోట మురళీకృష్ణ, కార్యాలయ సిబ్బంది బి.సంధ్యారాణి, సుమన్ దలోడ్, బి.రంజిత్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సావిత్రీబాయిపూలే గొప్ప సంస్కర్త, ఉద్యమశీలి

- ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సామాజిక రుగ్మతలను పారదోలేందుకు జీవితాంతం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త, ఉద్యమశీలి, స్త్రీ అభ్యుదయవాది సావిత్రీబాయి పూలే అని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ కొనియాడారు. సావిత్రీబాయి పూలే జయంతిని శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి లక్ష్మణ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్ తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ..విద్యద్వారానే వికాసం చెందుతారని బలంగా విశ్వసించి, బాలికా విద్య కోసం విశేష కృషి చేసిన మహనీయురాలని కొనియాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం 33 శాతం రిజర్వేషన్లు కల్పించేలా నారీశక్తి వందన్ అదినియమ్ చట్టాన్ని తీసుకొచ్చిందని వివరించారు. మహిళా సంఘాలకు ఆర్థికంగా సహాయపడుతున్నదని తెలిపారు. సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో మహిళలు రాజకీయాల్లో మరింత ఎక్కువ సంఖ్యలో రావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం సావిత్రీబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం శుభపరిణామమని చెపాపరు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించి జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. ఒక బీసీని ప్రధానమంత్రిగా, 27 మందిని కేంద్రమంత్రులుగా చేసిన ఘనత తమ పార్టీదేనని చెప్పారు. జాతీయ బీసీ కమిషన్ కు రాజ్యాంగ హెూదా కల్పించి, బీసీల హక్కులను కాపాడామని తెలిపారు.

నవతెలంగాణ

గెలవకపోవడం ఓటమికాదు..
మళ్లీ ప్రయత్నించకపోవడమే నిజమైన ఓటమి - శ్రీశ్రీ

శనివారం 04 జనవరి 2025
www.navatelangana.com

సంపాదకీయం

# అది 'మినీ భారత్'!



దేవతల దేశంగా పిలువబడే నేల కేరళ. అంతేకాదు, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా చెప్పబడే నేల. అనేక మతాలు, జాతులు, ప్రజలతో సహజీవనం చేస్తున్న సహనశీల తలం. వందశాతం సంపూర్ణ అక్షరాస్యత, సామాజిక చైతన్యంతో భాసిల్లుతున్న భూమి. చతాంబి స్వామి, శ్రీ నారాయణగురు, అయ్యన్‌కాళీ లాంటి సంఘ సంస్కర్తలు నడయాడిన నేల. ప్రగతిశీల సామరస్య పాలనలో దేశంలోనే ప్రత్యేకత సంతరించుకున్నది కేరళ. అలాంటి రాష్ట్రంలో ఆదినుంచి విద్వేష కుంపటి రగిలించాలను కుంటున్నది ఆరెస్సెస్-బీజేపీ. శబరిమల వివాదం ఒక ఎత్తయితే 'ది కేరళ స్టోరీ' వరకు అంతా అట్టర్ ప్లాపే. నిరంతరం లౌకికత్వాన్ని చాటే అక్కడి ప్రజలు ఎప్పటికప్పుడు విద్వేషపు కుట్రల్ని తిప్పి కొడుతూనే వున్నారు. అయినప్పటికీ సంఘ్ పరివార్ ఆశ చావడం లేదు. అవకాశం దొరికినప్పుడే కాదు, వీలు కల్పించు కుని మరీ విద్వేషాగ్ని రగిలి స్తున్నది.

> 'కులం, మతం, జాతీయత ఆధారంగా చేసే విద్వేష ప్రసంగాలు రాజ్యాంగం ఉపదేశించిన సౌభ్రాతృత్వానికి సవాళ్లు విసరడమే కాదు, దేశ ఐక్యతనూ దెబ్బతీస్తాయి' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా గుజరాత్‌లో ఇటీవల నిర్వహించిన ఓ సదస్సులో ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవంగా చూస్తే కూడా దేశం చాలా ప్రమాదకరమైన స్థితిలో ఉందని చెప్పడానికి ఇటీవల పార్లమెంట్‌లో అమిత్‌షా అంబేద్కర్ మీద చేసిన వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి.

మొన్నటికి మొన్న మహారాష్ట్ర మంత్రి నితీష్‌రాణే కేరళను 'మినీ పాకిస్థాన్' అంటూ చేసిన వ్యాఖ్య 'హిందూత్వ' పడగను మరోసారి తట్టిలేపింది. మతం పేరుతో ప్రజల్ని విభజిస్తూ పాలించాలనే వ్యూహాన్ని బహిర్గతపరిచింది. లౌకికవాదం, మత సామరస్యానికి కంచుకోట అయిన కేరళపై సంఘ్ పరివార్ చేసే విద్వేష ప్రచారాన్ని వెల్లడిచేసింది. బీజేపీకి చెందిన ఆ మంత్రి కాంగ్రెస్ అగ్రనేతలను ఉద్దేశించి 'కేరళ మినీ పాకిస్థాన్ అయినందునే వయనాడ్ నుంచి వారిద్దరు ఎంపీలుగా ఎన్నికయ్యారు' అని వ్యాఖ్యానించారు. ఒక మంత్రి ఇంకొక రాష్ట్రంపై చేసిన ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అంతరార్థమేంటి? లౌకికవాదులైన భారత ప్రజలను ఎటుతిప్పదలుచుకున్నారు కాషాయపు నేతలు.

చట్టసభల్లో ప్రజాప్రతినిధిగా ఎన్నికైనవారు భారతదేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడతానని, రాగ ద్వేషాలకతీతంగా పాలన అందిస్తానని రాజ్యాంగం మీద ప్రమాణం చేస్తారు. కానీ, మంత్రి రాణే వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే కాదు, మత సామరస్యానికి తీవ్ర విఘాతం కూడా. ఇలాంటివారికి మంత్రిగా కొనసాగే నైతిక హక్కు ఉందా? కేరళ రాష్ట్రం పాకిస్థాన్‌లోనే ఉన్నట్టుగా మాట్లాడిన తీరు తీవ్ర అభ్యంతరకరం. రాణే వ్యాఖ్యలు దేనికి సంకేతమో ప్రధాని నరేంద్రమోడీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌లు సమాధానం చెప్పాలి. ఎక్కడపడితే అక్కడే బీజేపీ-సంఘ్ పరివార్ నేతలు బహిరంగ సభల్లో, సదస్సుల్లో మతోన్మాద విషాన్ని చిమ్ముతుంటే భిన్నత్వంలో ఏకత్వం రోజురోజుకూ ప్రశ్నార్థకమవుతున్నది. ఇది ఒక్క హిందువులనో, ముస్లింలనో కాదు, ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది.

లౌకికవాదానికి, ప్రగతిశీల సమైక్యభావనకు పర్యాయపదంగా నిలిచే కేరళపై విద్వేష వ్యాఖ్యలు సిగ్గుచేటు. కేరళ అంటేనే ప్రగతి. అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతూ దేశాన్ని ఆకర్షిస్తున్నది. ఇది సంఘ్ పరివార్‌కు అస్సలు రుచించడం లేదు. అందుకే వామపక్షాల ఏలుబడిలోని 'ఎల్‌డీఎఫ్'ను ఎదుర్కోలేక విద్వేషాలతో ప్రజల్ని విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తున్నది. పైగా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులకూ కొర్రీలు పెడుతున్నది. రాయితీలు తగ్గించి పన్నుల భారం మోపుతున్నది. కేంద్ర భారాలు, హెచ్చుతగ్గులు ఎలా ఉన్నా తమ రాష్ట్రానికి లాభమా, నష్టమా అని బేరీజు వేసుకున్న తర్వాతే అక్కడ అమలుకు సిద్ధపడుతున్నది కేరళ సర్కార్.

'కులం, మతం, జాతీయత ఆధారంగా చేసే విద్వేష ప్రసంగాలు రాజ్యాంగం ఉపదేశించిన సౌభ్రాతృత్వానికి సవాళ్లు విసరడమే కాదు, దేశ ఐక్యతనూ దెబ్బతీస్తాయి' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా గుజరాత్‌లో ఇటీవల నిర్వహించిన ఓ సదస్సులో ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవంగా చూస్తే కూడా దేశం చాలా ప్రమాదకరమైన స్థితిలో ఉందని చెప్పడానికి ఇటీవల పార్లమెంట్‌లో అమిత్‌షా అంబేద్కర్ మీద చేసిన వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. అంతేకాదు, ఉత్తరప్రదేశ్‌లో ఈనెల పదమూడు నుంచి ప్రారంభం కానున్న మహాకుంభమేళాలో హిందూయేతరులకు దుకాణాలు కేటాయించవద్దని అఖిల భారతీయ అఖాడా పరిషత్ చీఫ్ మహంత్ రవీంద్ర పురీ వ్యాఖ్యా నించారు. 'వాళ్లు ఎక్కడబడితే అక్కడ ఉమ్మిలేస్తారు.. మూత్రం పోస్తారు. పవిత్ర మహాకుంభమేళా అపవిత్రం అయిపోతుంది.' అన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే బీజేపీ-ఆరెస్సెస్ నిలువెల్లా మతోన్మాద విషాన్ని నింపుకుని పాలన సాగిస్తోంది. ఈ విభజన సిద్ధాంతాలు, ఆర్థిక అసమానతలు, ప్రజల్ని ఐక్యంగా ఉంచలేవు. పైగా అట్టడుగువర్గాలకూ సామాజికన్యాయాన్ని అందించలేవు. తిరోగమన విధానాలకు నెలవైన మనుస్మృతిని వల్లెవేస్తూ విద్వేషవ్యాఖ్యలు చేసే వారి విషపు కోరల్ని ప్రజలే పీకి పారేయాలి.

---

# 'సమీకృత' గురుకులాలు-ఆవశ్యకత

"భారతదేశ బంగారు భవిష్యత్తు..తరగతి గదిలో రూపొందించబడుతుంది"-పండిత్ జవహార్ లాల్ నెహ్రూ. మనకు స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బయిఏడేండ్లు గడిచినప్పటికీ ఆ దిశగా విద్యారంగం రూపొం దించబడలేదన్నది వాస్తవం. మౌలికంగా కొంత మార్పులైతే వచ్చినప్పటికీ అందరికీ విద్య అందే దిశగా అది అందడం లేదు. దేశంలో విస్తారమైన సహజవనరులు, అపారమైన మానవ సంపద వృద్ధి చెందినప్పటికీ ఆశించిన పద్ధతిలో మానవ వనరులు అభివృద్ధి చెందకపోవడం శోచనీయం. అయితే విద్యారంగ అభివృద్ధికి విద్యానిపుణులు, మేధావులు ప్రత్యామ్నాయ విధానాలకు తగిన సలహాలు, సూచనలు చేయడం అభినందనీయం. కాకపోతే అలా రూపొందిన విద్యా విధానాల ఫలితాలు ఈడేరకముందే ప్రజా బాహుళ్యం నుండి వచ్చిన వ్యతి రేకత, నిరుద్యోగం, కుచించుకుపోయే సంప్రదాయాలు, విలువలు పాలక వర్గాలను మిక్కిలి ఒత్తిడికి లోనుచేస్తున్నవి. ఈ పరిస్థితి ఆమూలాగ్రంగా అర్థం చేసుకుంటే తప్ప ఆశించిన ఫలితాలు రావు. అంటే అనివార్యంగా ప్రస్తుతమున్న స్థితి నిర్ధారించుకుని, మదింపు చేసుకొని ప్రత్యామ్నాయ విధానాల్ని రూపొందించుకోవాల్సి ఉంటుంది.

పూర్వ ప్రాథమిక దశలో (3-5వయస్సు విద్యార్థులు) గ్రూప్ అంగన్‌వాడీ, నర్సరీ, ఎల్‌కెజి, యుకేజి పేర్లతో పిల్లల



కోసం ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు శిక్షణనిస్తున్నవి. ప్రాథమిక దశలో (5-10వయస్సు) గ్రూప్ ఒకటి నుండి ఐదు తరగతుల వరకు మండల ప్రాథమిక, ప్రభుత్వ ప్రాథమిక, మినీ గురుకుల పాఠ శాలలుగా ప్రభుత్వ, ప్రయివేటు ఆధ్వర్యంలో నిర్వహిచబడుచున్నవి. ప్రాథమికోన్నత దశలో (10-12 వయస్సు) గ్రూప్ ఆరేడు తరగతులు,ఉన్నత ప్రాథమిక, ప్రాథమికోన్నతపాఠశాలలుగా ప్రభుత్వ ఆధ్వర్యంలో , ప్రయివేటు యాజమాన్యంలో నిర్వహించబడుచున్నవి. ఇందుకు అదనంగా ఆరు, పది తరగతులు జవహార్ నవోదయ, మోడల్ స్కూల్స్,సైనిక్ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు, స్పోర్ట్స్ స్కూల్స్, కస్తూర్బాగాంధీ, ప్రభుత్వ గురుకుల విద్యాలయాలు, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ గురుకులాలు ఇలా రకరకాల అంతరాల దొంతరగా రూపొం దుకున్నాయి. అయితే రాజ్యాంగంలో విద్య ఉమ్మడి జాబితాలో పొందుపర్చబడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పాఠశాలలు నడుస్తున్నప్పటికీ కొన్ని ధార్మిక సంస్థలు, మతపరమైన సంస్థలు, మరికొన్ని స్వచ్ఛంధ సంస్థలు కూడా పాఠశాలలు నిర్వహిస్తున్నవి.

కేంద్రం తీసుకొచ్చిన జాతీయ నూతన విద్యావిధానం విద్యారంగాన్ని మరింత సంక్లిష్టంలోకి నెట్టేసే విధంగా రూపొందించబడింది. ప్రస్తుతమున్న 10+2 విద్యా విధానం 5+3+3+4 విద్యా విధానంగా మార్చ బడింది. ఈ ప్రకారంగా నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి, ఒకటి, రెండు తరగతులు, పూర్వ ప్రాథమిక 3,4,5 తర గతులు, ప్రాథమిక విద్య 6,7,8 తరగతులు, 9,10,11,12 తరగతులు ఉన్నత విద్యగా రూపుదిద్దుకొంటాయి. ఇంటర్మీడియట్ బోర్డు రద్దయి పాఠశాల డైరెక్టరేట్‌లో మిలితమవుతుంది. ప్రస్తుతం కొన్ని పాఠశాలలు పది తరగతులు వరకు నిర్వహిస్తుండగా మరి కొన్ని పాఠశాలు పన్నెండు తరగతుల వరకు (సిబిఎస్‌ఇ) నిర్వహించడం వలన కళాశాల విద్యావిధానంలో కొంత గందరగోళం, అస్పష్టతకు దారితీసే పరిస్థితిలో జాతీయ నూతన విద్యావిధానం ఉందని చెప్పవచ్చు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయబడిన ప్రభుత్వ గురుకులాల్లో భాగంగా తెలంగాణలో 35 ప్రభుత్వ గురుకులాలు ఉండగా 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత వాటికి అదనంగా మరో 992 కొత్త గురుకులాలు ఏర్పాటు చేయబడినవి. ఇవన్నీ కూడా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పరిధిలో నడుస్తున్నవి. ఆయా చట్టబద్ధత కలిగిన సొసైటీల ద్వారా కొన్ని 5-10 తరగతులు, మరికొన్ని 5-12 తరగతులు నిర్వహిస్తున్నవి. ఇందులో సగానికి సగం అద్దె భవనాలు, అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నవి. అందులోనూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, విద్యావాలంటీర్లతో విద్యాభోదన చేస్తున్నది. ఆయా పాఠశాలలు కాలనిర్ణయ పట్టిక, తరగతుల నిర్వహణ, ఉపాధ్యాయుల జీతభత్యాల్లో ఏక రూపత లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది మిక్కిలి అసంతృప్తికి గురౌతున్నది వాస్తవం.

కొత్తగా నియోజకవర్గానికొకటి చొప్పున సమీకృత గురుకులాల్ని ప్రారంభించాలని కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపన చేస్తున్నది. ఇది మంచి విషయమే కానీ, అంతకుముందు ఉన్న గురుకులాల్లో కూడా సౌకర్యాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉన్నది. దేశంలో కులాలు,మతాలుగా ప్రజల్ని విభజించి పాలిస్తున్న ప్రస్తుత తరుణంలో దళితులు,గిరిజనులు, బడుగు బలహీన వర్గాలకు చెందిన బిడ్డలందరూ ఒకే క్యాంపస్‌లో, ఒకే గొడుకు కింద విద్యనభ్యసించుటకు సమీకృత గురుకులాల ఏర్పాటు అత్యంత ఆవశ్యకం. ఆచరణలో ఇది సాధ్యం కావాలంటే పాలకులకు కావాల్సింది సంకల్పం, చిత్తశుద్ధి. దీంతో పాటు విద్యారంగానికి వార్షిక బడ్జెట్‌లో కనీసం ఇరవైశాతం నిధుల కేటాయింపు. ఇలా ఆలోచించి అడుగు ముందుకేస్తే గనుక గురుకులాల్లో సమీకృత భావనను సార్థకం చేయవచ్చు.

- సురభి జగపతిరావు, 9441772772

---

# అంబేద్కర్, హిందూ మితవాదం, భారత జాతీయ కాంగ్రెస్



రామ్ పునియానీ

ఇటీవలే పార్లమెంటులో జరిగిన (డిసెంబర్ 2024) చర్చల్లో హోంశాఖ మంత్రి అమిత్ షా ఒకవైపు బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమా నిస్తూ, మరోవైపు భారత జాతీయ కాంగ్రెస్ అంబేద్కర్‌తో చాలా ఘోరంగా ప్రవర్తించి ందని చెప్పే ప్రయత్నం చేస్తూ ప్రసంగం చేశాడు."అంబేద్కర్ పేరును ఉచ్చరించడం ఒక ఫ్యాషన్ అయిపోయిందన్న" అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ, తన పదవికి రాజీనామా చేసి, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా ప్రజలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ ప్రతిచర్యలు షా రాజకీయ ప్రతిష్టను ఖచ్చితంగా తగ్గిస్తాయి. అంతేకాక తన పార్టీ అంబేద్కర్‌కు ఎలా న్యాయం చేస్తూ వచ్చిందో చెపుతూ తన పార్టీని స్వయంగా అభినందించాడు. దానిలో భాగమే విగ్రహాల నిర్మాణం తొలి అడుగు అని అన్నాడు. దీన్ని అంబేద్కర్ ప్రశంసించి ఉండేవాడా?

బాబాసాహెబ్ పుట్టినరోజును 'సామాజిక సామరస్య దినోత్సవంగా' జరుపుకోవడం మొదలుపెట్టడాన్ని అమిత్ షా గొప్పతనంగా చెప్పుకున్నాడు. కానీ బాబాసాహెబ్ కన్న కలలకు ఇది పూర్తిగా విరుద్ధమైనది. ఆయన కుల నిర్మూలన గురించి మాట్లాడినాడు. కుల రహిత సమాజంపై అంబేద్కర్ దార్శనికతను, ఆయన కలల్ని తిరస్కరించే విధంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లేదా ఆరెస్సెస్-బీజేపీ లు సామాజిక సామరస్య దినోత్సవాన్ని ప్రారంభించడం ద్వారా తమ ఎజెండాను ముందుకు తీసుకొనిపోతున్నాయి. వివిధ కులాల మధ్య సామ రస్యతతో కుల వ్యవస్థను శాశ్వతంగా కొనసాగించడాన్ని సామాజిక సామరస్య దినం సూచిస్తుంది.

లోతైన తాత్వికస్థాయిలో బీజేపీ కూడా, హిందూ సమాజం ప్రపంచ ఆదియుగం నుండి, బ్రాహ్మణులు నోటి నుండి, క్షత్రియులు భుజాల నుండి, వైశ్యులు తొడల నుండి, శూద్రులు పాదాల నుండి సృష్టించబడ్డారని ప్రకటించే దీన దయాళ్ ఉపాధ్యాయ యొక్క 'సమగ్ర మానవ వాదాన్ని' సమర్థిస్తుంది.వారి భావజాలం ప్రకారం ఈ విభజన, సమాజానికి స్థిరత్వాన్ని ఇస్తుంది. ఒకవేళ ఆరెస్సెస్ - బీజేపీలు నిజంగా అంబేద్కర్‌కు న్యాయం చేసి ఉండి ఉంటే, వారు దళితులు, బీసీలు, షెడ్యూల్డ్ తెగల వారికి రిజర్వేషన్లను నీరుగార్చే విధంగా సమాజంలో ఆర్థికంగా బలహీన పడిన వర్గాలకు రిజర్వేషన్‌లు ప్రవేశపెట్టి ఉండెడివారు కాదు. దళితులకు వ్యతిరేకంగా దుర్మార్గాలు,దౌర్జన్యాలను తగ్గించి,ఆ విధంగా మహిళలపై హింస కూడా తగ్గించే విధంగా వారు భరోసా ఇచ్చి ఉండెడివారు.

కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను విస్మరించింది, ఆయనకు న్యాయం చేయలేదనే అమిత్ షా వాదనను లోతుగానే పరిశీలించాల్సిన అవసరం ఉంది. సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన కృషికి హిందూ జాతీయవాద శక్తులు సహకారాన్ని అందించలేదు, సహాయం చెయ్యలేదు. జాతీయ నాయకత్వం అంటరానితనం, కుల సమస్యను ముఖ్యంగా 1930 దశాబ్దాల నుంచి చాలా తీవ్రంగా తీసుకుంది.

1932 నుండి గాంధీ అంటరానితనం, కుల వ్యవస్థల నిర్మూలన సమస్యను తీసుకొని రెండేండ్ల పాటు ఆ సమస్య పై చాలా తీవ్రంగా కేంద్రీకరించి పని చేశాడు. కులాంతర వివాహం చేసుకోని ఏ పెళ్ళి జంటకు ఆశీర్వాదం ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నాడు. సబర్మతీ ఆశ్రమంలో ఒక దళిత కుటుంబానికి ఆశ్రయం కల్పించాడు. ఆ కారణంగా ఆశ్రమానికి దాతలు నిధులు ఇవ్వకుండా నిలుపుదల చేశారు, దళిత కుటుంబానికి ఆశ్రయం ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలతో ఆశ్రమం మూతపడింది. ఆయన లోక్ సభకు ఎన్నిక కావడాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించినప్పటికీ, ఆ ఎన్నికల రణరంగంలో బాబాసాహెబ్‌ను వ్యతిరేకించిన వారిలో హిందూ మహాసభ కూడా భాగస్వామిగా ఉంది.ఆ తర్వాత ఆయన రాజ్యసభకు నియమితులయ్యారు.ఆ తరువాత మధ్యంతర ప్రభుత్వంలో అంబేద్కర్ భాగస్వామి కావాలని పట్టుపట్టింది కూడా గాంధీజీనే.అదే విధంగా గాంధీజీ సలహా మేరకు భారత రాజ్యాంగ రచనా కమిటీకి అంబేద్కర్‌ను అధ్యక్షుడ్ని చేశారు. అంబేద్కర్ ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని, ఆర్టికల్ 370ను వ్యతిరేకించాడనీ, ఆ కారణంగానే ఆయన కేబినెట్ మంత్రి పదవికి రాజీనామా చేశాడని అమిత్ షా ప్రచారం కూడా చేశాడు. ప్రజాస్వామిక నిబంధనల ప్రకారం పని చేసిన మంత్రివర్గంలో ఆయన ఉన్నాడు. కాశ్మీర్ విషయంలో, ఆయన జోనల్ ప్రజల అభిప్రాయాలను కోరుకున్నాడు. స్థానిక



జాతుల వైవిధ్యాలకు న్యాయం జరగాలనే ఉద్దేశ్యంతో కాశ్మీర్ లోయ, జమ్మూ ,లడాఖ్ లు వేరువేరుగా ఉండాలని కోరుకున్నారు. ఈ కారణాలతోనే అంబేద్కర్ మంత్రి పదవికి రాజీనామా చేశాడనే అమిత్ షా అభిప్రాయాలు పూర్తిగా తప్పు.

అంబేద్కర్ మంత్రి పదవికి రాజీనామా చేయడానికి అసలు కారణం పార్లమెంటులో హిందూ కోడ్ బిల్లు అసలు రూపంలో ఆమోదం పొందడంలో వైఫల్యం చెందడమే.హిందూ కోడ్ బిల్లు ముసాయిదాను తయారు చేయాలని అంబేద్కర్‌ను జవహర్ లాల్ నెహ్రూనే కోరాడు.ఆ ముసాయిదాను తయారుచేసే క్రమంలోనే అంబేద్కర్ మహిళల సమానత్వాన్ని ముందుకు తెచ్చి పెట్టాడు.ఈ బిల్లు నేపథ్యం ఏమంటే, వివిధ మతాలకు చెందిన వారి వ్యక్తిగత చట్టాలకు దిశా నిర్దేశం చేసే వివిధ కోడ్‌లు ఉన్నాయి. వివాహం, విడాకులు, వారసత్వం, పిల్లల సంరక్షణల విషయంలో వ్యక్తిగత చట్టాలు వర్తిస్తాయి. హిందూ కోడ్ బిల్లు బహిర్గతం కావడంతో దానికి వ్యతిరేకంగా గావు కేకలు మొదలయ్యాయి. ఇది, సనాతన ధర్మాన్ని నాశనం చేసే ప్రయత్నమని ఆర్‌ఎస్‌ఎస్, దాని పరివారం ప్రచారం చేశాయి. పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించి, డిసెంబర్ 12, 1949న ఆరెస్సెస్ అనుచరులు అంబేద్కర్, నెహ్రూల దిష్టిబొమ్మలను దహనం చేశారు. పెద్ద సంఖ్యలో బహిరంగ సభలు నిర్వహించి, హిందూ కోడ్ బిల్లు, అంబేద్కర్‌లకు వ్యతిరేకంగా ఒక సామాజిక వాతావరణాన్ని సృష్టించారు. కాంగ్రెస్‌లో ఆంతరంగికంగా చాలామంది హిందూ కోడ్ బిల్లును వ్యతిరేకించిన వారు కూడా ఉన్నారు. ఆ విధంగా హిందూ కోడ్ బిల్లు ఆమోదం పొందలేదు,ఆ కారణంగా తీవ్ర మనోవేదనకు గురైన అంబేద్కర్ రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆయన రాజీనామాను కాంగ్రెస్ పార్టీకి ఆపాదిస్తూ ఆయన్ను అవమానించడం, విస్మరించడం అంటే వాస్తవాన్ని వక్రీకరించడమే. అయితే, భారత రాజకీయాల్లో అంబేద్కర్, ఆరెస్సెస్ పరివారంల భావజాలం పరస్పర వ్యతిరేక ధ్రువాలుగా ఉన్నాయి.

గడిచిన మూడు దశాబ్దాలకు మించిన కాలం నుంచి ఆరెస్సెస్ - బీజేపీలు ఎన్నికల కారణాలతో దళితులు, ఆదివాసీలను గెలవడానికి ప్రయత్నం చేస్తున్నారు. వారి మద్దతును సాధించడం కోసం వారు కొన్ని చర్యలు చేపట్టారు. కుల బానిసత్వం నుండి వారిని విముక్తి చేయడంలో రాజ్యాంగం పాత్రను చూస్తున్నారు కాబట్టి దళితుల్లో అధికులు రాజ్యాంగానికి అనుబంధంగా ఉన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో దళితులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడానికి ఉన్న కారణాలలో ఇదొక ప్రధాన కారణం. అంబేద్కర్ అందించిన మరొక పెద్ద సహకారం, భారత రాజ్యాంగ రూపకల్పన. దీన్ని కూడా బీజేపీ మాతృసంస్థ ఆరెస్సెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. "భారత కొత్త రాజ్యాంగం గురించిన దారుణమైన విషయం ఏమంటే, దానిలో ఎలాంటి భారతీయత లేదు. దానిలో ప్రాచీన భారతీయ రాజ్యాంగ చట్టాలు, సంస్థలు, పేర్లు, పదాల ఊసే లేదు" అని ఆరెస్సెస్ అనుబంధ పత్రిక ఆర్గనైజర్‌లో నవంబర్ 30, 1949న ప్రచురితమైన వ్యాసంలో పేర్కొంది. అదే విధంగా హిందూత్వ రాజకీయాల భావజాలానికి పితామహుడు అయిన సావర్కర్ కూడా, భారత రాజ్యాంగం లో "భారతీయత అనేది లేదు" అని పేర్కొన్నాడు.

అంబేద్కర్ అందించిన రెండు ప్రధాన సేవల్ని వ్యతిరేకించడంలో బలమైన స్థానాలను కలిగి ఉన్న అమిత్ షా, అంబేద్కర్ కు తగిన గౌరవాన్ని ఇచ్చింది బీజేపీ మాత్రమే అని చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నాడు. వారి చర్యలన్నీ ప్రతీకాత్మకమైనవి, అవి వాస్తవమైనవి కాదు. పాకిస్థాన్ ఏర్పాటు "మనకొక విషాదం", అది స్థూల విషాదానికి, ముఖ్యంగా దళితుల బానిసత్వానికి మార్గాన్ని తెరిచే హిందూ మత రాజ్యానికి మార్గాన్ని సుగమం చేస్తుందని అంబేద్కర్ తన సవరించిన రచన "థాట్స్ ఆన్ పాకిస్థాన్"లో పేర్కొంటాడు. అమిత్ షా ప్రధాన ఎజెండా హిందూమత రాజ్య స్థాపన, అంటే బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రధాన విలువలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం లాంటి లక్ష్యాలకు పూర్తిగా వ్యతిరేకమైన ఎజెండా.

("న్యూస్ క్లిక్" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్,9848412451

> అంబేద్కర్ అందించిన రెండు ప్రధాన సేవల్ని వ్యతిరేకించడంలో బలమైన స్థానాలను కలిగి ఉన్న అమిత్ షా, అంబేద్కర్ కు తగిన గౌరవాన్ని ఇచ్చింది బీజేపీ మాత్రమే అని చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నాడు. వారి చర్యలన్నీ ప్రతీకాత్మకమైనవి, అవి వాస్తవమైనవి కాదు. పాకిస్థాన్ ఏర్పాటు "మనకొక విషాదం", అది స్థూల విషాదానికి, ముఖ్యంగా దళితుల బానిసత్వానికి మార్గాన్ని తెరిచే హిందూ మత రాజ్యానికి మార్గాన్ని సుగమం చేస్తుందని అంబేద్కర్ తన సవరించిన రచన "థాట్స్ ఆన్ పాకిస్థాన్"లో పేర్కొంటాడు. అమిత్ షా ప్రధాన ఎజెండా హిందూమత రాజ్య స్థాపన, అంటే బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రధాన విలువలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం లాంటి లక్ష్యాలకు పూర్తిగా వ్యతిరేకమైన ఎజెండా.


> అంబేద్కర్ మంత్రి పదవికి రాజీనామా చేయడానికి అసలు కారణం పార్లమెంటులో హిందూ కోడ్ బిల్లు అసలు రూపంలో ఆమోదం పొందడంలో వైఫల్యం చెందడమే.హిందూ కోడ్ బిల్లు ముసాయిదాను తయారు చేయాలని అంబేద్కర్‌ను జవహర్ లాల్ నెహ్రూనే కోరాడు.ఆ ముసాయిదాను తయారుచేసే క్రమంలోనే అంబేద్కర్ మహిళల సమానత్వాన్ని ముందుకు తెచ్చి పెట్టాడు.ఈ బిల్లు నేపథ్యం ఏమంటే, వివిధ మతాలకు చెందిన వారి వ్యక్తిగత చట్టాలకు దిశా నిర్దేశం చేసే వివిధ కోడ్‌లు ఉన్నాయి. వివాహం, విడాకులు, వారసత్వం, పిల్లల సంరక్షణల విషయంలో వ్యక్తిగత చట్టాలు వర్తిస్తాయి. హిందూ కోడ్ బిల్లు బహిర్గతం కావడంతో దానికి వ్యతిరేకంగా గావు కేకలు మొదలయ్యాయి. ఇది, సనాతన ధర్మాన్ని నాశనం చేసే ప్రయత్నమని ఆర్‌ఎస్‌ఎస్, దాని పరివారం ప్రచారం చేశాయి.

---

# అంధుల అక్షరశిల్పి... లూయిస్ బ్రెయిలి



పి.రాజశేఖర్
9490098018



'అంధత్వం శరీరానికే కానీ.. మేధస్సుకు ఏ మాత్రం కాదు.' అని నిరూపిం చాడు లూయిస్ బ్రెయిలీ. అంధులు అంధత్వంతో బాధపడకుండా శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించే విధంగా ముందుకు నడి పించే ధైర్యాన్నిచ్చాడు. కష్టపడితే తన దరికి రానిది ఏమీ లేదని, ఆశయంతో ముందుకు సాగాలనే సంకల్పాన్ని పెంపొందించాడు. పద్దెనిమిదో శతాబ్దంలోనే చీకట్లో మగ్గుతున్న అంధుల జీవితాల్లో వెలుగులు నింపాడు. లూయిస్ బ్రెయిలీ జయంతి నేడు.ఈ సందర్భంగా ఆయన అంధత్వాన్ని జయించి కొత్తలోకాన్ని సృష్టించిన తీరును ప్రతిఒక్కరూ నేడు తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఎందుకంటే, సమాజంలో కండ్లుండి కూడా గుడ్డివారుగా జీవిస్తున్న అనేకమందికి లూయిస్ బ్రెయిలీ జీవితం ఆదర్శం.

ప్రపంచంలోని అంధులందరికి అక్షర జ్ఞానాన్ని ప్రసాదించిన శాస్త్రీయ మేధావి అయిన లూయిస్ బ్రెయిలి ఫ్రాన్స్ కు చెందినవ్యక్తి. పారిస్ నగరానికి 20 మైళ్ల దూరంలోనున్న మారుమూలలో రాన క్రూవె గ్రామంలో మౌనిక్ సైమన్ దంప తులకు జనవరి 4, 1809లో జన్మించాడు. తీవ్ర దారిద్ర్యరేఖలో ఉన్న నిరుపేద కుటుంబం వారిది. వారికి కలిగిన ముగ్గురు సంతానంలో చివరి వాడే లూయిస్ బ్రెయిలీ. ఈ దంపతులు వృత్తిరీత్యా చర్మకారులు. లెదర్ ఉపయోగించి జీన్లు, రకాల సామాగ్రి తయారుచేసి చుట్టుపక్క ఊళ్లల్లో అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. లూయిస్ బ్రెయిలీ చాలా చురుకైన వాడు. మూడేండ్ల వయసున్నప్పుడే వాళ్ల అన్న పుస్తకాలు చదివేవాడు. తన తండ్రితో ఒక రోజు గుర్రపు జీన్లు తయారుచేసుకునే వాళ్ల షాపుకు వెళ్లాడు. అక్కడున్న పదునైన చువ్వ, కత్తులతో తండ్రిని అనుకరిస్తున్నాడు. తండ్రి కూడా పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఓ పదునైన కత్తి ఎగిరి వచ్చి ఒక కంటిలో గుచ్చుకుంది. స్థానిక హాస్పిటల్‌లో వైద్యునికి తల్లిదండ్రులు చూపించారు. బీదరికం కారణంగా మంచి వైద్యం అందించలేకపోవడంతో కంటిచూపు మొత్తం పోయింది. మొదట ప్రమాదానికి గురైన కన్ను కొంత కాలానికే ఇన్‌ఫెక్షన్ అయి రెండవ కంటిచూపు తన ఐదోయేటా పూర్తిగా కోల్పోయి అంధత్వానికి దారితీసింది. అందరిలాగానే తన కొడుకు చదువుకోవాలనే ఆశయంతో లూయిస్ బ్రెయిలిని అక్క,అన్నతో పాటుగా వారి గ్రామంలోనున్న పాఠశాలకు పంపించారు. ఆ పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ అద్భుతమైన ప్రతిభను కనబరిచాడు. ఈ ప్రతిభకు అంధత్వం అడ్డురావద్దనే అతని తండ్రి చెక్కపై మేకుల అక్షరాల రూపంలో బిగించి వాటిని తాకడం ద్వారా అక్షర జ్ఞానం కలిగించాడు. చదువుకోవాలనే పట్టుదలను, అతని తెలివితేటల్ని చూసి ఉపాధ్యాయులే ఆశ్చర్యానికి లోనయ్యేవారు.

ప్రపంచంలో మొదటగా 1784లో వాలంటీన్ హవే చేత ప్రారంభమైన అంధుల పాఠశాలలో పుస్తకాలు అన్ని కాగితంపై మేకులతో ఉబ్బెత్తుగా చేసి అంధులు తడమడం ద్వారా గుర్తుపట్టేట్లు చేసి విద్యాబోధన చేసేవారు. ఈ పుస్తకాలు పెద్దగా బరువుగా ఖరీదైనవిగా ఉండడం వల్ల వీటి ద్వారా విద్యాభ్యాసం సాధ్యపడేది కాదు. 1821లో చార్లెస్ బార్బీయర్ అనే సైనిక అధికారి సైనికులు చీకటిలో కూడా తాను పంపిన సమాచారాన్ని గుర్తించేందుకు పన్నెండు చుక్కలతో సంకేతలిపిని తయారు చేశారు. దీని గురించి తెలుసుకున్న బ్రెయిలీ పన్నెండు చుక్కలకు ఆరు చుక్కలు తగ్గించి వాటిని పేర్చుతూ అక్షరాలు ,పదాలు, అంకెలు, సంగీత చిహ్నాలు రూపొందించారు. 1831లో ఆరు చుక్కల లిపిని కనుగొన్నప్పటికి కూడా ప్రశాంతంగా ఉండకుండా నిరంతరం శ్రమిస్తూ 1839లో సున్నితమైన సులభతరమైన డెకాపాయింట్ అను కొత్త పద్ధతిని ఉపయోగించారు. పేపరుపై రంధ్రాలు సులభంగా చేసే పద్ధతిని కనిపెట్టి బ్రెయిలీ లిపిని అభివృద్ధి పరిచాడు. లూయిస్ మంచి సంగీత విద్వాంసుడు. ఇతను 1834 - 1839 వరకు ఫ్రాన్స్ దేశంలోనున్న చర్చిల్లో సంగీత ప్రదర్శనలు ఇచ్చేవాడు. వాలంటీన్ హవే చనిపోయిన తర్వాత అనంతరం వచ్చిన అంధుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా వచ్చినటువంటి డాక్టర్ అలెగ్జెండర్ ఫ్రాన్సిస్ లూయిస్‌ను చరిత్ర పుస్తకాన్ని మొత్తం బ్రెయిలి లిపిలోకి అనువాదం చేసినందుకు తన ఉద్యోగం నుండి తీసేసాడు. లూయిస్ బ్రెయిలీ నాడు ఎంతో కష్టపడి సాధించిన ఈ లిపి నేడు అంధులకు చాలా ఉపయోగకరంగా మారింది. ఈ లిపి ద్వారా అంధులు ఇతరులు సహాయం లేకుండా వారు చదవగలరు, రాయగలరు. అంధులకు జ్ఞాన వెలుగులు ప్రసాదించిన లూయిస్ బ్రెయిలీ 1852 జనవరి 6న 43 ఏండ్ల వయసులోనే చనిపోయారు. ఆయన మరణ శతాబ్ది సందర్భంగా లూయిస్ బ్రెయిలీ పేరుతో అమెరికా డాలర్‌ను, ఇండియా రెండు రూపాయల నాణేన్ని విడుదల చేసి గౌరవించాయి.

(నేడు లూయిస్ బ్రెయిలి జయంతి)

> 1821లో చార్లెస్ బార్బీయర్ అనే సైనిక అధికారి సైనికులు చీకటిలో కూడా తాను పంపిన సమాచారాన్ని గుర్తించేందుకు పన్నెండు చుక్కలతో సంకేతలిపిని తయారు చేశారు. దీని గురించి తెలుసుకున్న బ్రెయిలీ పన్నెండు చుక్కలకు ఆరు చుక్కలు తగ్గించి వాటిని పేర్చుతూ అక్షరాలు ,పదాలు, అంకెలు, సంగీత చిహ్నాలు రూపొందించారు. 1831లో ఆరు చుక్కల లిపిని కనుగొన్నప్పటికి కూడా ప్రశాంతంగా ఉండకుండా నిరంతరం శ్రమిస్తూ 1839లో సున్నితమైన సులభతరమైన డెకాపాయింట్ అను కొత్త పద్ధతిని ఉపయోగించారు.



# పాఠశాలల్లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులు

## ఈ ఏడాది 500 నుంచి వెయ్యిలోపు ఏర్పాటుకు చర్యలు

- ట్రాఫిక్ రూల్స్‌పై పాఠ్యాంశంగా చేర్చేలా క్యాబినెట్‌లో చర్చిస్తాం
- రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలి
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ప్రారంభం

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

పిల్లలకు చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించేందుకు యూనిసెఫ్ సహకారంతో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్టు రవాణా బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్‌తో కలిసి 'జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను' మంత్రి ప్రారంభించారు. అంతకుముందు మంత్రి పాఠశాల విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రతపై ప్లకార్డులతో అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. 'ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం.. రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం' పోస్టర్, పాంప్లెట్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రోడ్డు భద్రత మాసోత్సవాలను ఈనెల 31 వరకు నిర్వహిస్తామని చెప్పారు. ప్రమాదాల నివారణకు ప్రజలందరికీ రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తామన్నారు. రవాణా, పోలీసు, విద్యాశాఖతోపాటు ఇతర శాఖలన్నీ రోడ్డు భద్రతపై అవగాహన చేసుకొని అమలు చేయడంతోపాటు ప్రజలను చైతన్యవంతులను చేసి సామాజికంగా ముందుకు వెళ్లాలన్నారు. ఏ విషయమైనా చిన్నప్పుడు నేర్చుకున్నది పెద్దయిన తర్వాత ఉపయోగపడుతుందని ఆ ఉద్దేశంతోనే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో యూనిసెఫ్ వారి సహకారంతో ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది సుమారు 500 నుంచి వెయ్యి పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఈనెల 7న జాతీయ రోడ్డు రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీచే జాతీయ రవాణా సమావేశం జరుగుతుందని తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్‌ను బ్రేక్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని, ఇప్పటివరకు 7వేల మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు చేసిన వారి లైసెన్సులను రద్దు చేస్తామని, అయినా అలాగే చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రతి ఒక్కరూ మరో ముగ్గురికి చెప్పాలని మంత్రి సూచించారు. అనంతరం ఎలక్ట్రికల్ స్టేషన్‌ను ప్రారంభించారు.

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దేశంలో ప్రతి గంటకూ 20 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారని, ఈ విషయమై ప్రతి ఒక్కరినీ చైతన్యపరచాలని అన్నారు. రోడ్ సేఫ్టీ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలీసులు ఉన్నా లేకున్నా.. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. రవాణా శాఖ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసే సమయంలో దరఖాస్తుదారునికి ఏ మేరకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ఉన్నది లేనిది పరిశీలించిన తర్వాతే లైసెన్సులు మంజూరు చేస్తున్నామని, వాహనాల ఫిట్‌నెస్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్, జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్లు సి.రమేష్, మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, డీటీసీలు రవీంద్ర కుమార్, కిషన్, సదానందం, ఆర్టీవోలు పురుషోత్తం రెడ్డి, సిపి.వెంకటేశ్వర్‌రావు, ఎంవీఐలు పాల్గొన్నారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు రక్షణ చర్యలు చేపట్టాలి

## డిప్యూటీ డైరెక్టర్‌కి సీఐటీయూ విజ్ఞప్తి

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

సింగరేణిలో ఓబీలు, అండర్‌గ్రౌండ్‌లతో సహా అన్ని విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారనీ, వారికి సరైన రక్షణ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (ఎస్సీకేఎస్-సీఐటీయూ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సౌత్ సెంట్రల్ జోన్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ (జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ)కు కోల్‌మైన్స్ సేఫ్టీ స్టాండింగ్ కమిటీ మెంబర్ మానస ముఖర్జీ నాయకత్వంలో యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు కల్పిస్తున్న రక్షణ సౌకర్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా సింగరేణిలో మైన్ ప్రమాదాల్లో మరణిస్తున్న, గాయాలపాలవుతున్న కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు సరైన రక్షణ సౌకర్యాలు కల్పించకుండా, శిక్షణ ఇవ్వకుండా టార్గెట్లు పెట్టి పనిభారం పెంచుతుండటంతో ప్రమాదాలు పెరుగుతున్న తీరును వివరించారు. లోడింగ్‌తో ఉన్న ఎక్స్‌ప్లోజివ్ వాహనాలలో నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్ట్ కార్మికులను తరలించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన కాంట్రాక్ట్ కార్మికులకు సేఫ్టీ స్టాండింగ్ కమిటీ సమావేశాలలో బొగ్గు మంత్రిత్వ శాఖామంత్రి ప్రకటించిన రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియో కూడా సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు అమలు చేయని విషయాన్ని ప్రస్తావించారు. మైన్స్ చట్టం సెక్షన్ 52, 53 ప్రకారం చెల్లించాల్సిన ఆర్జిత సెలవులను కూడా కాంట్రాక్ట్ కార్మికులకి అమలు చేయట్లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కన్వేయన్స్ వాహనాలపై నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్ట్ కార్మికులతో రోజుకు 12 గంటల పని చేయిస్తూ వారాంతపు సెలవులు కూడా అమలు చేయడంలేదనీ, అదనపు పనికి చెల్లించవలసిన అదనపు వేతనాలు కూడా చట్ట ప్రకారం చెల్లించట్లేదని ప్రస్తావించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో అత్యధిక భాగం ఓసీల నుంచి వస్తున్నదని అటువంటి ఓసీల్లో అత్యధిక భాగం కాంట్రాక్ట్ కార్మికుల పని చేస్తున్నారనీ, వారికి రక్షణ సౌకర్యాలు కల్పించడంలో, సింగరేణి యాజమాన్యం, కాంట్రాక్టర్లు విఫలమవుతున్న తీరును ప్రస్తావించారు. కంపెనీ, ఏరియా లెవల్స్‌లో జరుగుతున్న ట్రై పార్టీ సేఫ్టీ కమిటీ సమావేశంలో యూనియన్ తరపున పాల్గొనే ప్రతినిధులకు కాంట్రాక్టు కార్మికుల యొక్క పని పరిస్థితులపైనా, రక్షణ సౌకర్యాలపైనా సరైన అవగాహన లేకపోవడంతో ఆ సమావేశాల్లో కాంట్రాక్ట్ కార్మికుల రక్షణ గురించి సరైన చర్చ జరగట్లేదని విన్నవించారు. దీనిపై స్పందించిన సౌత్ సెంట్రల్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ కాంట్రాక్ట్ కార్మికుల రక్షణకు అవసరమైన చర్యలు చేపడతామని, సింగరేణి ఉన్నతాధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మైండ్ సేఫ్టీని కలిసిన ప్రతినిధి బందంలో మానస ముఖర్జీతో పాటు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(ఎస్సీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బంధు క్రాంతి ఉన్నారు.

# సమగ్ర సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చండి

## సీఎం రేవంత్‌రెడ్డికి సీఐటీయూ లేఖ


**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

సమగ్ర సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలనీ, అప్పటివరకు పే-స్కేల్ వర్తింపజేసి న్యాయమైన డిమాండ్లన్నింటినీ నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ రాష్ట్ర కమిటీ కోరింది. తమ హక్కుల కోసం డిసెంబర్ 10 నుంచి ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పరిష్కరించకపోవడం సరిగాదని పేర్కొంది. శుక్రవారం ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ లేఖ రాశారు. వారికి ఆరోగ్య బీమా సౌకర్యం రూ.10 లక్షలు కల్పించాలనీ, రిటైరైన ఉద్యోగులకు బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ విద్యా శాఖ నియామకాలలో వెయిటేజి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పీటీఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలని విన్నవించారు. విద్యా శాఖలో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న సమగ్ర సర్వ శిక్షా అభియాన్ సిబ్బంది యొక్క కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. విద్యా శాఖలో సమగ్ర సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులతో గత ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే భద్రత కల్పించి వేతనాలు పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. 20 ఏండ్ల నుంచి పనిచేస్తున్నా వారికి గౌరవప్రదమైన వేతనం కూడా ఇవ్వకపోవడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. వారికి సరైన జాబ్‌చార్టు లేదనీ, మరోవైపు విద్యాశాఖ ఉన్నతాధికారుల వేధింపులు తీవ్రంగా ఉన్నాయని వాపోయారు. ఆ సిబ్బందిలో సగానికి పైగా మహిళా ఉద్యోగులు ఉన్నారనే విషయాన్ని గుర్తు చేశారు. విద్యా, వైద్య రంగాల్లో ఉన్న అనేక స్కీమ్‌లకు (పథకాలకు) కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు పెంచకుండా వివక్ష చూపుతున్నదని విమర్శించారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వైద్యారోగ్య రంగంలోని అనేక స్కీముల్లోని సిబ్బందికి ఉద్యోగ భద్రత లేకుండా, సమాన పనికి - సమాన వేతనం చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వమే అన్యాయం చేస్తున్న తీరును ఎండగట్టారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు జఠిలం కావడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాత్ర కూడా ఉందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారి పట్ల నిర్లక్ష్యం వ్యవహరించడంతోనే ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సాగదీయడం సరిగాదని సూచించారు. శాంతియుతంగా సమ్మెలో ఉన్న సమగ్ర సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సీఎంను కోరారు.

# తగ్గిన అపాయింట్‌మెంట్ సైకిల్

## 2024లో మెరుగైన పాస్‌పోర్ట్ సేవలు :జె.స్నేహజ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**



గతేడాది పాస్‌పోర్టు సేవలు మరింత మెరుగయ్యాయని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్టు అధికారి జె. స్నేహజ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 2023లో సాధారణ అపాయింట్ మెంట్ల కోసం 22 గంటలు పడితే, 2024లో ఆ వేచి చూసే కాలాన్ని 6 నుంచి 8 గంటలకు తగ్గించినట్టు తెలిపారు. ప్రస్తుతం తత్కాల్ అపాయింట్ మెంట్లు ఒకటి నుంచి ఐదు రోజుల్లో అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. పోస్టాఫీసు పాస్ పోర్టు సేవ కేంద్రాల్లో చాలా మట్టుకు అపాయింట్ మెంట్ వ్యవధి వారం రోజులుగా ఉందని తెలిపారు. మెరుగైన సేవలందించేందుకు తమ అంకితభావాన్ని ఇవి తెలుపుతున్నాయని చెప్పారు. హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్టు పరిధిలో ఐదు పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, 14 పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాలున్నాయనీ, వీటిలో ప్రతి రోజు 4,200 ధరఖాస్తులతో కలుపుకుని 2024లో 9.02 లక్షల దరఖాస్తులు వస్తున్నాయని చెప్పారు. వీటితో పాటు పాస్‌పోర్టు ఇస్సుయెన్స్, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్స్, వాటి సంబంధిత సేవలున్నాయని తెలిపారు. ఇవే కాకుండా అపాయింట్‌మెంట్ల సంఖ్య పెరిగిందనీ, అపాయింట్‌మెంట్ సిస్టమ్ విచారణలో, ఫిర్యాదుల పరిష్కారం, మొబైల్ పాస్‌పోర్ట్ సర్వీసులు తదితర సేవలు అందిస్తున్నట్టు తెలిపారు.

### తపస్ డైరీని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నూతన సంవత్సరం డైరీని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డితో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ చట్టాల రూపకల్పనలో తపస్ భాగస్వామ్యం పెరగాలని ఆకాంక్షించారు. 317 జీవో పరిష్కారం, జీతాల పెంపు కోసం ఇతర సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వ ధోరణిని ఎండగట్టాలని కోరారు. నూతన విద్యావిధానం రాష్ట్రంలో అమలయ్యేలా కృషి చేయాలని చెప్పారు. పెండింగ్ సమస్యల పరిష్కారంలో తనవంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, ప్రతినిధి విష్ణువర్ధన్‌రెడ్డి, సహాధ్యక్షులు నరేందర్‌రావు, పాపిరెడ్డి, ఉష, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, రామకృష్ణరెడ్డి పాల్గొన్నారు.



## సంగారెడ్డిలో మొట్టమొదటి 'మహిళా శక్తి' పెట్రోల్ పంపు

- ప్రారంభించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**నవతెలంగాణ-సంగారెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'మహిళా శక్తి' పథకంలో భాగంగా మొట్టమొదటి మహిళా పెట్రోల్ పంపును సంగారెడ్డి జిల్లా కేంద్రంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం ప్రారంభించారు. అలాగే, సంగారెడ్డి పట్టణానికి మంచినీరు అందించడానికి రూ.44 కోట్లతో అమృత్ జలపథకం ప్రారంభించడంతో పాటు మహిళా షాపింగ్ కాంప్లెక్స్, స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మోడల్ ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలు అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం 'మహిళా శక్తి' పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఈ పథకం ద్వారా మహిళా క్యాంటీన్లు, పెట్రోల్ పంపు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు లాంటి కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభ్యున్నతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, టీజీఐఐసీ చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తదితరులు పాల్గొన్నారు.

## ఆటోలను ఢీకొట్టిన కారు

- ముగ్గురు మృతి, మరో ముగ్గురి పరిస్థితి విషమం
- సంగారెడ్డి జిల్లా నల్లవల్లి అటవీ ప్రాంతంలో ఘటన



**నవతెలంగాణ-గుమ్మడిదల**

ఎదురుగా వస్తున్న రెండు ఆటోలను ఓ కారు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ హృదయవిధారకర ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల శివారులోని నల్లవల్లి అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గండి మైసమ్మ నుంచి నర్సాపూర్ వైపు టీజీ35టీక్యూ 168, టీఎస్ 35ఏ2586 అనే నెంబర్ గల రెండు ఆటోలు ప్రయాణికులతో వెళ్తున్నాయి. ఈ క్రమంలోనే నర్సాపూర్ నుంచి గండిమైసమ్మ వైపు వెళ్తున్న ఏపీ28డీవీ4801 అనే నెంబర్ గల కారు.. నల్లవల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఉన్న మేడాలమ్మ టెంపుల్ వద్ద ఎస్‌హెచ్ 765 రోడ్డుపై ఎదురుగా వస్తున్న ఆ రెండు ఆటోలను ఢీకొట్టింది. దాంతో ఆటోలో ప్రయాణిస్తున్న కాలేజీ విద్యార్థి ఐశ్వర్య(25), ప్రభుత్వ అధికారి మనిషా(25), సంతోష్ (24) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో స్థానికంగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో.. గుమ్మడిదల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకొని ఘటనాస్థలిని పరిశీలించారు.

## బైడెన్ దంపతులకు మోడీ గిఫ్ట్‌లు

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు, ఆయన కుటుంబానికి 2023లో పలువురు విదేశీ ప్రముఖుల నుంచి వేల డాలర్లు విలువ చేసే ఖరీదైన బహుమతులు అందాయి. అమెరికాలో తమ అధికారిక పర్యటనల్లో భాగంగా విదేశీ ప్రముఖులు ఆ దేశ అధ్యక్ష దంపతులకు సాధారణంగా బహుమతులు అందిస్తుంటారు. ఇందులో భాగంగానే జో బైడెన్, ఫస్ట్ లేడీ అయిన ఆయన భార్య జిల్ బైడెన్‌లకూ కాస్ట్లీ గిఫ్ట్‌లు అందాయి. అయితే, వీటిల్లో భారత ప్రధాని మోడీ.. జిల్ బైడెన్‌కు ఇచ్చిన గిఫ్ట్ మాత్రం 2023లో అత్యంత ఖరీదైనది కావటం గమనార్హం. గతేడాది జూన్‌లో ప్రధాని మోడీ అమెరికాలో మూడు రోజులు పర్యటించిన విషయం విదితమే. ఆ దేశ అధ్యక్ష భవనం శ్వేతసౌధం(వైట్‌హౌజ్)లో జో బైడెన్.. మోడీకి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మోడీ.. బైడెన్ దంపతులకు ఖరీదైన బహుమతులను అందజేశారు. 20వేల అమెరికన్ డాలర్ల విలువైన 7.5 క్యారెట్ల గ్రీన్ డైమండ్‌ను మోడీ.. జిల్ బైడెన్‌కు బహుమతిగా ఇచ్చారు. దీని విలువ భారత కరెన్సీలో రూ.17.15 లక్షలుగా ఉంటుందని సమాచారం. 2023లో అమెరికా అధ్యక్ష కుటుంబానికి (యూఎస్ ఫస్ట్ ఫ్యామిలీ) లభించిన బహుమతల్లో ఇదే అత్యంత ఖరీదైనది కావటం గమనార్హం. ఈ డైమండ్‌ను పరిశోధనశాలలో తయారు చేశారు. భూమి నుంచి వచ్చిన వజ్రం తరహాలోనే ఆ గ్రీన్ డైమండ్ లక్షణాలు ఉంటాయని తెలిసింది. ప్రస్తుతం ఇది వైట్‌హౌజ్ ఈస్ట్ వింగ్‌లో అధికారిక ఉపయోగం కోసం ఉన్నది.

ఇదే పర్యటనలో మోడీ.. జో బైడెన్‌కు ఖరీదైన బహుమతులు అందించారు. 6,232 డాలర్ల విలువ చేసే (రూ.5.34 లక్షలకు పైగా) ఒక శాండల్‌వుడ్ బాక్స్‌ను, 'ది టెన్ ప్రిన్సిపల్ ఉపనిషద్స్' పేరుతో ఉన్న పుస్తకాన్ని, ఒక విగ్రహం, ఒక ఆయిల్ ల్యాంప్‌ను గిఫ్ట్‌గా ఇచ్చారు. 2022, నవంబర్‌లో మోడీ ఒక వెయ్యి డాలర్ల విలువైన ఒక పెయింటింగ్‌ను అమెరికా అధ్యక్షుడికి అందించారు. కాగా, మరికొన్ని రోజుల్లో అమెరికా అధ్యక్ష బాధ్యతల బైడెన్ దిగిపోనుండగా.. డొనాల్డ్ ట్రంప్ ఆ బాధ్యతలను స్వీకరించనున్న విషయం విదితమే. ఇక గతేడాది ఆగస్టులో 850 డాలర్ల(రూ.72 వేలకు పైగా) విలువైన బహుమతిని మోడీ.. ప్రెసిడెంట్‌కు మాజీ డిప్యూటీ అసిస్టెంట్, ఇండో-పసిఫిక్ వ్యవహారాల సమన్వయకర్త అయిన కుర్ట్ క్యాంప్‌బెల్‌కు అందించారు. క్యాంప్‌బెల్ ప్రస్తుతం యూఎస్ డిప్యూటీ సెక్రెటరీ ఆఫ్ స్టేట్‌గా ఉన్నారు. అలాగే, గతేడాది జూన్‌లో ఇద్దరు అమెరికా సెనెటర్లు అయిన మిచ్ మెక్‌కొన్నెల్, చార్లెస్ స్కూమర్‌లకు ఒక్కొక్కరికి 125 డాలర్ల విలువైన బహుమతులను అందించారు.

మోడీ బాటలోనే భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, అదనపు జాతీయ భద్రతా సలహాదారు రాజిందర్ ఖన్నాలు నడిచారు. గతేడాది జనవరి, జులైలలో అజిత్ దోవల్.. 485 డాలర్ల విలువైన వెండి జాగ్వార్ విగ్రహాన్ని, 638 డాలర్ల విలువైన చెక్కతో తయారైన ఏనుగు నిర్మాణాన్ని అమెరికా జాతీయ భద్రతా సలహాదారుగా ఉన్న జాకోబ్ సల్లివాన్‌కు అందించారు. రాజిందర్ ఖన్నా.. 202లో యూఎస్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అడ్వైజర్ ఎలిజబెత్ షేర్‌వుడ్-రాండాల్‌కు 3,980 డాలర్ల విలువైన వెండి ఏనుగు శిల్పాన్ని బహుమతిగా ఇచ్చారు. అంతకముందు నెలలో, 515 డాలర్ల విలువైన వెండి కొవ్వొత్తి, వెండి చిత్ర ఫ్రేమ్‌ను యూఎస్ జాతీయ డిప్యూటీ భద్రతా సలహాదారు అన్నే న్యూబెర్గర్‌కు అందించారు. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వైస్ చైర్మెన్‌గా ఉన్న ఫిలిప్ జఫర్‌సన్‌కు భారత ప్రభుత్వం 602 డాలర్ల విలువ చేసే బహుమతులను అందించినట్టు తెలిసింది. పేరు తెలియని ఒక దాత నుంచి తనకు 500 డాలర్ల విలువ చేసే కష్మెరె సిల్క్ రగ్గు అందినట్టు యూఎస్ నేషనల్ ఇంటెలిజెన్స్ ఉద్యోగి ఒకరు వెల్లడించటం గమనార్హం. 2023లో బిడెన్ దంపతులు అందుకున్న ఖరీదైన బహుమతుల వివరాలను యునైటెడ్ స్టేట్స్ చీఫ్ ఆఫ్ ప్రోటోకాల్ కార్యాలయం తాజాగా విడుదల చేసింది.

## కూతురిపై లైంగికదాడి కేసులో తండ్రికి జీవిత ఖైదు



- బాధితురాలికి రూ.15లక్షలు ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశం

**నవతెలంగాణ-హాయత్‌నగర్**

సొంత కూతురు(బాలికపై)పై లైంగికదాడి చేసిన కేసులో రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడి(తండ్రి)కి జీవిత ఖైదు విధించినట్టు సరూర్‌నగర్ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గుండు అంజయ్య హైదరాబాద్ సరూర్‌నగర్‌లో ఉంటూ ప్రభుత్వ కళాశాలలో వాచ్‌మెన్ పనిచేస్తున్నాడు. 2023లో తన కూతురిపై లైంగికదాడి చేశాడు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విచారించి శుక్రవారం నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.30 వేల జరిమానా విధించింది. అలాగే బాధితురాలికి రూ.15 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# వాగ్దాన అమలుకే దల్లేవాల్ దీక్ష

- కనీస గిట్టుబాటు ధర హామీని విస్మరించిన కేంద్రం
- కస్తూర్బా ఉద్యోగుల సమ్మెను విచ్ఛిన్నం చేసే కుట్ర
- జిమ్మిక్కుల కోసమే సావిత్రీబాయి జయంతిని ఉమెన్స్ టీచర్స్‌డేగా ప్రకటన
- ఈ ఫార్ములా కేసులో అవినీతి జరిగితే విచారించి చర్యలు తీసుకోవాలి : విలేకర్ల సమావేశంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**




. నల్ల చట్టాల్ని రద్దు చేయాలని 2022లో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా కనీస గిట్టుబాటు ధర కల్పించేందుకు చట్టం చేస్తామని ఇచ్చిన హామీని కేంద్రం విస్మరించినందునే రైతు నాయకుడు దల్లేవాల్ దీక్ష చేపట్టారని, ఆ దీక్షను మోడీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కేవల్ కిషన్ భవన్‌లో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములుతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాన్ని అమలు చేయాలని రైతు ప్రతినిధులు అనేక సార్లు చర్చలు, సంప్రదింపులు జరిపినా కేంద్రం పట్టించుకోలేదని, అందుకే దలేవాల్ దీక్ష చేపట్టారని తెలిపారు. దలేవాల్ దీక్ష చేయడాన్ని సుప్రీం కోర్టు సైతం సమర్థించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే గిట్టుబాటు ధరల చట్టం తీసుకువచ్చేందుకు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ స్వార్థంతో పాటు ఢిల్లీ ఎన్నికల్లో ప్రయోజనం పొందడం, రాష్ట్రాల అధికారాలు, స్థానిక సమస్యలు చర్చకు రాకుండా ఉండేందుకు 'ఒకే దేశం ఒకే ఎన్నిక' పేరిట బీజేపీ ఆర్భాటం చేస్తోందన్నారు. పార్లమెంట్‌లో 2/3 మెజార్టీ లేకపోయినా బిల్లు పాస్ కాదన్న విషయం తెలిసినా హైలెట్ కావడం కోసమే బీజేపీ ప్లాన్ చేసిందని తెలిపారు. రాష్ట్రంలో కేజీబీవీల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు 25 రోజులుగా చేస్తున్న సమ్మెను పరిష్కరించాలన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల్ని పరిష్కరించకుండా సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు మంత్రులు కుట్రలు చేయడం సరికాదన్నారు. కస్తూర్బా పాఠశాలల్లో బాలికలకు విద్యనందిస్తున్న ఉద్యోగుల డిమాండ్లను పట్టించుకోని ప్రభుత్వం.. జిమ్మిక్కుల కోసం మాత్రమే సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిందని ఆరోపించారు. ఈ ఫార్ములా కేసులో అవినీతి జరిగితే త్వరగా విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. .

రైతు భరోసా కోసం

# దరఖాస్తులు చేసుకోవాలనడం సరైంది కాదు



- కౌలు రైతులను గుర్తించాలి
- అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేయాలి : చైతన్య సేద్యం 2025 డైరీ ఆవిష్కరణలో పోతినేని, టి. సాగర్

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రైతు భరోసా కోసం దరఖాస్తులు చేసుకోవాలనడం సరైంది కాదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి. సాగర్ అన్నారు. గ్రామ సభలు జరిపి వాస్తవ సాగుదారులను నమోదు చేసి వాస్తవ సాగుదారులందరికి రైతు భరోసా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో చైతన్య సేద్యం-2025 డైరీని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం, యాసంగి సీజన్లలో ఎకరాకు రూ.7500 ఇస్తానన్న వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 16 లక్షల మంది కౌలుదారులు, మరో ఆరు లక్షల మంది సాగుదారులు పట్టాదారులు లేకుండా సాగు చేస్తున్నారని తెలిపారు. వారికి సాగు హక్కులు కల్పిస్తే ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు, పంటల బీమా వర్తిస్తాయన్నారు.

భూయజమానులతోపాటు, సాగుదారులకు హక్కులు కల్పించాలని కోరారు. తహశీల్దార్, ఆర్‌డీవో, కలెక్టర్, సీసీఎల్‌ఏ కార్యాలయాల వద్ద గతంలో జరిగిన లోపాలను సరిచేసే విధంగా చూడాలని కోరారు. ట్రిబ్యునల్ ఏర్పాటు, గ్రామ స్థాయిలో రెవెన్యూ అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు.

సాగుభూములను, సాగేతరభూములను విడివిడిగా రిజిష్టర్ తయారు చేయాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సర్కారుకు అందిన (9.12.2023) సాధాబైనామా దరఖాస్తులను ఆమోదించాలని కోరారు. అసైన్డ్ భూముల సమస్యను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు (బంచరాయి, పోడు) సాగుచేస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేవాలయ, వక్ఫ్, ధర్మాదాయ భూములను సాగు చేస్తున్న సాగుదారుల పేర్లను రెవెన్యూ రికార్డులో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో చైతన్య సేద్యం మాస పత్రిక ఎడిటర్ ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పి జంగారెడ్డితోపాటు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన
- వికారాబాద్ జిల్లా పరిగిలో ఘటన

**నవతెలంగాణ-పరిగి**

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళా మృతిచెందిన ఘటన వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని సాధన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శుక్రవారం జరిగింది. ఎస్ఐ, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం గూడూరు గ్రామానికి చెందిన యాదమ్మ (33) గర్భసంచి ఆపరేషన్ కోసం సాధన ఆస్పత్రిలో చేరింది. రెండ్రోజుల క్రితం వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేశారు. శుక్రవారం ఉదయం మహిళను వాకింగ్ చేయించే సమయంలో ఆమె జారిపడింది. దాంతో గుట్టు చప్పుడు కాకుండా ఆస్పత్రి యాజమాన్యం ఆమెను తమ వాహనంలో హుటాహుటిన వికారాబాద్ ఈషా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు.



ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

మహిళకు ఆపరేషన్ జరిగిన రెండో రోజే మృతి చెందడంతో మృతురాలి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. మృతదేహంతో ఆస్పత్రి ఎదుట బైటాయించారు. ఆమె మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ ఆస్పత్రి సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు.

గొడవ పెద్దదవుతుండటంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలి బంధువులకు నచ్చజెప్పి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

# 110 కిలోల ఎండు గంజాయి పట్టివేత



- రూ.30 లక్షల విలువ ఉంటుందని అంచనా
- జహీరాబాద్‌లో మెగా వెహికల్ చెకింగ్‌లో పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

**నవతెలంగాణ-సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సబ్-డివిజన్ పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున నిర్వహించిన మెగా వెహికిల్ చెకింగ్‌లో 110 కిలోల నిషేధిత ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని అంచనా. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ చెన్నూరి రూపేష్ వివరాలు వెల్లడించారు. ఎస్పీ ఆదేశాలతో జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శివలింగం, టౌన్ ఎస్ఐ కాశీనాథ్, రూరల్ ఎస్ఐ ప్రసాద్ రావ్, చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి సబ్‌డివిజన్ సిబ్బందితో కలిసి జహీరాబాద్ శివారులోని పాత ఆర్టీఓ చెక్‌పోస్ట్ సమీపంలో ఎన్‌హెచ్65 బైపాస్ రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున మెగా వెహికల్ చెకింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఉదయం సుమారు 7:15 గంటలకు హైదరాబాద్ నుంచి ముంబై వైపు వెళ్తున్న ఎంహెచ్43ఎక్స్4796 నెంబర్ గల కారును ఆపడానికి ప్రయత్నించగా.. డ్రైవర్ కారు ఆపకుండా పారిపోయే ప్రయత్నం చేశాడు. కొద్ది దూరం వెళ్లగానే అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులు పారిపోగా.. ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. వారిని పట్టుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. జహీరాబాద్ శాంతినగర్‌కు చెందిన మహమ్మద్ అక్బర్, మహమ్మద్ సల్మాన్, వారి సోదరుడు ఇస్మాయిల్ అతని అనుచరులు మహబూబ్, రజాక్ కలిసి నవాజ్, షబ్బీర్ అనే ఇద్దరు వ్యక్తుల ఆదేశానుసారం మారుతి షిఫ్ట్ కారులో ఒడిశా సరిహద్దు నుంచి 110 కిలోల ఎండు గంజాయిని తీసుకువస్తున్నారు. నవాజ్, షబ్బీర్.. ఇన్నోవా కారులో ముందుగా వెళ్తూ సిగ్నల్ ఇస్తుండగా.. వారిని వెంబడిస్తూ ముంబైకి గంజాయి అక్రమ రవాణా చేయడానికి ప్రయత్నించి పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో అక్బర్, సల్మాన్ ఉండగా మిగతా వారు పారిపోయారు. కాగా వారి వద్ద నుంచి నాలుగు కిలోల బరువున్న 27 గంజాయి ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని.. జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్పీ తెలిపారు. జిల్లాలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై పోలీసు శాఖ ఉక్కుపాదం మోపుతున్నదన్నారు. ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలను సాగు, సరఫరా చేసినా సంగారెడ్డి జిల్లా ఎస్-ఎన్ ఏబీ నెంబర్ 8712656777కు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కాగా గంజాయి పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ ప్రెస్‌మీట్‌లో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, జహీరాబాద్ డీఎస్పీ రామ్ మోహన్‌రెడ్డి, టీ-ఎన్‌ఏబీ డీఎస్పీ పుష్పన్ కుమార్, జహీరాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ శివలింగం, ఎస్ఐ కాశీనాథ్, ప్రసాద్‌రావు సిబ్బంది తదితరులున్నారు.

## జీడిమెట్లలో భారీ అగ్ని ప్రమాదం



**నవతెలంగాణ - కుత్బుల్లాపూర్**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల పారిశ్రామికవాడలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లిలోని రిషిక కెమికల్స్ గోడౌన్‌లో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగలు వ్యాపించడంతో వెంటనే గోడౌన్ సిబ్బందితోపాటు స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మూడు అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. గోడౌన్‌లో ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమా? లేక మరేదైనా ఉందా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాద సమయంలో గోడౌన్‌లో ఎవరైనా ఉన్నారా అనేది తెలియరాలేదు. గోడౌన్‌లో భారీ ఎత్తున కెమికల్స్ నిల్వ ఉంచినట్టు సమాచారం. ప్రమాదంతో భారీ స్థాయిలోనే నష్టం జరిగి ఉండొచ్చని తెలుస్తోంది.

## ప్రజావాణికి 359 అర్జీలు

- పోస్టింగ్ ఇవ్వాలని 2008 డీఎస్సీ అభ్యర్థుల విన్నపం

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి 359 అర్జీలు అందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత మేరకు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 103, విద్యుత్ శాఖకు 85, రెవెన్యూ శాఖకు 62, ఇతర శాఖలకు 109 దరఖాస్తులు అందాయి. 2008 డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు తమకు పోస్టింగ్ ఇవ్వాలని కోరుతూ ప్రజావాణికి తరలివచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వు 9 మేరకు వెంటనే తమకు ఎస్జీటీ టీచర్‌గా నియామక పత్రాలు అందివ్వాలని విజ్ఞప్తి చేశారు.




## దేశ ఆర్థిక పురోగతిలో యువత భాగస్వామ్యం కావాలి

- స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టడీస్ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**నవతెలంగాణ-మియాపూర్**

దేశ ఆర్థిక పురోగతిలో యువత భాగస్వామ్యం కావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విద్యార్థులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలోని స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టడీస్ స్నాతకోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ హాజరై ప్రసంగించారు. ప్రపంచంతో పోటీ పడుతూ కొత్త కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్కిల్స్ రీ స్కిల్స్ ఆఫ్ స్కిల్స్ పద్ధతిలో యువత ముందుకెళ్లాలని అన్నారు. ప్రపంచానికే సవాల్‌గా మారుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్సెస్, మిషన్ లెర్నింగ్‌లో నైపుణ్యం పెంచుకున్నప్పుడే యువత రాణిస్తుందని చెప్పారు. డ్రీమ్ బిగ్ అచీవ్‌మెంట్ బిగ్ పద్ధతిలో నూతన ఆవిష్కరణలో యువత స్వాగతించాలని అన్నారు. నెల్సన్ మండేలా, స్వామి వివేకానంద, ఇన్ఫోసిస్ నారాయణమూర్తి లాంటి ఎంతోమంది మేధావులు యువతకు అద్భుతమైన సందేశాలను ఇచ్చారని తెలిపారు. అపారమైన శక్తి వినియోగంలోకి వచ్చినప్పుడు భారతదేశ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మారుతాయని, అప్పుడే అద్భుతమైన ఫలితాలను సాధిస్తుందని చెప్పారు. యువత తాము కష్టపడి చదువుకున్న చదువులకు దేశ ప్రయోజనాలకు ఉపయోగించాలని సూచించారు.

ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ప్రెసిడెంట్ వీబీ సింగ్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యలో 15 విభాగాలు కీలకం అని అన్నారు. ప్రస్తుతం దేశంలోని 125 నగరాల్లో ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ శాఖలున్నాయని, 2.60 లక్షల మంది ఇందులో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిలో ఈ సంస్థ భాగస్వామ్యం ఉందన్నారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జి.రామేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఈ కాలేజీలో 12 విభాగాల్లో ఏడాదిలో కనీసం ఏడు వేల మంది ఇంజినీర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. 1981లో నాటి రాష్ట్రపతి ఆర్.వెంకట్రామన్ ప్రారంభించిన ఈ కాలేజ్.. ఆసియా ఖండంలోనే ఇక్కడే ఉందని, ఎక్కడ లేదన్నారు. ఈ సందర్భంగా వివిధ బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్, ప్రశంసా పత్రాలను గవర్నర్ అందజేశారు. అంతకుముందు విద్యార్థులతో ఈ దేశ ప్రగతికి తమ విద్యను అంకితం చేస్తున్నట్టు గవర్నర్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్ మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## భాగ్యరెడ్డి వర్మ దళిత జన బాంధవుడు

- సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నంద్యాల నర్సింహారెడ్డి

**నవతెలంగాణ-కల్చరల్**

తెలంగాణ నేలపై పుట్టిన భాగ్యరెడ్డి వర్మ దీనుల ఉద్ధరణ కోసం పోరాడిన దళిత జన బాంధవుడని సీపీఐ(ఎం) నాయకులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని శ్రీత్యాగరాయ గానసభ కళా సుబ్బారావు కళా వేదికపై భాగ్యరెడ్డి వర్మ సంస్మరణ సభ గానసభ అధ్యక్షులు కళా వీఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన వర్గాల ప్రజలకు విద్య అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో 'ఆది హింద్' విద్యాలయాన్ని హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ వద్ద నిర్మించి ఉచిత విద్య అందించిన భాగ్యరెడ్డి వర్మ సదా స్మరణీయులు అన్నారు. నైజాం పాలిత ప్రాంతాల్లో వివక్షతకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం చేసిన త్యాగ శీలి అని కొనియాడారు. కానీ చరిత్రలో ఆయనకు తగిన గుర్తింపు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో సింధేంద్ర ఆర్ట్స్ అకాడమీ అధినేత్రి దేవసేన, పుష్పాంజలి రిథమ్ అధ్యక్షులు బాలాజీ కుమార్, గాయని మంగరాజు రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

## మూడు కోర్సులకు అడ్మిషన్లు

- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఎండోస్కోపీ టెక్నీషియన్ (ఆరు నెలల కోర్సు), ప్రోటోటైపింగ్ స్పెషలిస్ట్ (2 నెలల కోర్సు), మెడికల్ కోడింగ్ స్పెషలిస్ట్ (2 నెలల కోర్సు)లను ప్రారంభిస్తున్నట్టు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తెలంగాణ తెలిపింది. ఈ మేరకు యూనివర్సిటీ ఒఎస్డీ, రిజిస్ట్రార్ ఇంచార్జ్ చమన్ మెహతా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీ భాగస్వాములు ఏఐజీ హాస్పిటల్స్, టి.వర్క్స్ (తెలంగాణ ప్రోటోటైపింగ్ వర్క్స్), కిమ్స్ హాస్పిటల్స్ సహకారంతో ఈ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభించినట్టు తెలిపారు. ఆయా పరిశ్రమల నిపుణులతో శిక్షణ పొందేందుకు ఇది మంచి అవకాశమని చెప్పారు.

విద్యార్థులు మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. కోర్సు, వ్యవధి, అర్హత, దరఖాస్తు చేసుకునే విధానం తదితర వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపారు. జనవరి మూడో వారంలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

# కుల వివక్ష అంతానికి ఏం చేశారు ?

యూనివర్సిటీల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై సుప్రీం ఆందోళన

## సవివరంగా తెలపాలని కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని ఉన్నత విద్యా సంస్థ(హెచ్ఈఐ)ల్లో కుల వివక్షను అంతమొందించేందుకు తీసుకున్న చర్యల గురించి తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. కుల వివక్ష కారణంగా ఆత్మహత్య చేసుకున్న హైదరాబాద్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల తల్లి రాధికా వేముల, ముంబయి యువ వైద్యురాలు పాయల్ తాడ్వీ తల్లి అబేదా సలీం తడ్వీలు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పీఐఎల్) శుక్రవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఉన్నత విద్యా సంస్థల్లో సమాన అవకాశాల సెల్‌ల ఏర్పాటుకు సంబంధించి దేశంలోని అన్ని యూనివర్సిటీల నుంచి సమాచారాన్ని సేకరించి సమర్పించాలని యూనివర్శిటీ గ్రాండ్స్ కమిషన్ (యూజీసీ)ని ఆదేశించింది. దీంతో పాటు కుల వివక్షకు సంబంధించి ఇప్పటి వరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయని, ఆ ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని కూడా సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్, న్యాయవాది దివా వాడేకర్ వాదనలు వినిపిస్తూ ఉన్నత విద్యా సంస్థలలో కుల వివక్షను అరికట్టేందుకు సమానత్వ చట్టం-2012లోని నిబంధనలను అమలు చేయడంలో యూజీసీ ఘోరంగా విఫలమైందని పేర్కొన్నారు. యూజీసీ నిర్లక్ష్యం వల్ల క్యాంపస్‌ల్లో విస్తృతమైన కుల ఆధారిత వివక్షకు దారితీసిందని, విద్యార్థుల ఆత్మహత్యల ఆందోళనకరమైన గణాంకాలను ఉదహరించారు. ఐఐటీల్లో 2004 నుంచి 2024 వరకు 115 ఆత్మహత్యలు జరిగాయని కోర్టుకు తెలియజేసింది. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం 820 విశ్వవిద్యాలయాలలో (సెంట్రల్/స్టేట్/డీమ్డ్), ఎన్ని సమాన అవకాశాల సెల్‌లను సెటప్ చేశాయా? ఏర్పాటు చేస్తే ఈ కేసుల పరిస్థితేంటి? 2012 నిబంధనల అమలుకు సంబంధించి యుజిసి పర్యవేక్షణ ఏమిటి? ప్రశ్నించారు. యూజీసీ న్యాయవాది వాదనలు వినిపిస్తూ కొన్ని నిపుణుల కమిటీల సిఫారసుల ఆధారంగా విద్యాసంస్థల్లో కుల వివక్షను నిరోధించడానికి కొన్ని కొత్త నిబంధనలను రూపొందించినట్టు తెలిపారు. ఆ నిబంధనల కాపీని సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సున్నితమైన అంశాన్ని క్రమపద్ధతిలో పరిష్కరించాలని నొక్కి చెప్పారు. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. కేసు విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

---

## సామాన్య మహిళలను కోటీశ్వరులను చేస్తాం

ప్రభుత్వ తోడ్పాటు, ఆదాయంతో మహిళల ఆత్మగౌరవం పెరుగుతుంది

దేశంలోనే తొలిసారి అధికారికంగా సావిత్రీబాయి పూలే జయంతి : చేపల విక్రయ వాహనాల ప్రారంభంలో మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సామాన్య మహిళలను కోటీశ్వరులుగా చేయడమే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచా యతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) నొక్కిచెప్పారు. సావిత్రాబాయి పూలే జయంతిని దేశంలోనే తొలిసారి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. సావిత్రీబాయి స్ఫూర్తితో అన్నిరంగాల్లోనూ మహిళలు రాణించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో 25 సంచార చేపల విక్రయ వాహనాలను మంత్రి సీతక్క ప్రారంభించారు. వాహనాల్లోకి ఎక్కి పరిశీలించారు. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహిళా శక్తి వర్ధిల్లాలి అని నినదించారు. వాహనాల ప్రారంభం సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వ తోడ్పాటు, సొంత ఆదాయంతో మహిళల ఆత్మగౌరవం పెరుగుతుందని నొక్కి చెప్పారు. ఆడవాళ్లకు చదువు అవసరం లేదనే మూఢనమ్మకాల నుంచి ఇప్పుడిప్పుడే బయటపడ్డామన్నారు. మహిళ ఇంటికే పరిమితం కాదని సావిత్రీబాయి పూలే నొక్కి చెప్పారనీ, చదువు గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు. ఆదివాసీ బిడ్డ నేడు రాష్ట్రపతిగా ఉన్నారన్నారు. భార్యభర్తలు రోజంతా పనిచేసినా.. సాయంత్రం భార్య మాత్రమే ఇంట్లో పని ఎందుకు చేయాలి అని ప్రశ్నించారు. రోజంతా పనిచేసి వచ్చే మహిళలకు ఉపశమనం కలిగించేందుకు ఇంటి పనులను భార్యాభర్తలిద్దరూ కలిసి చేసుకోవాలని సూచించారు. మహిళా సంఘాలకు లోన్ బీమా పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. 17 రకాల వ్యాపారాలతో మహిళలకు ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. నాణ్యత, మంచి రుచితో ఆరోగ్యకరమైన చేపల వంటకాలు తయారుచేయాలనీ, సంచార వాహనాల్లో మహిళలు చేసే చేపల వంటకాలకు ఒక బ్రాండ్ క్రియేట్ కావాలని ఆకాంక్షించారు. అమ్మ చేతి వంటకు మారుపేరు గా ఇందిరా మహిళా క్యాంటీన్లు ఉండాలని సూచించారు. సంచార చేపల విక్రయ వాహనాల్లో వ్యాపారాలు విజయవంతం కావాలనీ, మండల కేంద్రాలకు విస్తరించాలని ఆకాంక్షించారు. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. ఈ దేశంలో మహిళలు చదువుకున్నారంటే సావిత్రి బాయి పూలే కారణమని నొక్కి చెప్పారు. వ్యాపార రంగంలోనూ మహిళలు విజయం సాధించాలనే లక్ష్యంతోనే చేపల విక్రయాలు, వంటల అమ్మకాల వాహనాలు అందిస్తున్నామన్నారు. పది లక్షల వాహనాన్ని ఆరు లక్షల సబ్సిడీతో కేవలం నాలుగు లక్షలకే లబ్దిదారులకు అందజేశామని తెలిపారు.

**ఇంత దూరం వస్తానని అనుకోలేదు : మల్లమ్మ, ములుగు**

ములుగు దాటి బయటకు రావాలంటేనే భయం. చదువు రాని నేను ఇంత దూరం వస్తానని అనుకోలేదు. నాకు ధైర్యమిచ్చి అధికారులు ఇంత దూరం తీసుకొచ్చారు. చదువు రాని నాకు ప్రభుత్వం అండగా ఉండటం సంతోషంగా ఉంది. ఇప్పటిదాకా బుట్ట నెత్తిలో పెట్టుకుని చేపలు అమ్ముకునేదాన్ని. కొన్ని సార్లు నడవలేక రోడ్డుపక్కన కూర్చొని అమ్ముకునేదాన్ని. ఇప్పుడు సంచార వాహనాల్లో చేపలు అమ్ముకునేందుకు ప్రభుత్వం సహాయం చేసింది. రేవంత్‌రెడ్డి సర్కారుకు, సీతక్కకు, అధికారులకు రుణపడి ఉంటా.

**బిజినెస్ ఇంకా డెవలప్ చేసుకుంటాం**

**విజయలక్ష్మి, రేవులపల్లి, ధరూర్ మండలం, గద్వాల జిల్లా**

మాది గద్వాల జిల్లా ధరూర్ మండలం రేవులపల్లి గ్రామం. జూరాల డ్యామ్‌లో చేపలు పట్టి అమ్ముకుంటున్నాం. మాలాంటి పేదలకు 60 శాతం సబ్సిడీ మీద వాహనాలు అందించడం సహాయకారంగా ఉంటుంది. బిజినెస్ ఇంకా డెవలప్ చేసుకునేందుకు ఈ వాహనాలు ఉపయోగపడతాయి. వాహనాలు ఇప్పించిన రేవంత్‌రెడ్డిసార్‌కు ధన్యవాదాలు.

## పోరాడారు..సాధించారు..

కేరళ విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్ల ఉద్యమ విజయం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేరళ ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు, ఇంజనీర్ల పోరాటం విజయవంతం అయింది. విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి కేరళ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. సుదీర్ఘ పోరాటం విజయవంతం కావడంతో కేరళ ఉద్యోగ వర్గాన్ని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఈఈఎఫ్ఐ) అభినందించింది. ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు, కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డ్ వినియోగదారులకు అనుకూలంగా సమస్యను పరిష్కరించడం కోసం కేరళ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఈఈఎఫ్ఐ స్వాగతించింది. అదే సమయంలో ఖర్చు తగ్గింపు పేరుతో విద్యుత్ రంగంలో ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో పని చేయించమని రాష్ట్రాలపై ఒత్తిడి తెచ్చే కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తుంది. 2024 డిసెంబర్ 17 నుంచి కేరళలోని విద్యుత్ ఉద్యోగుల సంఘాలు నిరవధికంగా ఆందోళన చేస్తున్నాయి. కేరళ రాష్ట్ర విద్యుత్ బోర్డు (కేఎస్ఈబీ) వర్కర్స్ అసోసియేషన్‌తో 2024 అక్టోబర్ 22న కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందాన్ని అమలు చేయడానికి యాజమాన్యం విముఖత చూపడంతో పోరాటం ఉధృతమైంది. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జనవరి 2న పోరాడుతున్న ఉద్యోగులతో చర్చలు జరిపారు. ఆయన జోక్యంతో 912 మంది ఉద్యోగుల నియామకం, కారుణ్య నియామకం సమస్య వెంటనే పరిష్కరించారు. ఇంకా, ఇతర సమస్యలను 45 రోజుల వ్యవధిలో చర్చించి పరిష్కరించేందుకు ఉన్నత స్థాయి కమిటీ (ఇద్దరు యూనియన్ ప్రతినిధులు, చైర్మెన్ నేతృత్వంలో ఇద్దరు మేనేజ్‌మెంట్ ప్రతినిధులు)ని ఏర్పాటు చేశారు.ఈ విజయం కేరళ విద్యుత్ ఉద్యోగుల పోరాట స్ఫూర్తిని తెలియజేసింది. అదే సమయంలో పరిశ్రమల అనుకూల, కార్మికుల అనుకూల చర్యలు తీసుకున్నందుకు కేరళ ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని ఈఈఎఫ్ఐ అభినందించింది. కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రంగాలలో ఉద్యోగాలను మరింత కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ వైపు మొగ్గు చూపుతున్నాయని సంఘం ప్రధాన కార్యదర్శి ప్రశాంత ఎన్.చౌదరి తెలిపారు. ఈ విజయాన్ని సంబురాలు చేసుకుంటూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపు ఇచ్చారు.

విద్యారంగ బలోపేతానికి ఉపాధ్యాయులు

## పునరంకితం కావాలి

టీఆర్టీఎఫ్ డైరీ ఆవిష్కరణలో : సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) నూతన సంవత్సరం డైరీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం విద్యారంగానికి ప్రథమ ప్రాధాన్యతను ఇస్తున్నదని అన్నారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామనీ, వాటికి శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు. నూతన సంవత్సరంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు పునరంకింతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటకం రమేష్, ఎం అంజిరెడ్డి నాయకులు సుంకిశీల ప్రభాకర్‌రావు, ఎం ప్రణీత్‌కుమార్, తరాల పరమేశ్ యాదవ్, శ్రీనాథ్, మధుసూదన్‌రెడ్డి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు టీఆర్టీఎఫ్ క్యాలెండర్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. టేబుల్ క్యాలెండర్‌ను పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి, అదనపు సంచాలకులు లింగయ్య ఆవిష్కరించారు.

ఎస్టీయూటీఎస్

## డైరీని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్టీయూటీఎస్) నూతన సంవత్సరం డైరీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేశామని వివరించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టామనీ, పండితులు, పీఈటీల ఉన్నతీకరణ ప్రక్రియను నిర్వహించామని చెప్పారు. ప్రతి పాఠశాలలో పారిశుధ్య కార్మికులను నియమించామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంటును అందిస్తున్నామని వివరించారు. పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం పర్వత్‌రెడ్డి, జి సదానందంగౌడ్, డైరీ కన్వీనర్ ఎవి సుధార్, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జుట్టు గజేందర్, వై కరుణాకర్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు పర్యాయపదం

సావిత్రీబాయి పూలే : మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళా సాధికారతకు పర్యాయ పదం సావిత్రీబాయి పూలే అని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం సావిత్రీబాయి పూలే 194వ జయంతిని పురస్కరించుకుని ఆమె హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. మహిళల పై తీవ్ర అణచివేత, వివక్ష కొనసాగుతున్న ఆ కాలంలోనే మహిళలకు విద్య కోసం, స్త్రీజాతి విముక్తి కోసం పోరాడి ధీరవనితగా సావిత్రీబాయి పూలే ఖ్యాతి గడించారని గుర్తుచేశారు. అనాథ పిల్లలు, స్త్రీలకు శరణాలయాలు, ఆశ్రమాలు నెలకొల్పడంతో పాటు సాంఘిక దురాచారాల నిర్మూలనకు, సమాజ ఉద్ధరణకు తన జీవితాన్ని అర్పించిన త్యాగశీలిగా ప్రపంచం సావిత్రీబాయి పూలేని సదా గుండెల్లో పెట్టుకుంటుందని మంత్రి తెలిపారు.

మహిళలకు స్వేచ్ఛ లభిస్తే ఈ ప్రపంచానికి బానిసత్వం నుండి విముక్తి లభించినట్టేనని భావించిన కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి వారికి సమాన అవకాశాలు, సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కులను కల్పించేందుకు కట్టుదిట్టమైన కార్యాచరణను అమలు చేస్తున్నదని మంత్రి సురేఖ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అవలంభించిన విధానాలే నేడు స్త్రీలు అన్ని రంగాల్లో రాణించేందుకు భూమికను ఏర్పరిచాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళల స్వయం సాధికారత దిశగా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని తెలిపారు. సావిత్రిబాయి పూలే జయంతిని రాష్ట్రంలో మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరపాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించడం పట్ల మంత్రి సురేఖ హర్షం వ్యక్తం చేశారు. స్త్రీవాదం పట్ల, మహిళల అభ్యున్నతి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికికున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని అన్నారు.



చైనాలో కొత్త వైరస్

## కలకలం!

నిశితంగా పర్యవేక్షిస్తున్నామన్న కేంద్రం

**బీజింగ్** : చైనాలో కొత్త వైరస్ కలకలం సృష్టిస్తోంది. కొత్త రకమైన ఇన్ఫెక్షన్ దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందుతోందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రులన్నీ రోగులతో కిక్కిరిసి పోతున్నట్టు సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయి కానీ చైనా లేదా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇంతవరకు ఈ వార్తలను ధృవీకరించలేదు. ఈ వైరస్‌ను 'మెటా న్యుమో వైరస్' (ఎంవిపి) గా పిలుస్తున్నారు. ఈ వైరస్‌ను 2001లోనే గుర్తించారని అంటున్నారు. వందలాదిమందికి దీని బారిన పడ్డారని తెలుస్తోంది. చాలామంది జలుబు, దగ్గు, శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులుతో బాధపడుతున్నారు. ఈ వైరస్ లక్షణాలుగా వీటిని భావిస్తున్నారు. ఉత్తర చైనాలో ఈ ఇన్‌ఫెక్షన్ ఎక్కువగా వుంది. ఈ నేపథ్యంలో చైనాలో పరిస్థితులపై ఆసియా దేశాలు దృష్టి సారించాయి. కరోనాకు ఎలాంటి లక్షణాలైతే వున్నాయో ఆలాంటి లక్షణాలే ఈ వైరస్‌లో కూడా కనిపిస్తున్నాయని, రోగ నిరోధక శక్తి వున్నవారు ఎక్కువగా వీటి బారిన పడే అవకాశం వుందని డాక్టర్లు చెబుతున్నారు. డిసెంబరు 16నుండి 22 వరకు ఈ వారంలో అంటువ్యాధుల బారిన పడిన వారి సంఖ్య కూడా భారీగానే వుందని మీడియా వార్తలు పేర్కొంటున్నాయి. చైనాలో వైరస్ వార్తలను నిశితంగా పరిశీలిస్తున్నామని కేంద్ర ఆరోగ్య శాఖ పేర్కొంది. చైనాలో శ్వాసకోశ ఇబ్బందులతో బాధపడేవారి సంఖ్య పెరిగినట్లు తెలుస్తోందని అన్నారు. 14ఏళ్ళలోపు వయస్సు గల పిల్లల్లో హ్యూమన్ మెటా న్యుమోవైరస్ (హెచ్‌ఎంవిపి) కేసులు పెరిగాయి. అంతర్జాతీయ సంస్థలతో దీనిపై నిరంతరంగా మాట్లాడుతున్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సిడిసి) అధికారి ఒకరు తెలిపారు. భారత్‌లో ఇప్పటివరకు ఇలాంటి కేసులేవీ లేవని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అతుల్ గోయల్ విలేకర్లకు చెప్పారు.

ఓయూ పరిధిలో ఫీజు పెంపు ఆలోచనను

## విరమించుకోవాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) పరిధిలో ఇంజినీరింగ్ కాలేజీల్లో సెమిస్టర్ ఫీజులను పెంచాలన్న ఆలోచనను విరమించుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజులను పెంచాలని విశ్వవిద్యాలయం చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అటానమస్ కాలేజీలు పరీక్ష ఫీజులను పెంచుకుంటున్నాయని తెలిపారు. ఓయూ పరిధిలోని కాలేజీలకు వర్సిటీ ఫీజులను నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని వర్సిటీల కంటే ఓయూ పరిధిలో ఫీజు ఎక్కువగా ఉందని విమర్శించారు. ఇప్పుడిప్పుడే పేద విద్యార్థులు ఉన్నత, సాంకేతిక విద్యను చదువుకుంటున్నారని తెలిపారు. ఈ ఫీజు పెంపు వల్ల వారికి ఆర్థికంగా భారమవుతుందని పేర్కొన్నారు. ఈ పెంపు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యామండలి, ఓయూ అధికారులు స్పందించి ఫీజులను తగ్గించాలని కోరారు. లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## ఈపీఎస్ చందాలతో కార్పొరేట్ల కడుపులు నింపొద్దు

8న హైదరాబాద్‌లో పెన్షనర్ల రాష్ట్ర సదస్సు : టాప్ర రాష్ట్ర అధ్యక్షులు నారాయణరెడ్డి





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈపీఎస్ చందాలతో కార్పొరేట్ల కడుపులు నింపొద్దని తెలంగాణ ఆల్ పెన్షనర్లు, రిటైర్డ్ పర్సన్ల అసోసియేషన్ (టాప్ర) రాష్ట్ర అధ్యక్షులు పోతుల నారాయణరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈపీఎస్ పెన్షనర్లు గౌరవంగా బతికేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల ఎనిమిదిన హైదరాబాద్‌లో ఈపీఎస్ పెన్షనర్ సంఘాల జాతీయ సమన్వయ కమిటీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తామని అన్నారు. అదేరోజు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈపీఎస్ పెన్షనర్ల రాష్ట్ర సదస్సును జరుపుతామని వివరించారు. పెన్షనర్ల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలను చేస్తామన్నారు. టాప్ర ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి మాట్లాడుతూ కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగే ధరలకనుగుణంగా కరువు భత్యం ఇవ్వాలని కోరారు. పెన్షన్ మంజూరు విషయంలో ప్రొరాటా పద్ధతిని రద్దు చేయాలన్నారు. ఈ విధానం వల్ల నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని చెప్పారు.

పెన్షన్ లెక్కించడంలో వేతన సీలింగ్ ఎత్తేయాలని అన్నారు. కట్ ఆఫ్ తేదీతో సంబంధం లేకుండా అందరికీ హయ్యర్ పెన్షన్‌ను మంజూరు చేయాలని కోరారు. పెన్షనర్లందరి ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వమే చూసుకోవాలని డిమాండ్ చేశారు. ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టాప్ర కన్వీనర్ ఎస్ బ్రహ్మచారి, కోశాధికారి నాగేశ్వర్‌రావు, ఎం జనార్ధన్‌రెడ్డి, ఎల్ దుర్గాప్రసాద్, కె వైకుంటరావు, శంకర్‌రావు, కె రాధాకృష్ణ, ఎం కృష్ణారావు, జి విజయ్‌కుమార్, కె నర్సప్ప, జి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## రాష్ట్రంలో బ్లాక్ చెయిన్ సిటీ...

లిక్వాంటం కంప్యూటింగ్‌లో 'సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్' : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



నవ తెలంగాణ - హైదరాబాద్

తెలంగాణలో బ్లాక్ చైన్ సిటీని ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి డి శ్రీధర్ బాబు అన్నారు. ఎక్కడ, ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలనే అంశంపై ఇప్పటికే సంబంధిత పరిశ్ర మలు, నిపుణులతో సంప్రదిం పులు ప్రారంభించామని వెల్లడించారు. శుక్రవారం మాదాపూం "లో డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్ రంగంలో భారీగా ఉపాధి కల్పిస్తున్న 'సెంటిలియన్ నెట్ వర్క్స్ అండ్ హెచ్‌సి రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్' నూతన క్యాంపస్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. 'కొత్త సాంకేతికల ఆవిష్కరణలో తెలంగాణను నంబర్ వన్‌గా నిలిచేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. ఆయా రంగాల్లో తెలంగాణ యువతకు స్కిల్స్ యూనివర్సిటీ, పరిశ్రమల సహకారంతో శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఫ్యూచర్ సిటీలో నిర్మించ తలపెట్టిన ఎఐ యూనివర్సిటీకి త్వరలో శంఖుస్థాపన చేయబోతున్నాం. ప్రత్యేకంగా క్వాంటం కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ప్రారంభించబోతున్నాం' అని తెలిపారు. ఇటీవలి కాలంలో కీలకంగా మారిన డ్రోన్ టెక్నాలజీపై తెలంగాణ యువతకు ప్రత్యేకంగా శిక్షణను ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు.

## రెండు రోజుల ఆనందం ఆవిరి

సెన్సెక్స్ 720 పాయింట్ల పతనం



**ముంబయి** : గత కొన్ని రోజులుగా తీవ్ర ఒత్తిడిలో కొనసాగుతున్న దలాల్‌స్ట్రీట్ రెండు రోజుల ఉపశమనం మళ్లీ వారాంతం సెషన్‌లో ఆవిరయ్యింది. బుధ, గురు వారాల్లో రాణించిన సూచీలు.. శుక్రవారం మళ్లీ భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సెన్సెక్స్-30 సూచీ 720.60 పాయింట్లు లేదా 0.90 శాతం నష్టంతో 79,223కు పరిమితమయ్యింది. ఇంట్రాడేలో 80,072-79,147 మధ్య కదలాడింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 183.90 పాయింట్లు లేదా 0.76 శాతం కోల్పోయి 24,004 వద్ద ముగిసింది. నిఫ్టీ-50లో 32 స్టాక్స్ నష్టాలను చవి చూశాయి. విప్రో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, సిప్లా స్టాక్స్ అత్యధికంగా 2.83 శాతం వరకు నష్టపోగా.. మరోవైపు ఓఎన్‌జీసీ, టాటా మోటార్స్, టైటన్, నెస్లే ఇండియా, ఎస్బీఐ లైఫ్ షేర్లు గరిష్టంగా 5.11 శాతం వరకు పెరిగిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. ప్రధానంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఐటీ రంగాల స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి మార్కెట్ల నష్టాలకు ప్రధాన కారణమయ్యాయి. ఆయా రంగాల షేర్లు 1 శాతం మేర నష్టపోయాయి.

కొత్త ఏడాదిలో

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ అకాడమీ ఏర్పాటు

**హైదరాబాద్** : డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో సమగ్ర ఆర్థిక అక్షరాస్యతను అందించడానికి ఐడీఎఫ్‌సీ ఫస్ట్ అకాడమీని ప్రారంభించినట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ వెల్లడించింది. దీంతో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. ఇది ఆర్థిక విషయాలను మెరుగ్గా నిర్వహించడానికి ప్రజలకు మద్దతును అందిస్తుందని తెలిపింది. ఇది తమ మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లో కూడా అందుబాటులో ఉంటుందని ఐడీఎఫ్‌సీ బ్యాంక్ ఎండీ, సీఈఓ వి వైద్యనాథన్ పేర్కొన్నారు. ఈక్విటీ, ఎంఎఫ్, పొదుపు తదితర పథకాల్లో పెట్టుబడులపై అవగాహన పెంచుకోవచ్చన్నారు.

## సామ్‌సంగ్ 'బిగ్ టీవీ డేస్' ఆఫర్లు

**గూర్‌గావ్** : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్త ఏడాది, రిపబ్లిక్ డే సందర్భంగా 'బిగ్ టీవీ డేస్' ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆఫర్ జనవరి 3 నుండి జనవరి 31 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఎఐ శక్తితో ప్రీమియం టివి శ్రేణీలో అద్భుతమైన ఆఫర్‌లతో సినిమాటిక్ అనుభవాలను పొందవచ్చని పేర్కొంది. టివిలపై 20 శాతం వరకు క్యాష్‌బ్యాక్, జీరో డౌన్ పేమెంట్, 30 నెలల వరకు సులభమైన ఇఎంఐ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. ఈ ఆఫర్లు తమ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్లలో అందుబాటులో ఉంటాయని సామ్‌సంగ్ ఇండియా విజువల్ డిస్‌ప్లే బిజినెస్ సీనియర్ డైరెక్టర్ విప్లేష్ డాంగ్ తెలిపారు.

అఫ్లెక్స్ సోలార్

## బ్రాండ్ అంబాసీడర్‌గా రాహుల్ ద్రావిడ్



**హైదరాబాద్** : అఫ్లెక్స్ సోలార్ లిమిటెడ్ తన బ్రాండ్ అంబాసీడర్‌గా ప్రముఖ క్రికెటర్ రాహుల్ ద్రావిడ్‌ను నియమించుకున్నట్లు ప్రకటించింది. తొలిసారి తాము ప్రచారకర్తగా రాహుల్‌ను ఎంచుకున్నామని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విని సెహగల్ తెలిపారు. ఇది తమ మార్కెట్ విస్తరణకు ఎంతో దోహదం చేయనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## విదేశీ మారకం నిల్వల్లో ఆగని పతనం

- మరో 4.11 బిలియన్ డాలర్లు తగ్గుదల
- ఎనిమిది నెలల కనిష్టానికి క్షీణత



**ముంబయి** : భారత విదేశీ మారకం నిల్వల పతనం కొనసాగుతోంది. వరుసగా నాలుగో వారంలోనూ క్షీణించాయి. ప్రస్తుత ఏడాది డిసెంబర్ 27తో ముగిసిన వారంలో మారకం నిల్వలు 4.1 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.35వేల కోట్లు విలువ) తరిగిపోయి 640.28 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దీంతో ఎనిమిది నెలల కనిష్టానికి పడిపోయిన ట్లయ్యిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) శుక్రవారం ఓ రిపోర్ట్‌లో తెలిపింది. అంతకు ముందు మూడు వారాల్లో ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 13.7 బిలియన్ డాలర్లు పైగా క్షీణించాయి. అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 85 దిగువకు పడిపోవడంతో విదేశీ మారకం నిల్వలపై ఒత్తిడి తీవ్రంగా పెరిగింది. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికైనప్పటి నుంచి భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడుల భారీగా తరలిపోవడంతో పాటుగా సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో జీడీపీ వృద్ధి దాదాపు రెండేండ్ల కనిష్టానికి దిగజారడం, రూపాయి విలువ పడిపోవడం విదేశీ మారకం నిల్వలు కరిగిపోవడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి.

ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరులో ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 704.885 బిలియన్ డాలర్లతో జీవిత కాల గరిష్టాన్ని తాకాయి. కేవలం గడిచిన మూడు నెలల్లోనే రూ.5.20 లక్షల కోట్ల విలువ చేసే 65 బిలియన్ డాలర్ల విదేశీ మారకం నిల్వలు కరిగిపోవడం ఆందోళనకరం. డిసెంబర్ 27 నాటి వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 551.9 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. బంగారం రిజర్వులు 541 మిలియన్ డాలర్లు తగ్గి 66.268 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) వద్ద భారత్ రిజర్వ్ నిల్వలు యథాతథంగా 4.217 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఆర్బీఐ వద్ద విదేశీ మారకం నిల్వలు భారీగా క్షీణించనున్నాయి. దీంతో విదేశీ రుణాలు, వాణిజ్య చెల్లింపులకు కటకట ఏర్పడే ప్రమాదం ఉంది.



## ట్రాఫిక్ విధుల్లో ట్రాన్స్‌జెండర్లు

### పోలీసులకు సహకరించేలా 39 మంది నియామకం

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రించటానికి ట్రాన్స్‌జెండర్లు విధుల్లో దిగారు.అడ్డదిడ్డంగా వెళ్లే వాహనాలు మోదలుకుని..నిబంధనలు ఉల్లంఘించే వారిని పట్టుకోవటం..ఇలా తమ విధులను నిర్వర్తిస్తున్నారు. ఇది తమ జీవితాల్లో అద్భుతమైన ప్రయాణమని ట్రాన్స్‌జెండర్లు అంటున్నారు. హైదరాబాద్‌లోని 39 మంది ట్రాన్స్‌జెండర్లకు సాధికారత కల్పించారు, వీరు నగర పోలీసులకు సహాయం చేయడానికి ట్రాఫిక్ అసిస్టెంట్‌లుగా సేవలందిస్తున్నారు.



## కుంగిన బ్రిడ్జి గడ్డర్

### భద్రాచలం-వెంకటాపురం రవాణా సౌకర్యం బంద్

### పురాతన బ్రిడ్జీలకు ఇసుక లారీల ముప్పు

### ఎస్ఈ పరిశీలన.. అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు ప్రణాళిక

**నవతెలంగాణ-వెంకటాపురం**

భద్రాచలం- వెంకటాపురం మధ్యలో ప్రధాన రహదారిపై ఎదిర యాకన్నగూడెం సమీపంలో రాళ్లవాగుపై నిర్మించిన వంతెన గడ్డర్ కుంగిపోయింది. ఈ బ్రిడ్జిపై నుంచి రోజూ వందల సంఖ్యలో ఇసుక లారీలు వెళ్లడమే దీనికి ప్రధాన కారణం. స్పందించిన అధికారులు శుక్రవారం నుంచి ఆ బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కుంగిన గడ్డర్, బ్రిడ్జి నాణ్యతను ఎస్ఈ నత్త వెంకటేశ్వర్లు పరిశీలించారు. బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలంటే 4 నెలల సమయం పడుతుందని, ప్రత్యామ్నాయంగా అప్రోచ్ రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించాలని తెలిపారు.భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి రోజూ వందల సంఖ్యలో లారీలు హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు ఈ వంతెన పైనుంచే వెళుతుంటాయి. ఇసుక క్వారీ నిర్వాహకులు నిబంధనలకు మించి అధికలోడుతో లారీలను ఈ వంతెన పైనుంచి వెళ్లడం వల్లే ఆ బరువుకు వంతెన గడ్డర్ కుంగి ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. భద్రాచలం -వెంకటాపురం ప్రధాన రహదారిపై చర్ల మండలం నుంచి వెంకటాపురం వరకు పురాతన కాలంలో నిర్మించిన బ్రిడ్జిలే ఉన్నాయి. ఆ వంతెనల మరమ్మత్తులపై ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. దాంతో చాలా బ్రిడ్జీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దానికి తోడు బ్రిడ్జిల పై నుంచి అధికలోడుతో ఇసుక లారీలు నిత్యం వందల సంఖ్యలో వెళుతుండటంతో యాకన్న గూడెం వద్దనున్న పురాతన బ్రిడ్జి శుక్రవారం కుంగిపోయింది. ఇలాగే వందల సంఖ్యలో ప్రయాణిస్తున్న ఇసుక లారీల వల్ల ఆలుబాక సమీపంలో జిన్నెల వాగుపై నిర్మించిన వంతెన, ఏదిర సమీపంలో చల్ల వాగు పై నిర్మించిన వంతెన, వీరభద్రవరం సమీపంలో నిర్మించిన వంతెన, కంకలవాగుపై వెంకటాపురం వద్ద నిర్మించిన వంతెనలు సైతం కుంగిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇలా జరిగితే రాకపోకలకు కష్టం అవుతుందని అంటున్నారు.

**నిలిచిన ఆర్టీసీ బస్సులు.. ఇబ్బందుల్లో ప్రయాణికులు**

భద్రాచలం డిపో నుంచి వెంకటాపురం వరకు గంటకు ఒక బస్సు ఉంటుంది. యాకన్న గూడెం వద్ద బ్రిడ్జి కుంగిపో వడ ంతో ఆర్టీసీ బస్సులు నిలిపివేశారు. దాంతో భద్రాచల ం నుంచి వెంకటాపురం, వాజేడు, పేరూరు మండలాలకు ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**మణుగూరు పై నుంచి రాకపోకలు : అధికారులు**

వెంకటాపురం మండలం యాకన్న గూడెం వద్ద బ్రిడ్జి గడ్డర్ కుంగిపోవడంతో శుక్రవారం నుంచి ఆ బ్రిడ్జి పై నుంచి భారీ వాహనాల రాకపోకలు నిలిపివేశారు. అత్యవసర పరిస్థితిలో వెళ్లాల్సిన ప్రయాణికులు మణుగూరు నుంచి వెళ్లాలని తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎస్ఐ తిరుపతి సూచించారు.

## 2030 నాటికి 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధనం

(మొదటిపేజీ తరువాయి)

ప్రతినిధులు హాజరయ్యారు. ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎమ్‌డీ బలరాం నాయక్, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ కృష్ణభాస్కర్, టీజీఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ, టీజీఎన్పీడీసీఎల్ సీఎమ్‌డీ వరుణ్‌రెడ్డి, టీజీరెడ్కో వైస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వావిళ్ల అనీల తదితరులు పాల్గొన్నారు. ఉదయం జరిగిన ఈ సమావేశంలో మంత్రి ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో 15,623 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉన్నదనీ, 2029-30 నాటికి ఇది 24,215 మెగావాట్లకు చేరుతుందనీ, 2035 నాటికి ఈ డిమాండ్ 31,809 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశామన్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణా చర్యల్లో భాగంగా పునరుత్పాదక ఇంధనంపై దృష్టి పెట్టాలని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. దానిలో భాగంగా రాష్ట్రంలో 2030 నాటికి 20వేల మెగావాట్ల పునరుత్పాదక, క్లీన్ అండ్ గ్రీన్ ఇంధనాన్ని తెచ్చేలా కొత్త విద్యుత్ పాలసీని రూపొందిస్తున్నామని వివరించారు. దానికోసం అన్ని వర్గాల ప్రజలు, పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఈ పాలసీని త్వరలోనే మంత్రివర్గ సమావేశంలో ఆమోదించి ఆ తర్వాత అమల్లోకి తెస్తామన్నారు. దీనికోసం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఆధునిక సాంకేతికతపై పూర్తిస్థాయి అధ్యయనం చేశామన్నారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పారు. రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా జాయింట్ వెంచర్లుగా పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ఏర్పాటు చేసేలా విధివిధానాలు రూపొందిస్తున్నామని తెలిపారు. 20 వేల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎమ్ కుసుమ్ పథకం ద్వారా 4వేల మెగావాట్ల వరకు మహిళా స్వయం సహాయక బృందాలకు కేటాయిస్తూ ఒప్పందం జరిగిందని చెప్పారు. అలాగే వ్యవసాయ భూముల్లోనూ రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన విధివిధానాలపై కసరత్తు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉండేలా, ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసేలా ప్రాజెక్టుల నిర్మాణం చేపడతామని అన్నారు. పునరుత్పాదక ప్రాజెక్టుల్లో టీజీ జెన్‌కో భాగస్వామ్యంపై మంత్రి స్పష్టమైన సమాధానం చెప్పలేదు. పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌మిషన్ ఏర్పాట్లపైనా స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం ప్రయివేటు భాగస్వాములతోనే మాట్లాడుతున్నామని చెప్పారు.

రాష్ట్రంలో కొత్తగా వస్తున్న ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఫార్మాసిటీ, మెట్రో రైల్ విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, ఇండస్ట్రియల్ క్లస్టర్స్ దృష్ట్యా విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని విశ్లేషించారు. రాష్ట్రంలో ప్రస్తుతం పునరుత్పత్తి ఇంధన సామర్థ్యం 11,399 మెగావాట్లు ఉందనీ, దానిలో సోలార్ విద్యుత్ 7,889 మెగావాట్లు, జల విద్యుత్ 2,518 మెగావాట్లతో పాటు ఇతర మార్గాల ద్వారా మిగిలిన విద్యుదుత్పత్తి జరుగుతున్నదని వివరించారు. ఇప్పటికే శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల్లో పంప్డ్ స్టోరేజ్ ఉన్నాయనీ, ఫ్లోటింగ్ సోలార్, గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ వంటి ఇంధన ఉత్పత్తి మార్గాలు కూడా పరిశీలనలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వాహన చార్జింగ్ స్టేషన్ల సంఖ్య ప్రస్తుతం 872 ఉన్నాయనీ, వీటి సంఖ్యను మరింత పెంచాల్సి ఉందన్నారు.

# ఆర్‌ఆర్‌ఆర్‌కు భూసేకరణ త్వరగా పూర్తిచేయాలి



**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్**

ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి భూసేకరణను వేగంగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రైతులకు పరిహారం నిర్ణయించే విషయంలో ఉదారంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఆర్బిట్రేటర్లుగా ఉన్న జిల్లా కలెక్టర్లు వీలైనంత ఎక్కువ మొత్తంలో రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆర్‌ఆర్‌ఆర్, జాతీయ రహదారుల భూ సేకరణ, పరిహారం, హైబ్రిడ్ యాన్యుటి మోడల్ (హ్యామ్) విధానంలో రహదారుల నిర్మాణం, రేడియల్ రోడ్ల నిర్మాణాలపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. భూసేకరణ సమయంలో స్థానిక ప్రజా ప్రతినిధులతోనూ చర్చించాలనీ, తరచూ రైతులతో సమావేశమై ఆయా రహదారుల నిర్మాణాలతో కలిగే ప్రయోజనాలను వివరించడం ద్వారా భూసేకరణను వేగవంతం చేయొచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. ఆర్‌ఆర్‌ఆర్ (దక్షిణ)కు ఎన్‌హెచ్‌ఏఐ సూత్రప్రాయ ఆమోదం తెలిపిన నేపథ్యంలో హెచ్‌ఎండీఏతో అలైన్‌మెంట్ చేయించాలని సూచించారు. హైదరాబాద్‌ను కలిపే 11 రహదారులకు ఆటంకం లేకుండా రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సీఎం అన్నారు. రేడియల్ రోడ్లకు సంబంధించి ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండడం, పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా ఉండడంతో పాటు అవుటర్ రింగు రోడ్డు, ఆర్‌ఆర్‌ఆర్ అనుసంధానంలో ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు.

రాష్ట్రంలోని మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, ఖమ్మం మీదుగా సాగే నాగ్‌పూర్-విజయవాడ (ఎన్‌హెచ్-163జీ) రహదారి, ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల రహదారి (ఎన్‌హెచ్-63), జగిత్యాల-కరీంనగర్ (ఎన్‌హెచ్ 563) రహదారుల నిర్మాణంతో పాటు వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల (ఎల్‌డబ్ల్యూఎఫ్) రహదారుల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ, అటవీ అనుమతుల్లో అడ్డంకుల తొలగింపునకు సీఎం రేవంత్‌రెడ్డి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఉపయోగపడే రహదారుల నిర్మాణంలో అటవీ శాఖ ఎందుకు కొర్రీలు పెడుతున్నదని పీసీసీఎఫ్ డోబ్రియల్‌ను సీఎం ప్రశ్నించారు. గతంలో కొన్ని నిబంధనలు పాటించకపోవడంతో సమస్యలు ఉన్నాయని పీసీసీఎఫ్ బదులిచ్చారు.

రాష్ట్ర స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను ఇక్కడే పరిష్కరిస్తామనీ, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే వెంటనే నివేదిక రూపంలో సమర్పించాలని సీఎం ఆదేశించారు. ఆర్ అండ్ బీ, అటవీ శాఖ నుంచి ఒక్కో అధికారిని ప్రత్యేకంగా ఈ సమస్యల పరిష్కారానికి కేటాయించాలని సీఎం సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పది రోజులకోసారి వారితో సమీక్షించి త్వరగా క్లియరెన్స్ వచ్చేలా చూడాలనీ, ఇక్కడ కాకపోతే ఆర్ అండ్ బీ, అటవీ శాఖ మంత్రులు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి, అధికారులతో సమావేశమై అనుమతులు సాధించాలని సీఎం సూచించారు. జాతీయ రహదారుల నిర్మాణంలో అండర్ పాస్‌ల నిర్మాణాన్ని విస్మరిస్తుండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆ సమస్య ఎదురుకాకుండా నిర్మాణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. రైతులు కిలోమీటర్ల కొద్దీ దూరం వెళ్లి తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా చూడాలని సీఎం సూచించారు.

**హ్యామ్ విధానంలో...**

రాష్ట్రంలో హ్యామ్ విధానంలో ఆర్ అండ్ బీ పరిధిలో 12 వేల కిలోమీటర్లు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 17,700 కిలోమీటర్లు రహదారులు నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ రహదారుల నిర్మాణానికి సంబంధించి పాత జిల్లాలను యూనిట్‌గా తీసుకోవాలని సూచించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ అనే తేడా లేకుండా ఒకే రకమైన నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇందుకు సంబంధించి కన్సల్టెన్సీల నియామకం, డీపీఆర్ ల తయారీ... రహదారుల నిర్మాణం విషయంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని అధికారులను సీఎం ఆదేశించారు. మూడేండ్లల్లో ఈ రహదారుల నిర్మాణం పూర్తికావాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు చేపట్టాలనీ, కూలిన వంతెలను వెంటనే నిర్మించాలని సీఎం రేవంత్ ఆదేశించారు. రహదారుల నిర్మాణం, మరమ్మతులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు వెంటనే విడుదల చేసి, కేంద్రం నుంచి రావాల్సిన మ్యాచింగ్ గ్రాంట్‌ను పొందాలని ఆర్థిక శాఖ అధికారులకు సీఎం సూచించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శులు వి.శేషాద్రి, జి.చంద్రశేఖర్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శులు షానవాజ్ ఖాసీం, మాణిక్ రాజ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఆదాయం పెంచే బాధ్యత మీదే

### ప్రతినెలా రూ. 30 వేల కోట్లు కావాలి

- రూ. 4 వేల కోట్ల ఆదాయం తగ్గుతోంది
- అది పెరగాలన్నా, ప్రజలకు పంచాలన్నా మీ చేతుల్లోనే
- కష్టకాలంలో బాధ్యతలు చేపట్టాం..సహకరించాలి : టీజీవోల డైరీ ఆవిష్కరణలో సీఎం రేవంత్

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్**

రాష్ట్రం ఆర్థిక పరిస్థితుల మూలంగా ప్రభుత్వానికి ఆదాయం లేకపోవడంతో కొన్ని సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం రూ.18500 కోట్లు మాత్రమేనని వ్యాఖ్యానించారు. ఇది ప్రభుత్వ అవసరాలకు సరిపోవడంలేదని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అన్నీ సక్రమంగా నిర్వహించాలంటే ప్రభుత్వానికి రూ.30వేల కోట్ల ఆదాయం రావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. వచ్చే ఆదాయంలో రూ.6500కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర అవసరాలకు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. మరో రూ. 6500 కోట్లు ప్రతినెలా అప్పులకు కడుతున్నామన్నారు. మిగిలిన రూ. 5500 కోట్లలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రం కనీస అవసరాలు నెరవేరాలంటే ప్రతినెలా రూ. 22500 కోట్లు కావాలని వివరించారు. వచ్చిన ఆదాయంతో పోలిస్తే రూ.4000 కోట్లు తక్కువ పడుతున్నదని గుర్తు చేశారు. గత పదేండ్ల పాలనలో పరిపాలన వ్యవస్థను భ్రష్టు పట్టించారని విమర్శించారు. మేము అధికారంలోకి రాగానే పునరుద్ధరించే ప్రయత్నం చేశామన్నారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు చేర్చేది ఉద్యోగులేనని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కష్టకాలంలో బాధ్యతలు చేపట్టిన సంగతిని గుర్తించాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ప్రత్యేక రాష్ట్రంలో ఉద్యోగులు అధికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. . అలాంటి పరిస్థితుల్లో ఒక గొప్ప అవకాశం మాకు ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి రాగానే తెలంగాణ ప్రజలకోసం పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా మొదటి తారీఖున జీతాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రభుత్వంపై ఆధారపడి ప్రజల కోసం పనిచేసే వారికి ప్రతినెలా మొదటి తేదీనే జీతాలు ఇస్తున్నామని గుర్తు చేశారు. అక్కడక్కడా కొన్ని సమస్యలు ఉన్న మాట వాస్తవమేననీ, వాటిని సరిచేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రాష్ట్రంలో సామాజిక మార్పును తీసుకొచ్చామన్నారు. ఆర్థికపరమైన మార్పులు తీసుకురావాలంటే ఇంకా కొంత సమయం పడుతుందని తెలిపారు. రాష్ట్ర ఆదాయాన్ని పారదర్శకంగా ఖర్చు చేసేందుకు మీరు ఎలాంటి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ ఆదాయం ప్రతినెలా మరో రూ.4000 కోట్లు పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రభుత్వం మనది, ఆదాయాన్ని పెంచాలన్నా, పెంచిన ఆదాయం పంచాలన్నా మీ చేతుల్లోనే ఉందని వ్యాఖ్యానించారు. మీ సమస్యలు చెప్పండి, పరిష్కారానికి కార్యాచరణ చేపడతామన్నారు. ఈ ప్రభుత్వం మీ సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరిస్తుందన్నారు. సమస్యల పరిష్కారానికి మీరు ధర్నాలే చేయాల్సిన అవసరం లేదనీ, చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు. రాజకీయాల కోసం కొందరు నిరసనలు, ధర్నాలకు ప్రేరేపిస్తున్నారని వివరించారు. వారి ఉచ్చులో పడితే చివరకు నష్టపోయేది ఉద్యోగులేనని చెప్పారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలనే సంకల్పం మాకున్నా, చేయలేని పరిస్థితి ఉందని చెప్పారు. సర్వశిక్షా అభియాన్ కేంద్ర ప్రభుత్వ పథకమనీ, ఆ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులరైజ్ చేస్తే న్యాయస్థానాల్లో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తున్నదన్నారు. అవకాశం లేకపోయినా రెగ్యులరైజ్ చేయాలని పట్టుబడితే సమస్య పెరుగుతుందన్నారు.

## ఎవరెవరికిస్తారో చెప్పండి..

### గ్రామాల వారీగా జాబితా తయారు చేయాలి

రైతు భరోసాపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

షరతుల పేరిట ఆ పథకాన్ని ఎగ్గొట్టేందుకు కుట్రలంటూ విమర్శలు

స్వీయ ధ్రువీకరణ అడిగితే నిలదీయాలంటూ రైతులకు పిలుపు



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రైతు భరోసా పథకం కింద ఎంతమంది రైతులకు పెట్టుబడి సాయాన్ని అందిస్తారో చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్కారుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇందుకు సంబంధించి గ్రామాల వారీగా జాబితా రూపొందించి, విడుదల చేయాలని సవాల్ విసిరారు. షరతులు, సాకుల పేరిట రైతు బంధు (రైతు భరోసా) పథకాన్ని బొంద పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను కట్టిపెట్టి శనివారం నిర్వహించబోయే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాసగౌడ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తదితరులతో కలిసి కేటీఆర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ ప్రభుత్వ హయాంలో రైతు బంధు పథకం ద్వారా రైతులను శాసించే స్థితికి తీసుకొస్తే, నేటి కాంగ్రెస్ సర్కారు వారిని యాచకులుగా మారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం 11 సీజన్లలో రూ.73 వేల కోట్లను రైతు బంధు కోసం విడుదల చేశామని తెలిపారు. కానీ ఏడాది కాలంగా రేవంత్ సర్కారు ఒక్క అర్‌పైసా కూడా విడుదల చేయలేదని వాపోయారు. ఎన్నికల ముందు 'వరంగల్ రైతు డిక్లరేషన్' పేరిట బిల్డప్‌లిచ్చి, మ్యానిఫెస్టోలో అనేక హామీలు గుప్పించిన కాంగ్రెస్, ఇప్పుడేమో రైతు భరోసా కోసం అన్నదాతలే ప్రమాణ పత్రాలు, స్వీయ ధృవీకరణ పత్రాలను ఇవ్వాలంటూ కోరటం విడ్డూరంగా ఉందన్నారు. రేవంత్ సర్కారు అధికారంలోకి రాగానే నిర్వహించిన 'ప్రజాపాలన' కార్యక్రమం ద్వారా రైతులు, వారి భూముల వివరాలను సేకరించారని గుర్తు చేశారు. ఆ సమయంలో ఆరు లక్షల అర్జీలు వచ్చాయంటూ ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. మళ్లీ ఇప్పుడు దరఖాస్తులు, ప్రమాణ పత్రాలను అడగటమేంటని నిలదీశారు. రైతు బంధు పథకంలో రూ.22 వేల కోట్ల మేర అవినీతి జరిగిందంటూ ఆరోపిస్తున్న కాంగ్రెస్ నేతలు... అది ఎక్కడెక్కడ జరిగిందో చెప్పగలరా? అని కేటీఆర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఏడెనిమిది నెలల పంట కాలపరిమితి ఉండే పత్తి, కంది, మిరప, చెరుకు తదితర పంటలకు కూడా రెండు సీజన్లలో రైతు బంధునిచ్చామని తెలిపారు. వాటికి రెండు దఫాలు డబ్బులెలా ఇస్తారంటూ ప్రభుత్వ పెద్దలు ప్రశ్నించటం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌కు రైతుల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే రైతు రుణమాఫీ, బోనస్, ఎక్కడెక్కడ ఎంతెంత ధాన్యం కొన్నారనే దానిపై గ్రామ గ్రామాన లిస్టులు తయారు చేసి పంచాయతీ ఆఫీసుల వద్ద ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. 'బీఆర్ఎస్ హయాంలో అసలు కౌలు రైతులను గుర్తించలేదు కదా? ఆ విషయంలో ఇప్పుడు మీ విధానమేంటి?' అని అడగ్గా...'వరంగల్ డిక్లరేషన్‌లో కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామంటూ కాంగ్రెస్ ప్రకటించింది, దాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. అదే ఇప్పుడు మా విధానం...' అని కేటీఆర్ స్పష్టం చేశారు. రైతు భరోసాకు 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' విధి విధానాలను ప్రామాణికంగా తీసుకునేందుకు సర్కారు యోచిస్తోందనీ, అదే జరిగితే రాష్ట్రంలోని 75 శాతం రైతులకు రైతు భరోసా దక్కదని ఆందోళన వ్యక్తం చేశారు, నియమ నిబంధనలు, కొర్రీలు, సాకుల పేరిట రైతు భరోసాను ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని కేటీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ రైతు భరోసా పేరిట ఒక్కో ఎకరాకు రూ.17,500 బాకీ పడిందని తెలిపారు. సంబంధిత వివరాలతో కూడిన వాల్ పోస్టర్లను ఊరూరా వేస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ఐఐటీలు దేశ నిర్మాణ కేంద్రాలు

### అద్భుతమైన ఆవిష్కరణకు వేదిక | ఐఐటీలకు ఆద్యులు నెహ్రూనే..

క్రిటికల్ మినరల్స్ వర్క్‌షాప్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**



ఐఐటీలు విద్యా సంస్థలు మాత్రమే కావని, దేశ నిర్మాణానికి దోహదపడే వేదికలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లాలోని ఐఐటీ హైదరాబాద్ (కంది)లో ఆస్ట్రేలియా ఇండియా క్రిటికల్ మినరల్స్ రిసెర్చ్ హబ్ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐఐటీ హైదరాబాద్ అద్భుతమైన ఆవిష్కరణలకు చిరునామాగా మారిందన్నారు. ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు దేశ భవిష్యత్‌కు కలల కర్మాగారం అని తెలిపారు. ఇక్కడి నుంచి ఇప్పటి వరకు 11,500 పరిశోధనా ప్రచురణలు, 320కి పైగా పేటెంట్లు, స్టార్టప్‌ల ద్వారా రూ.1500 కోట్ల ఆదాయాన్ని అర్జించడం గొప్ప విషయమని అన్నారు. ఆస్ట్రేలియా-ఇండియా క్రిటికల్ మినరల్స్ రిసెర్చ్ హబ్ కింద మోనాష్ యూనివర్సిటీ సహకారంతో చేపట్టిన కార్యక్రమాలు కేవలం తెలంగాణకు, భారత దేశానికే కాకుండా ప్రపంచానికే కీలకంగా మారనున్నట్టు తెలిపారు. తెలంగాణలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని రూపొందించడంలో ఈ వర్క్‌షాప్ సహకార స్ఫూర్తికి అద్దం పడుతుందన్నారు. భారత్‌లో ఐఐటీలకు తొలి ప్రధాని నెహ్రూయే ఆద్యులని గుర్తు చేశారు. ఐఐటీలను ఆధునిక భారతదేశ దేవాలయాలుగా నెహ్రూ అభివర్ణించినట్టు గుర్తుచేశారు. దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ.. పేదరికం, అసమానతలపై పోరాడడానికి అవసరమైన సాధనాలుగా నెహ్రూ పేర్కొన్నారని తెలిపారు. ఐఐటీ హైదరాబాద్ ఏర్పాటులో అప్పటి ఏపీ ముఖ్యమంత్రి, దివంగత కాంగ్రెస్ నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు. వైఎస్సార్ నాయకత్వంలోనే ఐఐటీకి పునాదులు పడ్డాయని చెప్పారు. వైఎస్సార్ గొప్ప రాజకీయ నాయకుడే కాకుండా గొప్ప సంఘసంస్కర్త అని అన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య సౌకర్యాల మెరుగుదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం వైఎస్ఆర్ ప్రయత్నించినట్టు తెలిపారు. ఐఐటీ ఏర్పాటు సమయంలో తాను ఎమ్మెల్సీగా భాగస్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. రాష్ట్రంలో క్లిష్టమైన ఖనిజాలను వెలికితీసేందుకు సమర్థవంతమైన మార్గాలు కనుగొనడం, స్థిరమైన మైనింగ్ పద్ధతులు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందుకోసమే రాష్ట్ర ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పరిశోధన, వాటి సంబంధిత సైన్స్ ఆధారిత కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. క్లిష్టమైన ఖనిజాలు పారిశ్రామిక పదార్థాలు మాత్రమే కాదని, అవి హరిత ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి ఉపయోగపడతాయన్నారు. సోలార్ పవర్ ప్యానెల్స్, విండ్ టర్బైన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, విద్యుత్ నిల్వ బ్యాటరీల వంటివి క్లిష్టమైన ఖనిజాల ద్వారానే తయారవుతాయని తెలిపారు. 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని రాష్ట్రంలో ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు. గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీని భవిష్యత్ ఇంధనంగా ప్రభుత్వాలు భావిస్తున్నట్టు తెలిపారు. ఆవిష్కరణల ప్రోత్సాహానికి, సుస్థిరతకు రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందన్నారు. ఐఐటీల ఆలోచనలు పరిశ్రమలను పునర్ నిర్వచించి, ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మిస్తాయన్నారు. గ్రీన్ ఎనర్జీ, స్థిరమైన టెక్నాలజీ, శాస్త్రీయ ఆవిష్కరణల్లో దేశంలో మొదటి స్థానంలో నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, గౌరవ అతిథి కాన్సుల్ జనరల్ ఎంఎస్ హిల్లరీ మెక్‌గేచీ, ఆస్ట్రేలియన్ కాన్సులేట్-జనరల్ బెంగుళూరు, భారత హైకమిషనర్ గోపాల్ బాగ్లే, మైనింగ్ జాయింట్ సెక్రటరీ దినేష్ మహూర్, సింగరేణి కాలరీస్ సీఎండీ మోహన్ యెల్లిశెట్టి, ప్రొఫెసర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సమగ్ర శిక్షా ఉద్యోగుల పట్ల చిన్నచూపు సరికాదు

### సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నిజామాబాద్‌లో సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

విద్యా శాఖలో అతి తక్కువ వేతనాలతో ఎంతగానో శ్రమిస్తున్న సమగ్ర సర్వ శిక్షా అభియాన్, సీఆర్పీ సిబ్బందిని ప్రభుత్వం చిన్న చూపు చూడటం సరికాదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సమగ్ర సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అప్పటివరకు పే-స్కేల్స్ ఇవ్వాలని, ఆరోగ్య బీమా సౌకర్యం రూ.10 లక్షలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే రిటైర్ అయిన ఉద్యోగులకు రూ.25 లక్షలు బెనిఫిట్స్ కింద ఇవ్వాలని, ప్రభుత్వ విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలని అన్నారు. ఈ సమ్మెతో పేద విద్యార్థులకు కలుగుతున్న ఇబ్బందిని ప్రభుత్వం గుర్తించకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ప్రభుత్వ వైఖరి వల్ల ఈ సమ్మె మరింత జఠిలమైతే దానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే భద్రత కల్పిస్తామని, వేతనాలు పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకొచ్చి సంవత్సరం పూర్తయినా ఈ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. న్యాయమైన ఈ సమ్మెకు రాష్ట్రంలోని యావత్ కార్మికవర్గం అండగా నిలవాలని, సమస్య పరిష్కారమయ్యేంత వరకు సమగ్ర శిక్షా ఉద్యోగులు సమరశీలంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శంకర్‌గౌడ్, నూర్జహాన్, జిల్లా ఉపాధ్యక్షులు నన్నేసాబ్, జంగం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ - మహేశ్వరం
శనివారం | జనవరి 04, 2025 | www.navatelangana.com

## ఉద్యమంలో భాగస్వాములవుదాం: కవిత



నవతెలంగాణ - సిటీబ్యూరో

రాజకీయాలకు అతీతంగా ఉద్యమంలో భాగస్వాములు అవుదాం అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ జాగృతి నాయకురాలు అర్చన సేనాపతి జాగృతి సభ్యులు శుక్రవారం కవితను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మునుకుంట్ల నవీన్ గౌడ్ తెచ్చిన నూతన క్యాలెండర్ ను కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. కవితను కలిసిన వారిలో కిరణ్ కుమార్, భగత్ యాదవ్, సునీల్ జోషి, రాజ్ కుమార్, శ్రీకాంత్ యాదవ్, ఈశ్వర్, అజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-చంపాపేట్

ఎల్బీనగర్ నియోజక వర్గం చంపాపేట్ డివిజన్ పవన్ పూరి కాలనీవాసులతో శుక్రవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు యాదయ్య, జనరల్ సెక్రటరీ నర్సిరెడ్డి, కోశాధికారి మాధవ రెడ్డి, ఉపాధ్యక్షులు భాస్కరచారి, సలహాదారులు సత్యనారాయణ రెడ్డి, శ్రీనాథ్ పాల్గొన్నారు.



## 'ఫోర్త్ సిటీ పనులు వేగవంతం చేస్తాం'

### సీఎంను కలిసిన కేఎల్ఆర్, దేప భాస్కర్ రెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

మహేశ్వరం నియోజకవర్గాన్ని మహానగరంగా మార్చేందుకు స్పీడ్ గా అడుగులు పడుతున్నాయని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో శుక్రవారం కేఎల్ఆర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత సీఎంకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు కాసేపు భేటీ అయ్యారు. అనంతరం కేఎల్ఆర్ మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో ఫోర్త్ సిటీ, గ్రీన్ ఫార్మా స్కిల్ యూనివర్సిటీ, హెల్త్ మరియు ఎడ్యుకేషన్ హబ్స్, ఇండస్ట్రియల్ పార్క్స్, మెట్రో రైలు రాకతో శరవేగంగా అభివృద్ధి చెందనుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యకం చేసినట్టు తెలిపారు. దేశానికే తలమానికం కానున్న 330 ఫీట్ల రోడ్డు, ఓఆర్ఆర్ నుండి ట్రిబుల్ ఆర్ వరకు విస్తరించే రోడ్లు, కంపెనీలకు భూసేకరణ సమస్య తలెత్తకుండా చూడాలని తనకు సీఎం సూచించినట్టు చెప్పారు. ప్రపంచ స్థాయి అగ్ర సంస్థలు ఫోర్త్ సిటీకి క్యూ కడుతున్నాయని సీఎం అన్నారని చెప్పారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో జెన్నాయిగూడ, కందుకూరు మండల రైతులను భూసేకరణకు ఒప్పించడం పట్ల సీఎం హర్షం వ్యక్తం చేసినట్టు తెలిపారు. రైతులు నష్ట పోకుండా పరిహారం, ప్లాట్లు, మహిళలకు సోలార్ ఎనర్జీ ప్లాంట్స్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు వెల్లడించారు. ఫోర్త్ సిటీతో పాటు మహేశ్వరం, కందుకూరు మండలాలను మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దే అంశాలను చర్చించినట్టు పేర్కొన్నారు. స్కిల్ యూనివర్సిటీ సహా ఫోర్త్ సిటీ పనులను నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్షర సమరం చేసిన సావిత్రిబాయి పూలే



తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘసంస్కర్త, రచయిత్రి, స్ఫూర్తి ప్రదాత సావిత్రిబాయి పూలే.. మహిళా విద్యకు ఆద్యురాలిగా నిలిచి, సమానత్వాని కోసం పోరాడింది. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మి కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయడం తమ బాధ్యతగా విశ్వసించిన భర్త మహాత్మా జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో నడిచిన మహనీయురాలు సావిత్రి బాయి పూలే.

సమాజంలోని కులతత్వం, పురుషాధిక్యధోరణులు కలిగిన చాలామంది పండిత మేధావులందరికీ కూడా ఆమె కేవలం మహాత్మా జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసునని కానీ... ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణిగా సమాజం గుర్తించిందన్నారు. సావిత్రిబాయి పూలే స్వయంగా 52 పాఠశాలలను స్థాపించిందని గుర్తుచేశారు. 1852లో మహిళా సేవ మండలి పేరిట మహిళా సంఘాన్ని స్థాపించారు. 1873 సత్యశోధకు సమాజం స్థాపించి మహిళా పేరట కులాంతర వివాహాలను ప్రోత్సహించారు. 1874లో ఒక బ్రాహ్మణ వితంతువునకు జన్మించిన బిడ్డను పూలే దంపతులు దత్తత తీసుకొని యశ్వంత్ అనే పేరు పెట్టి.. పెంచి పెద్ద చేసి డాక్టర్లు చేసిన ఘనత వారిలో ఉన్న గొప్పతనానికి నిదర్శనం. విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మిన సావిత్రిబాయి 1848లో భర్తతో కలిసి బాలికల కోసం పూణేలో మొట్టమొదటి పాఠశాలను నెలకొల్పి చదువు చెప్పడం ప్రారంభించారు.





నవతెలంగాణ- నాగోల్

ఆడబిడ్డల చదువు కోసం అక్షర సమరం చేసిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. శుక్రవారం నాగోల్ డివిజన్ పరిధిలోని కృష్ణవేణి స్కూల్‌లో జరిగిన సావిత్రి బాయి జయంతి కార్యక్రమానికి నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్‌లతో కలిసి శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తర్వాత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూర బ్రహ్మయ్య, కన్వీనర్ మద్దెల వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పగడాల ఎల్లయ్య ఉపాధ్యక్షులు శ్రీను, గ్రేటర్ అధ్యక్షుడు కుంచాల బ్రహ్మయ్య ప్రధాన కార్యదర్శి ఆమనగంటి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, పగడాల లక్ష్మణ్, పెయింట్ అసోసియేషన్ డి. వెంకటేష్, కే లాలు, లక్ష్మయ్య, వెంకటేష్, కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు, టీచర్స్ ఇతరులు పాల్గొన్నారు.

### మహిళా ఉపాధ్యాయులకు ఘన సన్మానం



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అనాజ్‌పూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. తర్వాత సావిత్రిబాయి పూలే, జాతీయ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పవన కుమారి, ఉపాధ్యాయురాలు ఊరడి లావణ్య, ఉపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, జంగయ్య, హర్షిత, విద్య కమిటీ చైర్మెన్ నాతి స్వప్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో

నవతెలంగాణ- నాగోల్



రంగారెడ్డి జిల్లా న్యూ నాగోల్ చౌరస్తా దగ్గర సావిత్రిబాయి పూలే 194వ జయంతిని కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా కోశాధికారి గోకమల్ల చైతన్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు సిహెచ్ వెంకన్న, సీఐటీయూ సరూర్నగర్ సర్కిల్ కార్యదర్శి ఎం వీరయ్య లతీఫ్, కే చంద్రయ్య, ఏ శ్రీను, జే రామస్వామి, జె వెంకటేష్, ఎండి రహీం, బాలా గౌడ్, పరుశరాములు, బాలు నాయక్, ఎస్ వెంకటయ్య, మాధవ్, రాములు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

### అణగారిన మహిళలకు అక్షర జ్ఞానం అందించిన సావిత్రిబాయి పూలే



అణగారిన మహిళలకు అక్షర జ్ఞానం అందించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్ అన్నారు. తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలను భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ సరూర్నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహా ఆధ్వర్యంలో డాక్టర్స్ కాలనీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడీ శేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ బి ఓ సి రాష్ట్ర కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్‌లు ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సరూర్నగర్ మండల సహాయ కార్యదర్శి కందుల సుధాకర్, ఏఐఎస్ఎఫ్ తెలంగాణ ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి కుమార్ ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శివ నాయక్, ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సక్రు నాయక్, సీపీఐ హయత్ నగర్ మండల కార్యదర్శి శ్రీదేవి, సీపీఐ నాయకులు ఆర్ కరుణాచారి, బోయపల్లి లింగయ్య, దొంతగోని దశరథ, శోభన్, అరుణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నాగోల్



సావిత్రిబాయి పూలే ఆణిముత్యం అని, ఆమె కరుడుగట్టిన బ్రాహ్మణిజం కబంధ హస్తాల నుంచి స్త్రీ జాతికి విముక్తి కల్పించిన మహా సంకల్పియని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం బీసీ హక్కుల సాధన సమితి ఉడుతల మల్లేష్ గౌడ్ అధ్యక్షతన న్యూ నాగోలులోని ఎస్ ఏ డాంగే భవన్లో సావిత్రిబాయి పూలే 194వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తర్వాత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు భాతరాజు నరసింహ, స్థానిక నాయకులు ఎర్రోళ్ల ఉషశ్రీ, చెట్ల వెంకటయ్య, ఎండి హమీద్ భాయ్, రవి కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళా విద్యకు సావిత్రిబాయి పూలే ఆద్యురాలు.

మహిళా విద్యకు ఆద్యురాలిగా నిలిచి, సమానత్వానికై పోరాడిన భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి సావిత్రిబాయి పూలే అని కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నాగోలు డివిజన్ పరిధిలోని సాయి నగర్ కాలనీలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పెద్దవూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్





చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని తెలంగాణ యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. అలకాపురి చౌరస్తా వద్ద డిబిఆర్ యువసేన అధ్యక్షులు శేఖర్ ముదిరాజ్ అధ్వర్యంలో శుక్రవారం సావిత్రి భాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపేందర్ రెడ్డి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ, శ్రీ ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్ ఎ. శ్రీశైలం, సందీప్, పగడాల శ్రీశైలం కాంగ్రెస్ పార్టీ నేతలు పగడాల ఎల్లన్న, రమేష్ నేత, అల్లేటి కిరణ్ కుమార్, శ్రీనివాస్ గుప్త, సూరి, రఘు, హరిబాబు, కమల్ రెడ్డి, అంజన్ రావు, శ్రవణ్, పగిళ్ల భూపాల్ రెడ్డి, శ్రీధర్, సంతోష్, శివ, అశోక్, శ్వేత, సంతోష , డాలీ, శ్రీనాథ్, మమత, సాయి, కిట్టు, జహంగీర్, రాజు, వినయ్, నగేష్, విప్లవ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - హస్తినాపురం



చదువుల తల్లి మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేపట్టడం శుభపరిణామమని హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దెంది శశిధర్ రెడ్డి అన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో గొప్ప మార్పు కు సావిత్రి బాయి పునాది వేశారని.. మహిళా విద్య కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సాంఘిక సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం హర్షణీయమని అన్నారు.

నవతెలంగాణ - చంపాపేట్

నాటి మనువాద సంప్రదాయాలలో భాగమైన కుల వివక్ష వంటి సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేసిన ప్రగతిశీల సామాజిక సంస్కరణల విప్లవకారిణి సావిత్రీబాయి పూలే అని భారత జాతీయ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు పి. ప్రేమ్ పావని కొనియాడారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద శుక్రవారం భారత జాతీయ మహిళా సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే 194వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తర్వాత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్. ఛాయాదేవి, అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసఫ్, ఏఐటీయూసీ సీనియర్ నాయకులూ యు. రత్నాకర్ రావు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ముదుపు నళిని రెడ్డి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు పడాపూలేళిని తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-హయత్ నగర్

నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకొని యావత్ భారత సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సావిత్రిబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగాపూలే యువజన సంఘం అధ్యక్షులు మేడిగ శ్రీధర్ కార్యదర్శి కుమ్మరి స్వామి ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీఎన్‌రెడ్డి మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న గౌడ్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విట్టల్ రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డా సత్యనారాయణ, సీపీఐ నాయకులు రవీంద్ర చారి, శేఖర్ రెడ్డి, బీసీ డాక్టర్స్ ఫోరం కన్వీనర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు, స్పోక్స్ పర్సన్ కొండల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## 'నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేస్తున్న 'నవతెలంగాణ''



నవతెలంగాణ -దిల్‌సుఖ్‌నగర్

నమ్మిన సిద్ధాంతం కోసం నవతెలంగాణ దినపత్రిక నిరంతరం కృషి చేస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నవతెలంగాణ నూతన క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల సమస్యలపై నిత్యం స్పందించే నవతెలంగాణ.. ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు వారధిగా పని చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం రాజకీయాలకు అతీతంగా నవతెలంగాణ దినపత్రికను పాఠకులు ఆదరిస్తున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర చాలా కీలకం, పత్రికల్లో వచ్చే వార్తలను పాఠకులు అధికశాతం నిజమని నమ్ముతారని, వారిని వమ్ము చేయకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా ఎంత వేగంతో ముందుకు వచ్చినప్పటికీ పాఠకులు పత్రికల్లో వచ్చిన వాస్తవాలను నమ్ముతున్నారని పేర్కొన్నారు. ఆన్ లైన్ డిజిటల్ యుగంగా మారుతున్న నేటి కాలంలో కూడా ప్రింట్ మీడియాకు తిరుగులేదని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా మహేశ్వరం నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల విషయంలో నవతెలంగాణ దినపత్రిక పూర్తి స్థాయిలో సానుకూలంగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ నేతలు పెంబర్తి శ్రీనివాస్, నయిమ్, ఇస్మాయిల్, రమేష్ కుర్మా తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు ప్రభుత్వానికి వారధి...చెకోలేకర్ శ్రీనివాస్



నవతెలంగాణ దినపత్రిక ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ అన్నారు. నవతెలంగాణ దినపత్రిక నూతన క్యాలెండర్‌ను ఆయన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవతెలంగాణ దినపత్రిక రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజల మనోభావాలను ప్రతిబింబించే విధంగా వార్తలు ఇస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్ర స్థాయిలో ఉండే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చి వాటి పరిష్కారానికి కృషి చేస్తుందని వివరించారు. ప్రజా ఉద్యమాలలో భాగస్వాములుగా ఉన్న వారే నవతెలంగాణ దినపత్రిక యజమానులు శ్రీనివాస్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు పాశం అశోక్ గౌడ్, పన్నాల రాజేందర్ రెడ్డి, మహ్మద్ షకీల్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

### ఆశయాల కోసం 'నవతెలంగాణ'...చిలుక ఉపేందర్ రెడ్డి



ప్రజల ఆశలు, ఆకాంక్షలు లక్ష్యంగా.. నమ్మిన సిద్ధాంతం కోసం నవతెలంగాణ దినపత్రిక పాటు పడుతుందని తెలంగాణ యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. నవతెలంగాణ నూతన క్యాలెండర్‌ను శుక్రవారం శ్రీ ఖిల్లా మైసమ్మ అమ్మవారి దేవాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వస్తున్న నవ తెలంగాణ దినపత్రికకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఖిల్లా మైసమ్మ అమ్మవారి ఆలయం చైర్మెన్ కుంచారపు సురేంద్ర కుమార్, ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి. మధుసూదన్ రావు, ఆలయ కమిటీ డైరెక్టర్ లు తిరుమల వెంకటచారి, ఎ. శ్రీశైలం, కేతావత్ రాజు నాయక్, బడుగుల సందీప్, ఎ. శ్రీశైలం, అమృతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్

ప్రజల పక్షాన ఉద్యమ స్ఫూర్తిగా పని చేస్తున్న నవ తెలంగాణ దినపత్రికకు బీఆర్ఎస్ యువనేత పి. కార్తీక్ రెడ్డి అభినందనలు తెలిపారు. నవ తెలంగాణ దినపత్రిక నూతన క్యాలెండర్‌ను శుక్రవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు వేదికగా పని చేస్తున్న నవ తెలంగాణ క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు పోతుందని ఆయన వివరించారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజల సమస్యలు, హక్కుల కోసం నవతెలంగాణ రాజీలేని మార్గంలో పయనిస్తుందని కొనియాడారు. సుదీర్ఘ కాలంగా ప్రజా పోరాటాలే వేదికగా నమ్మిన సిద్ధాంతం కోసం నవతెలంగాణ ముందుకు సాగుతోందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ నేతలు పెంబర్తి శ్రీనివాస్, నయిమ్, ఇస్మాయిల్, రమేష్ కుర్మా తదితరులు పాల్గొన్నారు.



## నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

**ఆర్చిడ్ స్కూల్ కరెస్పాండెంట్ మధు**



**నవతెలంగాణ - జవహర్ నగర్**

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్న నవ తెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆర్చిడ్ స్కూల్ కరెస్పాండెంట్ మధు బాలాజీనగర్‌లో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా రాయడంలో నవ తెలంగాణ దినపత్రిక కు సాటిలేదని, మిగతా పత్రికలకు దీటుగా వార్తల సేకరణ, ప్రజలు, కార్మికుల కు అండగా ఉంటూ రాజీ పడకుండా అద్భుతమైన కథనాలతో ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. నవ తెలంగాణ యాజమాన్యానికి, సిబ్బందికి, రిపోర్టర్లకు, అధికారులకు, ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి అడ్వర్టైజ్మెంట్ ఇంచార్జ్ జహంగీర్, జవహర్ నగర్ రిపోర్టర్ నరేందర్, పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్ సుభాష్ నాయక్



**నవతెలంగాణ-బోడుప్పల్**

పీర్జాదిగూడ కార్పొరేషన్ 3వ డివిజన్ కార్పొరేటర్ కె.సుభాష్ నాయక్ శుక్రవారం నాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సుభాష్ నాయక్ మాట్లాడుతూ పీర్జాదిగూడ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసేందుకు స్థానిక మేయర్, నియోజకవర్గ ఇన్‌చార్జి తమ వంతుగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు.

# వెట్టిచాకిరి నిర్మూలన సమాజ బాధ్యత

- పిల్లల బాల్యాన్ని చిదిమేసే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు
- రాచకొండ సీపీ సుధీర్ బాబు




**నవతెలంగాణ-సిటీబ్యూరో**

సంతోషంగా చదువుకుంటూ ఆటపాటలతో సాగాల్సిన పిల్లల బాల్యాన్ని చిదిమేస్తున్న బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో ఆపరేషన్ స్మైల్ పదకొండవ సమన్వయ సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ గారు మాట్లాడుతూ.. సమాజంలో బాలకార్మిక వ్యవస్థ ఒక వ్యాధిలాగా మారిందని, అది ఎంతోమంది అమాయక పిల్లల బాల్యాన్ని నాశనం చేస్తోందన్నారు. ప్రధానంగా తల్లిదండ్రుల పేదరికం వల్ల పిల్లలు వెట్టిచాకిరి కోరల్లో చిక్కుకుని తమ బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదరికం మూలంగా వెట్టిచాకిరి కోరల్లో చిక్కుకునే పిల్లలు కొన్నిసార్లు బాల నేరస్తులుగా మారే ప్రమాదం ఉందని, సంఘ విద్రోహక శక్తులు చిన్న పిల్లలను నేరాలకు ఉపయోగించుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా, తమ పిల్లలను మాత్రం వెట్టి చాకిరి కూపంలోకి నెట్టకూడదని, పిల్లల చదువు కోసం ప్రభుత్వం ఉచితంగా ఎన్నో కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వెట్టి చాకిరి నిర్మూలనలో ప్రజా భాగస్వామ్యం ఉండాలని, ప్రజలు కూడా దాన్ని తమ నైతిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. రాచకొండ పరిధిలో మానవ అక్రమ రవాణా మరియు బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని సీపీ చెప్పారు. మానవ అక్రమ రవాణా మీద ఉక్కు పాదం మోపుతున్నామని, ప్రత్యేక బృందాల ద్వారా ఎంతో మందిని రక్షించామని, కేసులు నమోదు చేశామని తెలిపారు. ఒడిషా, బీహార్ వంటి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఇటుక బట్టీ కార్మికుల పిల్లలు విద్యకు దూరం కాకూడదు అని వారి నివాస ప్రాంతం లోనే వర్క్ సైట్ పాఠశాలలను నడుపుతున్న విషయం గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో డీసీపీ క్రైమ్ అరవింద్ బాబు, డీసీపీ అడ్మిన్ ఇందిర, డీసీపీ ఉమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, యాదాద్రి సిడబ్ల్యుసి చైర్ పర్సన్ జయశ్రీ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రసాద్, బచ్ పన్ బచావో ఆందోళన్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, ఇతర రాచకొండ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డుపై నియమ నిబంధనలు పాటించాలి



- మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ రెడ్డి, ఉమా

**నవతెలంగాణ-ఉప్పల్**

వాహనదారులు రోడ్డుపై నియమ నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికట్టాలని ఉప్పల్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ రెడ్డి, ఉమాలు అన్నారు. శుక్రవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రత మాసోత్సవాలను ఉప్పల్ ఆర్టీవో కార్యాలయంలో ప్రారంభించారు. ఈ నెల 31 వరకు రహదారి భద్రత మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పత్రికలు సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి



- మేయర్ శాంతి కోటేష్ గౌడ్

**నవతెలంగాణ - జవహర్ నగర్**

పత్రికలు ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు పని చేయాలని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నవతెలంగాణ 2025 క్యాలెండర్‌ను బాలాజీ నగర్‌లోని మేయర్ నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడంలో నవతెలంగాణ పాత్ర ప్రత్యేకమైనదన్నారు. ఏ పార్టీకీ కొమ్ము కాయకుండా, ప్రజల కష్టాలను, కార్మికుల సమస్యలను తెలుసుకుంటూ అధికారులకు, పాలకులకు వారధిగా పని చేసి ప్రజా సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తున్న నవతెలంగాణ పత్రికకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో మిగతా పత్రికల కంటే దీటుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎలాంటి అవరోధాలు , ఇబ్బందులు రాకుండా ప్రజలందరూ నూతన సంవత్సరంలో సుఖసంతోషాలతో ఉండాలని అలాగే నాయకులకు, అధికారులకు, ప్రజలకు, పత్రిక యజమాన్యానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ అడ్వటైజ్మెంట్ మల్కాజ్గిరి ఇన్‌చార్జి జహంగీర్, జవహర్ నగర్ రిపోర్టర్ నరేందర్, నాయకులు శ్రీనాథ్, కొమురయ్య, స్వామి, పాల్గొన్నారు.

## నూతన కమిషనర్‌కు శుభాకాంక్షల వెల్లువ



- మాజీ మేయర్ కావ్య, బీఆర్ఎస్ అధ్యక్షులు భాస్కర్

**నవతెలంగాణ - జవహర్ నగర్**

జవహర్ నగర్ నూతన మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన డాకు నాయక్‌ను జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య, బీఆర్ఎస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షులు జక్కుల భాస్కర్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆలూరి సంగీత రాజశేఖర్, జిట్టా శ్రీవాణి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఆనంద్ దాస్ ప్రకాష్, వెంకట నర్సయ్య పొలాస సాయి కుమార్, బూరుగు కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ డిక్లరేషన్ సభకు తరలిన జాగృతి నాయకులు



**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కామారెడ్డి డిక్లరేషన్ అమలు, స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ సాధనకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సమక్షంలో ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన బీసీ మహాసభకు మద్దతుగా మల్కాజిగిరి నియోజకవర్గం జాగృతి కన్వీనర్ కనగంటి నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో జాగృతి నాయకులు తరలివెళ్లారు. అనంతరం సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు ఈగ సంతోష్, శ్రీధర్, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## మైనంపల్లికి శుభాకాంక్షల వెల్లువ..



**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

నూతన సంవత్సరం సందర్భంగా నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని వాయుపురి కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు టీజే రెడ్డి, శ్రీనివాస్‌లు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేరేడ్‌మెట్ డివిజన్ నాయకులు చెన్నారెడ్డి, యాది, మధు, కృష్ణ, రఘువన్, పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టొద్దు

- కాప్రా తహసీల్దార్ సుచరిత



**నవతెలంగాణ - జవహర్ నగర్**

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదని కాప్రా తహసీల్దార్ సుచరిత అన్నారు. జవహర్ నగర్‌లో భూ కబ్జాదారుల ఆగడాలు రోజు రోజుకూ మితిమీరి పోతున్నాయని, అధికారులపై దాడికి పాల్పడుతున్నారని అలాంటి వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. దళారుల మాయలో పడి పేద ప్రజలు మోసపోవద్దని సూచించారు. శుక్రవారం తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విజయేంద్ర సాయి స్థానిక పోలీసుల సహకారంతో సర్వే నెంబర్ 645, 655 సంతోష్ నగర్, దేవేందర్ నగర్‌లలో నిర్మించిన అక్రమ కట్టడాలను జేసీబీతో కూల్చి వేశారు. అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలుంటాయని నిర్మాణదారులను హెచ్చరించారు.

# ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి
- నాగారంలో రూ.1కోటి56 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**నవతెలంగాణ-కీసర**

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీలోని 5,6 ,7 వ వార్డుల్లో రూ.1 కోటి 56 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో కాలనీల పరంగా ఉన్న ఇండ్ల నిర్మాణాలు పెరుగుతుండటంతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. నాగారం మున్సిపాలిటీలో ఐదేండ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. మెట్రో రైల్వేను షామీర్‌పేట్ వరకు పొడిగించడం సంతోషం అన్నారు. మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ.. గత ఐదేండ్లలో రూ. 120కోట్లతో వివిధ కాలనీలలో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు అన్నం రాజు లావణ్య శ్రీనివాస్, కౌకుట్ల అనంతరెడ్డి, గూడూరు సబితా ఆంజనేయులు గౌడ్, బిజ్జ శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

నవతెలంగాణ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ బాబు తన నివాసంలో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోహిత్ బాబు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలికి తీయడంలో ముందుంటూ, ఎప్పటికప్పుడు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా వార్తలు, కథనాలు రాయడం నవతెలంగాణ ప్రత్యేకత కలిగి ఉందన్నారు. పత్రికలు అధికారులు, పాలకులకు వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ గౌతమ్ నగర్ డివిజన్ అధ్యక్షులు వైనాల ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు సిరిగిరి రాజు, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

- కార్పొరేటర్ బన్నాల గీత




**నవతెలంగాణ-ఉప్పల్**

చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం నిధులు కేటాయించాలని కోరుతూ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. డివిజన్‌లోని పలు సీసీరోడ్లకు, బీరప్ప గడ్డ ప్రాంతంలో పలు స్ట్రాం వాటర్ డ్రైన్‌లకు, అజ్మత్ నగర్ కమ్యూనిటీ హాల్ కొరకు ఇందిరానగర్ నూతన బోర్ కోసం వెంటనే నిధులు కేటాయించాలని కోరారు. జీహెచ్ఎంసీ మున్సిపల్ మైదానాలలో ఎటువంటి ప్రయివేట్ ఈవెంట్ కార్యక్రమాలకు మున్సిపల్ గ్రౌండ్స్‌లో పర్మిషన్ ఇవ్వకుండా చూడాలని కోరారు. మున్సిపల్ మైదానాలలో కేవలం స్పోర్ట్స్ కార్యక్రమాలకు తప్పా.. వేరే కార్యక్రమాలకి పర్మిషన్ ఇవ్వకుండా చూడాలని కోరారు.

# వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి : కౌన్సిలర్ కౌడే మహేష్



**నవతెలంగాణ - మేడ్చల్**

మున్సిపల్ పరిధిలోని 23వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లుగా కౌన్సిలర్ కౌడే మహేష్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 17,23 వార్డులలో రూ.10లక్షల నిధుల వ్యయంతో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు స్థానిక కౌన్సిలర్ అర్చన సందీప్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ రెడ్డితో కలసి శంకుస్థాపన చేశారు.కౌన్సిలర్ కౌడే మహేష్ మాట్లాడుతూ 23వ వార్డులోని ప్రతి బస్తీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.వార్డులో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో కమీషనర్ బట్టు నాగిరెడ్డి, యువ నాయకులు అత్వెల్లి సందీప్ గౌడ్,మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వినయ్, మాజీ సర్పంచ్ చీదు దేవేందర్ రెడ్డి,మేడ్చల్ సొసైటీ మాజీ డైరెక్టర్ గౌర్ల ఎర్ర బీరప్ప, మద్ది నాగేష్ యాదవ్, గౌర్ల రాజు కురుమ,షేక్ ఇబ్రహీం, మహమ్మద్ షాకీర్, నాచారం మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు అందేలా చూడాలి: కార్పొరేటర్ రజిత



**నవతెలంగాణ-ఉప్పల్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేసేందుకు అందరూ కృషి చేయాలని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అర్హులకు మాత్రమే ఇచ్చే విధంగా చూసుకోవాలని సూచించారు. ఉప్పల్ వార్డ్ ఆఫీస్ లోమున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. పథకానికి సంబంధించి అర్హులు ఎంపిక విషయంలో అధికారులకు తోడుగా కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఉండాలని కార్పొరేటర్ సూచించారు.రాజకీయాలకు అతీతంగా, అర్హతలే ప్రామాణికంగా లబ్దిదారుల ఎంపిక జరగాలని ఆదేశించారు. లబ్దిదారులు ఎంపికకు సంబంధించిన సర్వేను సైతం వేగవంతంగా చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు.

## రేవంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు..



**నవ తెలంగాణ -శామీర్ పేట**

నూతన సంవత్సరం సందర్భంగా శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరశుభాకాంక్షలు తెలిపారు. మెట్రో రైలు జేబీఎస్ నుండి శామీర్ పేట్ వరకు పొడిగించినందుకు ఈ సందర్భంగా పార్టీ నేతలతో కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ , ఘనపురం మాజీ సర్పంచ్ బద్దం గోపాల్ రెడ్డి ,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు నానావత్ సురేష్ నాయక్ పాల్గొన్నారు.

## టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ - శామీర్‌పేట**

శామీర్‌పేట మండల విద్యావనరుల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్ శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల మండల విద్యాధికారులు వసంతకుమారి భాగ్యమణిలు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీదేవిజా నాయక్ , శామీర్‌పేట మండల అధ్యక్షులు పి. తిరుమలేష్, మండల ప్రధాన కార్యదర్శి కుమార్ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు



## యువత వ్యాపారంలో రాణించాలి : వజ్రేష్ యాదవ్



**నవతెలంగాణ-ఘట్కేసర్**

వ్యాపార రంగంలో యువత ముందుండి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ వినియోగదారులకు మంచి ఆహారాన్ని అందించాలని టీ పీసీసీఉపాధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్ రోడ్డులో నూతన సురపానం టీ హెూటల్‌ను మున్సిపాలిటీ చైర్మెన్ ముల్లి పావని జంగయ్య యాదవ్‌తో కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన సూరపానం టీ, హెూటల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలు యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క సంజీవ రెడ్డి, మైనార్టీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ అష్రఫ్ అలీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## నాగారం మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ నాయకుల సన్మానం



**నవతెలంగాణ-కీసర**

నూతన సంవత్సరం సందర్భంగా నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డిని మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గండి అంజయ్య గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు వరకల పెంటయ్య గౌడ్‌లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరారు.

## సీసీ రోడ్డు పనులు పరిశీలన



**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని భ్రమరాంబికా నగర్ లో వేసిన సీసీ రోడ్డును శుక్రవారం మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులలో నాణ్యతను పాటించాలని, అధికారులకు సూచించారు. ఆయన వెంట శ్రీకాంత్, రమేష్, ఉన్నారు.

## నిజాలను నిర్భయంగా రాసే పత్రిక నవతెలంగాణ



- బండి నర్సింహా రెడ్డి

**నవతెలంగాణ-ఉప్పల్**

రాజకీయలకు తావులేకుండా, నిజాలను నిర్భయంగా రాసే దినపత్రిక నవ తెలంగాణ అని పుర ప్రముఖులు, సమాజ సేవకుడు, బండి నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆయన ఉప్పల్ రిపోర్టర్ గుత్తి శేఖర్, సర్క్యులేషన్ ఇన్‌చార్జి భూపాల్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నవతెలంగాణ దినపత్రిక ముందంజలో ఉందని అన్నారు.

## సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన బాషిపాక



నవతెలంగాణ-కూకట్‌పల్లి
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, వివేకానంద నగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ భాషిపాక నాగమణి యాదగిరి, వివేకానంద నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాషిపాక యాదగిరి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకి, అలాగే నియోజకవర్గ కో ఆర్డినేటర్ సతీష్ అరోరా కి, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ కేపీహెచ్‌బీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
నవతెలంగాణ-కూకట్‌పల్లి

# దరువు అంజన్నకు నంది అవార్డు

- ఘనంగా సత్కరించిన మోక్షిత సేవా సమితి
- కళా రంగానికి ఎనలేని సేవలు అందించిన అంజన్న : ఎమ్మెల్యే పాల్వాయి హరీష్
- తెలంగాణ ఉద్యమంలో ఎనలేని కృషిచేసిన అంజన్న: అంతడుపుల నాగరాజు
- నిరుద్యోగ కళాకారులకు వెన్నుదన్నుగా నిలిచిన అంజన్న : అనుమోజు వెంకటేష్,కిరణ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం ప్రాంతానికి చెందిన దరువు అంజన్న తెలంగాణ ఉద్యమంలో ప్రతి పల్లె పల్లె తిరిగి ఉద్యమానికి ఊతమిచ్చారని,1994 లో మొదలైన అంజన్న ఉద్యమ ప్రస్థానం నేటికీ పీడిత,తాడిత హక్కులకై కొనసాగుతూనే ఉందని,తెలంగాణ ఉద్యమంలో ఆడిపాడి తెలంగాణను తీసుకు రావడంలో కీలక భూమిక పోషించిన అంజన్న విశిష్ట సేవలందించారని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ అన్నారు. నిరుద్యోగ కళాకారులకు న్యాయం జరగాలని,వారికి ఉద్యోగాలు రావాలని వెన్నుదన్నుగా నిలుస్తున్న అంజన్నను నంది అవార్డు ఇచ్చి సత్కరించుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నామని మోక్షిత సేవా సమితి ఫౌండర్ సంతోష్ తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లో జరిగిన నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని నేషనల్ నంది అవార్డు పురస్కారాలలో భాగంగా దరువు అంజన్నకు నంది అవార్డు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ మాట్లాడుతూ దరువు అంజన్న పటిమను తెలంగాణ ఉద్యమంలో చూస్తూనే ఉన్నానని తెలంగాణ రాష్ట్ర సాధనలో అంజన్న పాత్ర గణనీయమైనదని అన్నారు. సిద్దిపేట జిల్లా మారుమూల ప్రాంతం రాయపోల్ గ్రామంలో జన్మించిన అంజన్న ఉద్యమంలో అంచలంచలుగా ఎదిగి ఉస్మానియా యూనివర్సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మెన్‌గా బాధ్యతలు సంపూర్ణంగా విజయవంతం చేశారన్నారు. నిస్వార్థపరుడైన ఇంత గొప్ప ఉద్యమ నాయకుడిని సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.

అంతకుముందు తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర నాయకులు ప్రస్తావించిన విషయాలపై స్పందిస్తూ తప్పనిసరిగా నేను శాసనసభలో నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే విధంగా మాట్లాడతానని ప్రభుత్వం పై వత్తిడి తెస్తానని తెలిపారు.ప్రభుత్వం దగ్గర ఉన్న 720 మంది లిస్టులో అందరికీ ఉద్యోగాలు వచ్చే విధంగా నేను ప్రతిపక్షంగా కోరుతానని వ్యాఖ్యానించారు.

### తెలంగాణ ఉద్యమంలో దరువు అంజన్న త్యాగం గొప్పది : అంతడుపుల నాగరాజు..

తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకులు అంతడుపుల నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో దరువు అంజన్న నిస్వార్థంగా ముందుండి ఉద్యమాన్ని నడిపించారని ఉస్మానియా ఉద్యమంలో ఎనలేని కృషి చేశారని తెలంగాణ రావడంలో కీలక భూమిక వహించారని అన్నారు.దరువు అంజన్న తో కలిసి నేను కొన్ని వందల ధూమ్ ధామ్ లో పాలుపంచుకున్నానని అంజన్న గానం చేసిన "వీరులారా వందనం విద్యార్థి అమరులారా వందనం పాదాలకు" అనే పాట కండంతరాలు దాటిందని చెప్పారు.మా ఉమ్మడి అదిలాబాదు జిల్లా నుంచి అవార్డు పొందడం గర్వంగా ఉందని అన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు రావడం ఖాయం: అనుమోజు వెంకటేష్..

గత పది సంవత్సరాలుగా నిరుద్యోగులుగా మేము చేస్తున్న టువంటి ఉద్యమం ఫలించే రోజులు దగ్గర పడ్డాయని, దానికి తార్కాణమే ప్రస్తుత సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శాసనసభలో ఉద్యోగాల గురించి ప్రస్తావించడం.. అదేవిధంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ శాసనమండలిలో అర్హులైన వారికి ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చారని.. వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర నేత అనుమోజ్ వెంకటేశ్ అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర నేత నగరికంటి కిరణ్ మాట్లాడుతూ అనుమోజు వెంకటేష్ సారథ్యంలో.. గత పది సంవత్సరాలుగా ఎండకు ఎండి వానకు తడిసి ఎన్నో ఉద్యమాలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు పెట్టినా వాటిని లెక్కచేయకుండా ఉద్యమాలు నడిపామన్నారు. మా ఉద్యమాన్ని గుర్తించి.. కాంగ్రెస్ ప్రభుత్వం మాకు ఉద్యోగాలు ఇస్తానని పేర్కొనడం ఆనందదాయకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సుందిళ్ల రాజన్న, మందమర్రి నరేష్, శశికుమార్ రెడ్డి, సత్యం రెడ్డి, తదితరులున్నారు.

# సావిత్రి పూలే సేవలు మరువలేనివి



- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
స్త్రీలకు విద్య వద్దన్న బ్రాహ్మణులకు కూడా విద్యను నేర్పిన గొప్ప మానవతా మూర్తి సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఈ.ఉమా మహేష్ అన్నారు. దేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త సావిత్రిబాయ్ పూలే జయంతి సందర్భంగా శుక్రవారం సీపీఐ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో.. అంజయ్య నగర్, మగ్దూంనగర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఐ శాఖ కార్యదర్శి వెంకటేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు హైమవతిల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనుధర్మ శాస్త్రం ప్రకారం స్త్రీలు కూ డా శూద్రులేనని.. శూద్రులకు విద్య నిషేధమని అందుకే ఆనాటి సమాజంలో స్త్రీలకు విద్య అందలేదని, సావిత్రి బాయ్ పూలెకు మహాత్మా జ్యోతిభా పూలే విద్యను నేర్పిం చడం వల్ల ఆమె విద్యను అభ్యసించిందన్నారు.

విద్య ద్వారా చైతన్యం, జ్ఞానం కలిగి సమానత్వం పొందుతారని,సమాజం అభివృద్ధి చెందుతుందని అందుకు స్త్రీలకు విద్యను నేర్పించాలని కంకణం కట్టుకొని సొంత అత్తమామలు గృహ, గ్రామ బహిష్కరణ చేసినప్పటికీ వెనుకడుగు వెయ్యకుండా జనవరి 1న 18 సంవత్సరాల వయస్సులో మొట్టమొదటి పాఠశాలను స్థాపించారు. విద్యను అందిస్తుంటే తట్టుకోలేని బ్రాహ్మణులు సావిత్రి బాయ్ పూలే మీద పేడ నీళ్ల చల్లడం, రాళ్లతో కొట్టడం లాంటివి చేశారన్నారు. అయినప్పటికీ భయపడకుండా చదువును చెప్పడం వల్ల అనతికాలంలోనే మద్దతు రావడం వల్ల తన జీవిత కాలంలో మొత్తం 32 పాఠశాలలను స్థాపించిందని అన్నారు. బ్రాహ్మణ అబ్బాయి ఎశ్వంతను దత్తత తీసుకొని తన పోరాటం కొనసాగించిదని తెలిపారు. చదువు కోసమే కాకుండా అంటరానితనానికి వ్యతి రేకంగా, అనాధల కోసం, ప్లెగు వ్యాధి నిర్మూలన కోసం పనిచేస్తూ చివరికి ఆ ప్లెగు వ్యాధితో మరణించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నేడు మహిళా ఉపాధ్యాయురాలు దినోత్సవాన్ని జరపడం శుభాపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్, ప్రజా నాట్యమండలి అధ్యక్షులు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రాములు, మహిళా సమాఖ్య నాయకులు అనిత, భాగ్యమ్మ, మహేశ్వరి, చంద్రకల, నిర్మల పాల్గొన్నారు.

# కేటీఆర్‌కు శుభాకాంక్షలు వెల్లువ





బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావును వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మాజీ కార్పొరేటర్ రంగా రావు కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల శాసన సభ్యులు కేటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో ఎర్రబెల్లి సతీష్ రావు కలిశారు. అనంతరం పుష్ప గుచ్చం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



### ఎమ్మెల్యే కృష్ణారావుకు శుభాకాంక్షలు

నూతన సంవత్సరం సందర్భంగా.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును, ఎర్రబెల్లి సతీష్ రావు కలిశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టీటీడీ క్యాలెండర్ అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# నేర పరిశోధనలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి..



- అధికారులకు సూచించిన సీపీ సుధీర్ బాబు

నవతెలంగాణ-సిటీబ్యూరో
నూతన సంవత్సరంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల శాతం తగ్గించాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలలో భాగంగా శుక్రవారం కమిషనర్ రాచకొండ పరిధిలోని డీసీపీలు, ఏడీసీపీలతోపాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేర పరిశోధనలో ఉపయోగిస్తున్న టెక్నాలజీ, క్షేత్రస్థాయి సిబ్బందికి విధి నిర్వహణ మరింత సులభతరం అయ్యేందుకు అమలు చేస్తున్న వాటిపై కమిషనర్ చర్చించారు. రాచకొండ పరిధిలోని అన్ని విభాగాల పోలీసు సిబ్బంది నేర విచారణలో నూతన సాంకేతిక వినియోగం పట్ల అవగాహన పెంచుకోవాలని, అందుకోసం ఐటీ సెల్ వారి సహాయాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అరవింద్ బాబు, ఇందిర, ఏసీపీలు రమేష్, నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాలు నిర్భయంగా రాయడంలో నవతెలంగాణకు సాటిలేదు



- ఎంపీ ఈటల రాజేందర్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
పత్రిక ప్రపంచంలో నిజాలు నిర్భయంగా వ్రాయడంలో నవతెలంగాణ దినపత్రికకు సాటిలేదని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. శుక్రవారం ఆయన నివాస కార్యాలయంలో గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరితో కలిసి నవతెలంగాణ దినపత్రిక నూతన సంవత్సరం (2025 క్యాలెండర్)ను ఎంపీ ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మిగతా పత్రికలకు దీటుగా వార్త సేకరణలో నవతెలంగాణ శైలి వర్ణించలేనిది అభినందించారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వారదులుగా ఉంటూ ప్రజా సమస్యలు తీర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్న నవతెలంగాణ దినపత్రికను కొనియాడారు. 2025 నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ప్రజల, కార్మికుల, పక్షపాతిగా ఉంటూ వార్త ప్రచురించడంలో ఎక్కడ రాజీ పడకుండా అద్భుతమైన వార్త కథనాలతో ప్రజల మన్ననలు పొందుతున్న నవతెలంగాణ దినపత్రిక యాజమాన్యానికి, పాత్రికేయులకు, సిబ్బందికి పేరుపేరునా ఎంపీ ఈటల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, ఓబీసీ మోర్చా కార్యదర్శి లకోజి మురళీకృష్ణ, కిసాన్ మోర్చా నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె.శేఖర్ యాదవ్, సీనియర్ రిపోర్టర్ సరస్వతి నరేందర్ రాజు,నార్త్ - వెస్ట్ మేనేజర్ జే. ఉపేందర్, మేడ్చల్ రిపోర్టర్ పరమేశ్వర్ పాల్గొన్నారు.


# సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో సమానత్వ సాధన కోసం పోరాటాలు

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్



నవతెలంగాణ-దుండిగల్
భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో వివక్ష లేని సమాజం కోసం పోరాడదామని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. శుక్రవారం సావిత్రి బాయి పూలే 194వ జయంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ... సావిత్రిబాయి పూలే 1831లో మహారాష్ట్రలోని సతరా జిల్లాలోని నయాగ్రామ్ అనే గ్రామంలో సావిత్రిబాయి పూలే జన్మించారని అన్నారు. చిన్న వయసులోనే బాలిక విద్య ప్రాముఖ్యతను గ్రహించి 1852లోనే మహిళా మండలిని స్థాపించి.. బాలికలకు ఉచిత విద్యను అందించారన్నారు. అడుగడుగునా వివక్ష అణచివేత సనాతవాదుల దాడులను ఎదుర్కొని 1873లో సత్యశోధక్ సమాజాన్ని స్థాపించి వితంతువులకు పునర్వివాహాన్ని జరిపి, ఆనాడే సమ సమాజానికి పునాదులు వేసిందని అన్నారు. ఉత్తర భారత దేశంలో కలరా ప్లేగు వ్యాధిలు విజృంభించినపుడు ప్రజలకు సేవలు చేశారని అన్నారు. బాలికలు వితంతువుల అభివృద్ధి కోసం నిరంతరం పోరాటం చేశారని అందుకోసం నాటి సనాతన సాంప్రదాయ వాదులను ఎదిరించి ధైర్యంగా నిలబడ్డారని కొనియాడారు. తన భర్త మహాత్మ జ్యోతిబాపూలే మరణించినప్పటికీ ఆయన అడుగుజాడల్లో నడుస్తూ.. బాలికలు మహిళలు అనాధల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని అన్నారు. సావిత్రి బాయి స్ఫూర్తితో బాలిక విద్య కోసం పోరాటాలు చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను అంగడి సరుకుగా మార్చాయని అట్టడుగు ప్రజలందరికీ విద్య అందే వరకు పోరాడాలని కొనసాగిస్తామన్నారు. ఆధునిక కాలంలో కూడా లింగ వివక్ష ఇంకా కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ఈ వివక్షకు వ్యతిరేకంగా సామాజిక పోరాటాల ద్వారా వివక్ష లేని సమాజం కోసం పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు భగత్, ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, శ్రీకాంత్, కర్ణాకర్, శ్రీనివాస్, భూపతి, వెంకటేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్‌లో మోసపోయిన వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయొచ్చు..






నవతెలంగాణ-కూకట్‌పల్లి
లక్ష యాభై వేల వరకు సైబర్ క్రైమ్‌లో మోసపోయిన వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చు అని కూకట్‌పల్లి సీఐ ముత్తు తెలిపారు. సీపీ సైబరాబాద్, డీసీపీ బాలానగర్ వారి ఆదేశాల మేరకు.. రూపాయలు ఒక లక్ష యాభై వేల రూపాయల వరకు మోసపోయిన బాధితులు.. తమ తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందని ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. కమిషనర్ ఆఫ్ పోలీస్ సైబరాబాద్, డీసీపీ బాలానగర్ వారి ఆదేశానుసారం.. సైబర్ క్రైమ్ కేసుల్లో భాగంగా మోసపోయి నటువంటి వ్యక్తులు వారు, వారి సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలో, కేసులు నమోదు చేయవచ్చని, అంత కంటే ఎక్కువ డబ్బులు మోసపోయినట్లైతే, ఆ బాధితులుసైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ గచ్చిబౌలిలో ఫిర్యాదు చేయగలరని కూకట్‌పల్లి సీఐ కే.ముత్తు తెలియజేశారు.

# కొలన్ కలిసిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-దుండిగల్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని శుక్రవారం కలిసి ఆంగ్ల నామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నూతన ఆంగ్ల నామ సంవత్సరంలో ప్రజలంతా నూతన తేజంతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో తులతూగాలన్నారు.

**నవతెలంగాణ నూతన సంవత్సరం 2025 డైరీని శుక్రవారం డివిజన్ పరిధి,మహదేవపురంలో గల మాత అన్నపూర్ణేశ్వరి ఆలయ ఆవరణలో ఆవిష్కరిస్తు న్న గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావులశేషగిరి, మేనేజర్ జే.ఉపేందర్, సీనియర్ రిపోర్టర్ ఎస్.నరేందర్ రాజులు..**
నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



# సీఎంఆర్ కళాశాల సంఘటనపై విచారణ జరపాలి



- జేఎన్‌టీయూహెచ్ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం, స్టూడెంట్స్ ఫోరం సభ్యులు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
సీఎంఆర్ కళాశాల సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి, భాధ్యులను కఠినంగా శిక్షించాలని జేఎన్‌టీయూహెచ్ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం, స్టూడెంట్స్ ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం స్టూడెంట్స్ ఫోరం, జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో.. జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావుని సీఎంఆర్ కళాశాల బాలికల వసతి గృహంలో జరుగుతున్న సంఘటనలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్, గోపాల చందు మాట్లాడుతూ కళాశాల బాలికల వసతి గృహం యొక్క గ్రౌండ్ ఫ్లోర్ సీసీ ఫుటేజీలను తేప్పించుకోని విచారణ చేయాలన్నారు. రానున్న రోజుల్లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా విశ్వ విద్యాలయం తరచుగా విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న బాలికల వసతి గృహాలను పర్యవేక్షించాలన్నారు. బాలికల వసతి గృహంలో ఇటువంటి సంఘటనలు జరగడం భయాందోలనలు కలిగిస్తున్నాయని, బాలికలకు ఇటు వంటి సంఘటనలు జరగవనే భరోసా కళాశాల యాజమాన్యం కల్పించాలన్నారు. అక్కడ ఉన్న హాస్టల్ వార్డెన్లు ప్రీతి, ధనలక్ష్మి పాత్రపై పూర్తి స్థాయి విచారణ జరపాలన్నారు. ప్రతి బాలికల వసతి గృహంలో మహిళలే పని చేసే విధంగా విశ్వవిద్యాలయ అధికారులు అన్ని ఇంజనీరింగ్ కళాశాలలకు తగు ఉత్తర్వులు జారి చేయాలన్నారు. విద్యార్థినులు చేస్తున్న ఆరోపణలపై కళాశాల యాజమాన్యం నిష్పక్షపాతంగా చేయించి, తమ చిత్తశుద్ధిని చాటాలన్నారు. జనవరి 1, రాత్రి 12:00 గంటలు మొదలు ఉదయం 06:00 గంటల వరకు సీఎంఆర్ బాలికల వసతి గృహాల యొక్క గ్రౌండ్ ఫ్లోర్ సీసీ టీవీ ఫుటేజ్ ని తెప్పించుకోని, విశ్వవిద్యాలయ అధికారుల విచారణ చేసి నిజ నిజాలను నిగ్గుతేల్చి బాధ్యులపై కఠిన శిక్షలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. రానున్న రోజుల్లో సైతం ఏ కళాశాలలో కూడా ఇటువంటి ఈ సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సాయి కుమార్ రాథోడ్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, చైతన్య, సాత్విక్, సారన్ష్ , ధనుంజయ్, సాగర్, హేమంత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
నూతన సంవత్సరం 2025 పురస్కరించుకొని.. శుక్రవారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని శుక్రవారం ఆయన నివాస కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ చింతల్ డివిజన్ యూత్ కాంగ్రెస్ నాయకులు బాల్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుజ్జుల శ్రీనివాస్ రెడ్డిలు కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చం అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



నూతన సంవత్సరం సందర్భంగా బీఆర్ అంబేద్కర్ ట్రాన్స్‌పోర్ట్ భవన్‌లో శుక్రవారం తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా రవాణా శాఖ హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, జేటీసీలు సి.రమేష్, ఎం.చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, డీటీసీ రవీంద్ర కుమార్, అసోసియేషన్ అధ్యక్షులు నాయకం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ ప్రతీష్ రెడ్డి, ఉపాధ్యక్షులు చంద్ర శేఖర్, ట్రెజరర్ హనుమంతు, జాయింట్ సెక్రటరీ నవీన్, గంగాధర్ పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో


నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

12

హైదరాబాద్

శనివారం | జనవరి 4, 2025 | www.navatelangana.com


## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి పాలక మండలి సమావేశం నిర్వహించడం పై బోర్డు టీజీవో శాఖ హర్షం వ్యక్తం చేసిం ది. అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఖాదర్, జనరల్ సెక్రటరీ చంద్రజ్యోతి మాట్లాడుతూ బోర్డు ఆవిర్భావం తర్వాత ఏటా పాలక మండలి సమావేశాలు జరిపి సమస్యలు పరిష్కరించేవాళ్లు అని తెలిపారు. అయితే గత 11 ఏండ్లుగా ఒక్క మీటింగ్ కూడా నిర్వహించలేదన్నారు. కానీ కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభు త్వం ఏర్పడిన మొదటి సంవత్సరమే మీటింగ్ నిర్వహించడం సంతోషదాయకమన్నారు. పెండింగ్ సమస్యల్ని నిర్ణయాలు ఆమోదించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. జలమండలి ఆర్థిక స్వావలంబన సాధించడం దిశగా తీసుకున్న నిర్ణయాలు హర్షణీయమని కొనియాడారు.

## 'నో యువర్ ఆర్మీ' కార్యక్రమాన్ని ప్రారంభించిన గవర్నర్



నవతెలంగాణ-మెహిదీపట్నం

భారత సైన్యం నేటి నుండి 5వ తేదీ వరకు గోల్కొండ కోటలో నిర్వహిస్తున్న 'నో యువర్ ఆర్మీ' మేళాను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నో యువర్ ఆర్మీ 'కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా ప్రధాన కార్యాలయం (టాసా) ఆధ్వర్యంలో ఆర్టిలరీ సెంటర్ సమన్వయంతో చేపడుతున్నారు. ఈకార్యక్రమంలో పాల్గొనేందుకు పౌరులందరికీ అవకాశం ఉంటుంది. సాయుధ దళాల్లో చేరడానికి యువతను ప్రేరేపించడమే ఈ మేళా యొక్క ముఖ్య లక్ష్యం. ఇందులో ఆర్టిలరీ గన్‌లు, చిన్న ఆయుధాలు, ఆధునాతన ఆపరేషనల్ టూల్స్, కమ్యూనికేషన్ సిస్టమ్స్, ఇంజనీరింగ్ సాధనాలు, న్యూక్లియర్ బయోలాజికల్ కెమికల్, వార్‌ఫేర్ సూట్‌లతో కూడిన చిన్న పరికరాల స్టాల్‌ల పదర్శన ఏర్పాటు చేస్తారు. అంతే కాకుండా సైనిక దళాల ప్రత్యేక పదర్శనలు, గ్యాలంటరీ (శౌర్య) పతకాల ప్రదర్శనలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మిలటరీ పరికరాలతో ఫొటోలు దిగేందుకు, సాయుధ దళాలలో కెరీర్ అవకాశాల గురించి తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ విషయాలను వివరించడానికి ప్రతిస్టాల్ వద్ద ఆర్మీ సిబ్బంది ఉంటారని రక్షణశాఖ పౌరసంబంధాల అధికారి శివ హరినాయక్ తెలిపారు. తద్వారా యువతలో సైన్యంలో చేరేందుకు ప్రేరేపించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన వివరించారు.

## సావిత్రిబాయి ఫూలే అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలి




- కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు

నవతెలంగాణ-అంబర్‌పేట

సావిత్రిబాయి ఫూలే 194వ జయంతి కార్యక్రమాల సందర్భంగా బాగ్ అంబర్‌పేటలోని కేవీపీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించడానికి అభినందిస్తూ ఈ పాఠశాలలో 10 మంది మహిళా ఉపాధ్యాయులను సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రిబాయి ఫూలే చదువు కొని అనేక అవమానా లను మనువాదుల నుండి ఎదుర్కొని వారిపై పోరాటం చేసి అనేక వేల మంది మహిళలకి చదువు నేర్పి అనేక సామాజిక ఉద్యమాలు మహిళా హక్కుల కోసం ఉద్యమిం చారు. ఆమె ఉద్యమ స్ఫూర్తిని మనం కొనసాగించాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు మహేందర్, సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు నాగేందర్ సాయి, గణేష్, ప్లాన్ ఇండియా సూర్య కళ తదితరులు పాల్గొన్నారు.

### ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోతే

## రాష్ట్రవ్యాప్త ఆందోళన..

- రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య
- బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో సంక్షేమ భవన్ ముట్టడి



నవతెలంగాణ మెహిదీపట్నం

విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించాలని స్కాలర్‌షిప్‌లు ఒక్కొక్కరికి రూ.20వేల పెంచాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు మాసబ్ ట్యాంక్ లోని సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వంలోని కొందరు అధికారులు ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేయడానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఫీజు రియంబర్స్ మెంట్ పథకం ప్రవేశ పెట్టిన ఈ 16సంవత్సరాల కాలంలో సమాజంలో పెద్ద ఎత్తున గుణాత్మకమైన పరిణామాలు జరిగాయన్నారు. సమాజంలో ఇంత మార్పు తెస్తున్న ఈ పథకాన్ని ప్రభుత్వం నీరుకార్చే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్న కాంగ్రెస్ ఇంతవరకు బకాయిలు చెల్లించడానికి ముందుకు రావడం లేదని విమర్శించారు. ఫీజు బకాయిలు రాకపోవడం వలన కోర్సు పూర్తి అయినవారికి కాలేజీల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఉన్నత కోర్సులలో చేరడం సాధ్యం కావడం లేదని అంతేకాక ఉద్యోగాలు కూడా పొందలేకపోతున్నారని ఆయన వాపోయారు. ప్రభు త్వం వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని ఆయన ప్రభు త్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో బీసీ విద్యార్థులకు చదువులు గాలిలో దీపం లాగా మారాయని వాపోయారు. ఫీజులు సకాలంలో చెల్లించకపోవడంతో విద్యార్థులు తమ చదువులు మధ్యలో ఆపేసి రోజువారి కూలీ పనులకు వెళ్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నీల వెంకటేష్, గుజ్జ కృష్ణ, పగిళ్ళ సతీశ్, అనంతయ్య, రవి కుమార్ యాదవ్, రాజేందర్. పృథ్వీ గౌడ్, చంద్రశేఖర్, బాలస్వామి, ఉమేశ్, శివ, నరసింహ, తదితరులున్నారు.

### సామాజిక శక్తుల జీవితాల్లో వెలుగురేఖ సావిత్రి బాయి పూలే..



నవతెలంగాణ-ధూల్‌పేట్

సామాజికంగా వెనుకబడిన మహిళలకు విద్య నేర్పడం కొరకు అనేక అవమానలను ఎదుర్కొని, వారి జీవితాల్లో వెలుగులు నింపిన మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయు రాలు సావిత్రీబాయి ఫూలే అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) హైదరబాద్ సౌత్ జిల్లా కార్య దర్శి పి.శశికళ పేర్కొన్నారు. జియగుడలోని దుర్గ నగర్, వెంకటేశ్వర నగర్, కార్వాన్‌లోని అల్లూరి సీతారామరాజు నగర్, జంగం మెట్లోని నాయక్ నగర్ తదితర బస్తీల్లో ఐద్వా ఆధ్వర్యంలో ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సావిత్రి బాయి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సామాజికంగా వెనుకబడిన మహిళలకు మన శక్తి మేరకు సహాయ పడే గుణం అలవర్చుకోవాలని మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఐద్వా కార్యకర్తలు ఎస్ లావణ్య, మమత, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన సమాజాన్ని స్థాపించాలి

- సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

విజ్ఞాన సమాజాన్ని స్థాపించాలని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్ వినయ్ కుమార్ అన్నారు. తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం, నూయోక్రసర్ ఆధ్వర్యంలో మహిళా చైతన్య స్ఫూర్తి సావిత్రి బాయి పూలే 194 జయంతోత్సవ సభ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.వినయ్ కుమార్ హాజరై మాట్లాడుతూ జ్ఞాన సముపార్జన ద్వారానే అధికార సాధన, రాజ్యాధికార సాధన జరుగుతుందని అందరికన్నా ముందే సిద్ధాంతికరించిన జ్యోతిబా పూలే సిద్ధాంతాన్ని ఆచరించిన వారు సావిత్రి బాయి పూలే అని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం గౌరవ అధ్యక్షులు జి.రాములు మాట్లాడుతూ దురాచారాల పర్వతాలు ఒక్కొక్కటి బద్దలు కొట్టిన సావిత్రి బాయి పూలే ఈ సమాజంలో తప్పులు తలనొప్పులన్నింటికీ చదువు ఒక్కటే మందు.. చదువుల డాక్టర్ అయి చదువుతో సమాజ చికిత్స చేసిందని సావిత్రి బాయి పూలే అని కొనియాడారు. సాంప్రదాయాల చీకటి గది అద్దాలను బద్దలు కొట్టిన సూపర్ ఉమెన్ అన్నారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంక టేశ్వర్లు మాట్లాడుతూ కర్మ సిద్ధాంతం కాదని బతుకు సిద్ధాంతమని, జ్ఞాన సమాజం కోసం బతుకు రాతలు మార్చిన ధిక్కర స్వరం సావిత్రిబాయి పూలే అన్నారు. 'చదువుల దీపాలు వెలిగిద్దాం విజ్ఞాన వెలుగులు పంచుదాం' అనే కార్యక్రమం తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్యర్వంలో అనేక పోరాటాల ఫలితంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం మహిళా టీచర్స్ డే గుర్తించి సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని అధికారికంగా ప్రకటించడం హర్షనీయమన్నారు. ఇంటింటా దీపాలు వెలిగించి సావిత్రిబాయి పూలే ఫోటోలతో అనేక మంది పిల్లలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి బాగ్‌లింగంపల్లిలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి విజ్ఞాన దీపాలు వెలిగించి పూలే ఫోటోలు ఇంటి ముందు అతికించి విజ్ఞాన సమాజాన్ని స్థాపించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నూయోక్రసర్ డైరెక్టర్ బొజ్జ బిక్షమయ్య, జి. బుచ్చిరెడ్డి, రాణా ప్రతాప్ సాత్విక, భవానీ తదితరులున్నారు.




# సావిత్రిబాయి ఫూలే గొప్ప సంఘసంస్కర్త



ముషీరాబాద్‌లో



బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో



సుల్తాన్‌బజార్‌లో



అప్జల్‌గంజ్‌లో



ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో



చాంద్రాయణగుట్టలో

### కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని చాటిచెప్పిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి ఫూలే అని కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో శుక్రవారం ఓబీసీ మోర్చ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ముఖ్య అతిథిగా కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని ఆమె కీర్తిని స్మరించుకున్నారు. ఈ వేడుకలలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్న సాయి చంద్, ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, సీనియర్ నాయకులు దామోదర్, శ్రీకాంత్, వివిఎస్‌టిరాజు, పాల శ్రీనివాస్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే అని ప్రముఖ సినీ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. బుధవారం జన నాయక్ కర్పూరి ఠాకూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీసీ సాధికారత భవన్‌లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. పూలే మహిళలకు చదువు నేర్పిన గొప్ప గురువు అని అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, సినీ గీతా రచయిత సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ కవి జయ రాజ్, జననాయక్ కర్పూరి ఠాకూర్ ఫౌండేషన్ చైర్మెన్ సూర్య నారాయణ, దుర్గ రావు , వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్. కొలిపాక వెంకటస్వామిలు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సావిత్రి బాయి పూలే జయంతిని ప్రభుత్వం రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడాని బీసీ సంఘాలు మహిళా సంఘాలు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సుద్దాల అశోక్ తేజ, జయరాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు రాజేష్, రాంబాబు, వెంకట్, బీసీ సంగాల నేతలు పాల్గొన్నారు

#### బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో

మహిళలకు విద్యను అందించిన తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని చాకలి ఐలమ్మ మనవరాలు శ్వేత ఐలమ్మ అన్నారు. శుక్రవారం హనుమాన్ టెక్డిలోని బీసీ సాధికారత భవన్ లో బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బడుగు బల హీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నతరాలు సావిత్రి బాయి పూలే అన్నారు. పలువురు మహిళలకు సావిత్రిబాయి పూలే అవార్డులను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కే.బాయమ్మ, ఉపాధ్యక్షురాలు వడ్ల అరుణ, షేక్ షకీనా, బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బెల్లపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి యుగంధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సయ్యద్ బాషా, గ్రేట్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు బి.సునీత, ప్రధాన కార్యదర్శి వై.రేణుక, లలిత రేణుక, అనురాధ, అవినాష్, మహిళలు పాల్గొన్నారు.

#### అప్జల్ గంజ్‌లో

అప్జల్ గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో సావిత్రి బాయి పూలే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డాక్టర్ రియాజ్, ముఖ్యగంథ పాలకులు పీజీవి రాణి, గెజిటెడ్ గ్రంథ పాలకురాలు అపర్ణ, గ్రంథాలయ సిబ్బంది తదితరులు

#### ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో

కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో సావిత్రి బాయి పూలే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించిన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ, ప్రొఫెసర్లు తదితరులు

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

ఆదర్శ మహిళ సావిత్రిబాయి పూలే అని ఐద్వా చాంద్రాయణ గుట్ట జోన్ అధ్యక్షురాలు ఎల్ కవిత అన్నారు. మహిళా సంఘం ఐద్వా చాంద్రాయణ గుట్ట జోన్ కమిటీ ఆధ్వర్యంలో పూలే జయం తి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే మహిళ ఆదర్శ టీచర్, ఆది గురువు అన్నారు. మహిళలకు విద్య అందించాలనే ధృడ సంకల్పంతో, ముందుగా తాను చదువు నేర్చుకుని, తాను నేర్చుకున్న చదువును 10 మంది మహిళలకు పంచిందన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు సుజాత, విజయమ్మ, టింకు, రాధా, తదితరులున్నారు.

## డాక్టర్ డి.శోభనకు సావిత్రిబాయి పూలే ఎక్సలెన్సీ అవార్డు ప్రదానం




నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మహిళల విద్యాభివృద్ధి, హక్కుల కోసం సమాజంలోని రుగ్మ తులను రూపుమాపటానికి తన జీవితాన్ని దార పోసిన త్యాగమయి సావిత్రిబాయిపూలే అని హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ట్రిబ్యునల్ అడ్మినిస్ట్రేటివ్ కోర్టు చైర్మెన్ జస్టిస్ వామన్‌రావు అన్నారు. శుక్రవారం తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నాంపల్లి లోని సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయలోని గోల్డెన్ జూబ్లీ ఆడిటోరియంలో సావిత్రిబాయి పూలే 194వ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మహిళా హక్కులు మానవ హక్కులని తొలిసారి నినదించినది సావిత్రిబాయి పూలేనే అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ జియోగ్రఫీ శాఖ ప్రొఫెసర్ డాక్టర్ అక్తేర్ అలీ మాట్లాడుతూ భారత తొలి ఉపాధ్యా యురాలు చదువుల తల్లి క్రాంతి జ్యోతి సావి త్రిబాయి పూలే అని వివరించారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయన్ ముదిరాజ్ అధ్యక్షత వహిస్తూ రాష్ట్రం నుండి విద్యారంగంలో 36 సంవత్సరాలుగా నిర్వి రామంగా విద్యారంగంలో అపార సేవలు అందిస్తున్న విద్యావేత్త, సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.శోభనను సావిత్రిబాయి పూలే ఎక్సలెన్సీ అవార్డు 2025 కు ఎంపిక చేశామని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శోభనను జస్టిస్ వామన్ రావు మిగతా ప్రొఫెసర్లు సావిత్రి బాయి పూలే ఎక్సలెన్సీ అవార్డు, ప్రశంసా పత్రం శాలువా జ్ఞాపిక పూల మాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శోభన ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడానికి నాకు సహకరించిన ఉపాధ్యాయులు తోటి స్టాఫ్ అండ్ మేనేజ్మెంట్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ రవితేజ, కళాశాల సెక్రటరీ ఈ రాజేందర్‌కుమార్, ప్రొఫెసర్ వీణపాని, డాక్టర్ కే. రాధిక, డాక్టర్ సారా నహీద్, డాక్టర్ సీహెచ్ ఉమాదేవి, డాక్టర్ సుబ్బారావు, ప్రొఫెసర్లు గీత, వనజ, డాక్టర్ శ్రీవాణి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బత్తుల హేమంత్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## జాతీయ యువజన దినోత్సవాలు ప్రారంభం..




నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

దేశ ఉజ్వల భవిష్యత్తు యువత పైనే ఉందని ఉస్మాని యా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర కుమార్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవం నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ (ఎన్ఎంఓ) తెలంగాణ ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల విద్యార్థిని విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్, ప్రజెంటేషన్, షార్ట్ ఫిలిం మేకింగ్ లాంటి వివిధ పోటీలు కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర కుమార్, మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ శశికాలా రెడ్డిలు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలన్నిటిలో భారతదేశంలోని యువత అత్యధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. యువత వివేకానందుని బోధనలు అనుసరిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు. అలాగే దేశ శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్‌లు డాక్టర్ నాగార్జున, డాక్టర్ పద్మావతి, డాక్టర్ రమేష్ మధుర్, తెలంగాణ ఎన్ఎంఓ జనరల్ సెక్రెటరీ డాక్టర్ సురేంద్రబాబు, డాక్టర్ ఎల్ఆర్ఎస్ఎస్‌రావు, డాక్టర్ గుండు శ్రీనివాస్ డాక్టర్ విష్ణు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## భూభారతి రైతు చట్టంలో అనుభవ కాలమ్‌తో రైతుల్లో అభద్రత భావం

- రాష్ట్ర పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు పులిగారి గోవర్ధన్ రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

భూభారతి రైతు చట్టంలో ప్రవేశపెట్టిన అనుభవ కాలమ్ వల్ల రైతుల్లో అభద్రత భావం ఏర్పడుతుందని తెలంగాణ రాష్ట్ర పంచాయ తీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు, తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. రాష్ట్రంలో 75 లక్షల మంది రైతుల్లో అత్యధిక మంది చిన్న సన్నకారు రైతులే ఉన్నారన్నారు. భూభారతి రైతు చట్టా న్ని తేవడాన్ని రాష్ట్ర రైతులు వ్యతిరేకించడం లేదన్నారు. ధరణిలో లోపాలను అధిగమించడానికేనని రైతులు భూభారతి చట్టాన్ని ఆహ్వానిస్తున్నారన్నారు. కానీ బతు కుతెరువు కోసం, పనుల నిమిత్తం, ఉద్యోగం నిమిత్తం, ఇంటి పెద్దను కోల్పోయిన మహిళ కుటుంబ నిరాధారణకు గురైన రైతులు భూ భారతి రైతు చట్టంలో ప్రవేశపెట్టిన అనుభవ కాలమ్ వల్ల రైతుల్లో ఓ అభద్రత భావం ఏర్పడుతుందన్నారు. నిత్యం రైతులు, కౌలు రైతుల మధ్య కొట్లాడుకోవాల్సిస్తుందని, బలవంతులైన వారి కృత్యాలకు ఊరు విడిచిన వారి పరిస్థితి చెప్పరాదన్నారు. గత ధరణి చట్టంలో అనుభవ కాలమ్ లేనం దున పైన చెప్పిన రైతులు తమ భూమి తమ ఊరిలో ఉండి, తాము వేరో ప్రాంతంలో ఉన్న మానసిక ధైర్యంతో ఉన్నారన్నారు. కోర్టుల్లో సివిల్ ఇంజక్షన్ కోరే రైతుల కేసులు లేకుండా పోయాయని పేర్కొన్నారు. కానీ భూభారతి వల్ల భవిష్యత్తులో భూ సేద్యం తగ్గుతుందని, దాని వల్ల కోర్టులో కేసుల సంఖ్య పెరుగు తుందన్నారు. రైతు, కౌలు రైతులకు మధ్య జరిగే తగాదాల రక్షణ కోసం విధి విధానమంటూ లేదన్నారు. అందువల్ల కౌలుకిచ్చే రైతులు నష్ట కష్టాలు ఎదుర్కొంటున్నరడంలో సందేహంలేదన్నారు. ప్రభుత్వం స్పందించి మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు.



నవతెలంగాణ-అంబర్‌పేట

జై గణేష్ క్యాలెండర్ ఆవిష్కరించిన జై గణేశ భక్తి సమితి జాతీయ వ్యవస్థాపకులు జైన్ కుమార్ చారి, కమ్మరి మహేష్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రావణ్ కుమార్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాష్ట్ర యువజన సెలక్షన్ కమిటీ సభ్యులు, ఎల్ రవి కాంత్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెలక్షన్ కమిటీ సభ్యులు సతీష్ తదితరులున్నారు.



నవతెలంగాణ-అంబర్‌పేట

గులాబ్ శ్రీనివాస్ అయ్యప్ప ఇరుముడి పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, తదితర నాయకులున్నారు.



నవతెలంగాణ-అంబర్‌పేట

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్య దర్శి తోలుపునూరి కృష్ణగౌడ్, లేబర్ బోర్డు మాజీ వైస్ చైర్మెన్ నాగభూషణం, ఆల్ ఇండియా సేవా సంఘం ప్రెసిడెంట్ వెదిరి అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ధూల్‌పేట్



పాతబస్తీ చెత్త బజార్, ఎంజీబీఎస్ బస్‌స్టేషన్ రోడ్డులో ట్రాఫిక్ క్రమబద్ధికరణకు ప్లాస్టిక్ బారికేడ్లు ఏర్పాటు చేయించిన మీర్ చౌక్ ట్రాఫిక్ పోలీసులు

నవతెలంగాణ-ధూల్‌పేట్

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల రామారావును తెలంగాణ భవన్‌లో కలిసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఇల్యాస్ ఖురేషి, నాగరాజు, నుమాన్ ముస్తఫాలు. ఆయనకు పాత బస్తీలోని సమస్యల పై వివరించారు. ఓసారి పాత బస్తీలో పర్యటించాలని కోరగా స్పందించిన ఆయన త్వరలో పర్యటిస్తానని సమస్యల పై పోరాటం చేస్తానని హామీ ఇచ్చారని ఇల్యాస్ ఖురేషి తెలిపారు.



# ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సావిత్రిబాయి ఫూలే జయంతి వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా ఉపాధ్యక్షుడు స్టాలిన్ అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన సావిత్రిబాయి పూలే నేటి విద్యార్థులకు ఆదర్శనీయమని, ఆడపిల్లలకు చదువు కోసం మొట్టమొదటిసారి పాఠశాలను స్థాపించి వారికి విద్యను అందించిన గొప్ప సంఘ సంస్కర్త, అనేక అవమానాలను ఎదుర్కొని, నాటి మూఢచారాలకు వ్యతిరేకంగా మహిళలకు విద్యను అందించడమే ధ్యేయంగా పనిచేయడంలో అగ్రభాగాన నిలిచిన సావిత్రిబాయి పూలే, కృషి వల్లనే నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళుతున్నారని, చదువుల తల్లి అంటేనే సావిత్రిబాయి పూలే అని, నాడు సమాజంలో ఉన్న అనేక సాంప్రదాయాలను ఎదిరించి బాలికలకు విద్యను అందించడం కోసం జీవితాంతం కృషి చేసిన సావిత్రిబాయి పూలేను నేటి యువత స్మరించుకోవాలని ఆమె ఆశలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అక్షర జూనియర్ కాలేజీ గోపాల్ రెడ్డి, శ్రీనివాస్, జిల్లా నాయకులు రజినీకాంత్, సుష్మా, పావని, లక్ష్మి పాల్గొన్నారు.

# మహిళల విద్యా హక్కులు, అభ్యున్నతికి పోరాడిన సావిత్రిబాయి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- కలెక్టరేట్‌లో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళల విద్యాహక్కుల కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరుగని పోరాటం చేసిన తొలితరం ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకల సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలోనూ తన భర్త సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో సావిత్రిబాయి చదువు నేర్చుకుని ఉపాధ్యాయురాలు అయ్యారని కలెక్టర్ గుర్తు చేశారు. విద్యను అభ్యసిస్తేనే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని గ్రహించిన సావిత్రిబాయి, సాటి మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా చైతన్యానికి బాటలు వేశారన్నారు. తద్వారా ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తి గడించారన్నారు. అస్పృశ్యత, అంటరానితనం, కులవివక్షత వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు ఆమె చేసిన పోరాటం, చూపిన తెగువ స్ఫూర్తిదాయకమన్నారు. ఆ మహనీయురాలి స్ఫూర్తితో మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని, అప్పుడే ఆమె ఆశయ సాధనకు కృషి చేసినట్టు అవుతుందన్నారు. సావిత్రిబాయి సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఇకనుంచి ఆమె జయంతిని పురస్కరించుకుని ప్రతియేటా జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించిందని కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, డీఆర్వో ఈ.వెంకటాచారి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ రమేష్, డీపీఆర్వో అబ్దుల్ కలీం, కలెక్టరేట్ ఏవో సదానందం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖలో ఘనంగా సావిత్రిబాయి ఫూలే జయంతి వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి, ప్రముఖ సంఘ సేవకురాలు, దళిత, బహుజన స్త్రీ జనోద్ధరణకు తన జీవితాన్ని త్యాగం చేసిన త్యాగమయి సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆమె చిత్రపటానికి కార్యాలయ ఏడీ బి.శ్రీనివాస్ రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్, స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం జిల్లా అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్, కోశాధికారి ప్రేమ్, జాయింట్ సెక్రటరీ జయంతి రెడ్డి, పబ్లిక్ సెక్రటరీ ఫెర్రోస్ అహ్మద్, ఈసీ ముజాహిద్ వారి కార్యవర్గం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 6న సాయంత్రం పబ్లిక్ గార్డెన్ లలిత కళా తోరణంలో జరగనున్న టీఎన్జీవోస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్, సూర్య, మీర్జా, సుదర్శన్, శివ, అరుణ, లావణ్య, చారి, జి. రాజ్‌కుమార్, అనురాధ, విజయలక్ష్మి, ప్రవీణ, డి.శ్రీకాంత్, సుగుణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌కు న్యూ ఇయర్ విషెస్ చెప్పిన టీఎన్జీవోస్ నాయకులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సరం-2025 పురస్కరించుకుని టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు కుర్రాడి శ్రీనివాస్, వారి కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి పూలమొక్క అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ సెక్రటరీ వైదిక్ శస్త్ర, ఈసీ మెంబర్ శ్రీధర్, ముఖీమ్, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ నాయకులు సుదర్శన్, పరమేష్, ఇస్మాయిల్, తదితరులున్నారు.

# రవాణాశాఖ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సరం-2025 సందర్భంగా బీఆర్ అంబేద్కర్ ట్రాన్స్‌పోర్ట్ భవన్‌లో శుక్రవారం తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ కేక్ కట్ చేశారు. అనంతరం రవాణాశాఖ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జేటీసీలు సి.రమేష్, ఎం.చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్ర కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌చార్జి ఆర్టీవోలు యర్రి స్వామి, రవి కుమార్, అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆటో డ్రైవర్స్ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ చార్మినార్ జోన్ నాయకులు అబ్దుల్ సత్తార్, బాబర్ ఖాన్‌లు అన్నారు. సాలార్జంగ్ మ్యూజియం ఆటో డ్రైవర్స్ కమిటీతో సీఐటీయూ ఆలం ఖుంద్మీరి ఆటో డ్రైవర్ యూనియన్ అధర్యంలో సమావేశం నిర్వహించారు. షేక్ యాకూబ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆటో డ్రైవర్స్‌కు ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. రాబోయే రోజుల్లో తమ సమస్యల పరిష్కారించేంత వరకు యూనియన్ పోరాడుతుందన్నారు. కార్మికుల పక్షాన సీఐటీయూ అండగా ఉంటుందన్నారు.

**నూతన కమిటీ..**

సాలార్జంగ్ మ్యూజియం సీఐటీయూ ఆటో డ్రైవర్స్ యూనియన్ 19 మందితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా మహమ్మద్ ఇక్బాల్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ అఫ్జల్, కార్యదర్శిగా ఇఫ్తేఖార్ అలీ, సహాయ కార్యదర్శులు మహమ్మద్, ఖలీల్ ఖాన్, అహ్మద్ ఖాన్ తదితరులు కమిటీని ఎన్నుకున్నారు.

# ఫూలే స్ఫూర్తితో వివక్షలేని సమాజం కోసం పోరాడాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

దేశంలో పూలే స్ఫూర్తితో వివక్షలేని సమాజం కోసం మహిళలు పోరాడాలని సీఐటీయూ సౌత్ జిల్లా అధ్యక్షులు ఎం మీనా, సీనియర్ నాయకులు విఠల్ లు అన్నారు. సీఐటీయూ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్వాన్ పానిపుర యుపీహెచ్‌సీలో ఆశా వర్కర్లతో కలిసి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశంలో మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు అన్నారు. ఆమె అడుగడుగున వివక్షత, అణచివేతను ఎదుర్కొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆఫీస్ బెరర్లు కోటయ్య, నారాయణ, రాధిక, ఆశావర్కర్లు తదితరులున్నారు.

# ఏఎన్ఎం పోస్టుల సంఖ్యను పెంచాలి

- గ్రాస్ శాలరీ అమలు చేయాలని
- ఆరోగ్యశాఖ మంత్రికి ఏఐటీయూసీ వినతి..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో వెల్లడించిన పోస్టులకు అదనంగా పోస్టులను పెంచడం ద్వారా వైద్య ఆరోగ్యశాఖలో గత 18 సంవత్సరాలుగా పనిచేయుచున్న రెండవలకు న్యాయం చేయడం అవుతుందని ఎక్కువ మందికి రెండవలకు ఉద్యోగం అవకాశం వస్తుందని అందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించి ఎక్కువ పోస్టులను మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర సెకండియర్ యూనియన్ (ఏఐటీయుసీ) ఆధ్వర్యంలో నేడు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మాత్యులు దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మంత్రికి వివరిస్తూ దాదాపు 5వేల మంది రెండవలు రాష్ట్రంలో గత 18 సంవత్సరాలుగా తమ సేవలను ప్రభుత్వానికి ప్రజలకు అందిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని ఎక్కువ పోస్టులను పెంచడం ద్వారా వీరికి అర్హత పరీక్షలో ఉద్యోగ అవకాశం ఏర్పడుతుందని వారు తెలియజేశారు. గ్రామీణ స్థాయిలో పేదలకు ఆరోగ్య సేవలు అందించి కరోనా లాంటి కష్ట సమయంలో సైతం రాష్ట్ర ప్రభుత్వానికి పేరు తీసుకురావడం జరిగిందని మంత్రికి తెలియజేశారు. అనేక సంవత్సరాల తర్వాత ఎన్నో ఆశలతో రెండవ ఏఎన్ఎంలు ఈ పరీక్షలను రాయడం జరిగిందని వారందరికీ ఉద్యోగం వచ్చే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించి న్యాయం చేయాలని వారి సందర్భంగా కోరారు. మంత్రి స్పందిస్తూ వీలైనాన్ని ఎక్కువ పోస్టులను విడుదల చేయడానికి ప్రయత్నిస్తామని అధికారులతో రిపోర్టు తెప్పించుకొని ఖాళీ పోస్టులన్నింటిని నియమిస్తామని వారు యూనియన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండవ ఏఎన్ఎంల యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయులు, రాష్ట్ర అధ్యక్షురాలు జే పద్మ, ప్రధాన కార్యదర్శి శ్యామల, సహాయ కార్యదర్శి తస్వీర్ సుల్తానా, సువర్ణ, సుమిత్ర, భాగ్య పద్మ తదితరులు పాల్గొన్నారు.



**IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE : MEDCHAL-MALKAJGIRI DISTRICT : AT: KUKATPALLY**
**O.S.No. 724 of 2024**

**Between:**
Jasti Annapurnamma & another Rep by their SPA holder K.Udaya Bhaskar ...Plaintiffs
And
The Tahsildar, Kukatpally Mandal& others ..Defendants

To
All concerned

Take notice that the plaintiffs herein have filed the above suit for declaration to declare the Plaintiffs as the legal heirs of the deceased Jasti Subba Rao who died on 11-06-2018. The above suit is posted on 29-01-2025. If any person or persons having any objection/ interest in respect of the claims made by the plaintiffs may appear before the said Hon'ble Court at 10.30 a.m. by person or through an Advocate, failing which the matter will be decided on merits.

**//BY ORDER OF THE COURT//**
**M/s.V.V.RADHA KRISHNA, Advocate,**
Flat no.506, Block B Mahalakshmi Estates, Nizampet Road, Kukatpal y Hyderabad - 500085.
9848899808
Counsel for the Plaintiffs

**IN THE COURT OF HON'BLE VII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD**
**O.S.No: 894 OF 2024**

**Between:**
State Bank Of India . ...Plaintiff
VS
M/S SRI SAI KIRANA SHOP GENERAL STORES & Other ...Defendant

TO
D1.M/S SRI SAI KIRANA SHOP GENERAL STORES Prop. Massi Narendar S/o Shankar Aged about: 39yrs; Occ.: Business H.No: 30-272/3/1/1/G3, Chandragiri Colony, Santhoshimatha Colony, Street No.7, Malkajgiri, Neredmet, Hyderabad-500056.
Mr.Massi Narendar S/o Shankar Aged about:39yrs; Occ: Business H.No: 25-40/3/2/17, East Anandbagh, Beside Andra Bank ATM, Malkajgiri-500047.

Whereas the Plaintiff Bank has instituted the suit for recovery of money against Defendant no.D2 for a sum of Rs.7,89,020/- with current and future interest costs and other reliefs, the Hon'ble court posted above case on 29.01.2025 at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

**// BY ORDER OF THE COURT //**
**S.INDIRA DEVI ADVOCATE**
H.NO.17-1-388/P/18, Poornodaya Colony, Saidabad, Hyderabad, T.S. Cell No: 9849972122

**IN THE COURT OF HON'BLE VII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD**
**O.S.No: 2074 OF 2024**

**Between:**
State Bank Of India ...Plaintiff
VS
M/s SSS POWDER COATING WORKS & Other ...Defendant

TO
D1.M/s SSS POWDER COATING WORKS Prop. Cheekatla Venkat Rama Satyanarayan Murthi S/o Cheekatla Brahmadu, Aged about: 49Yrs; Occ.: Business Phase 5, P.No.92, Ramreddy Nagar, IDA Jeedimetla Quthbullapur, Medchal-Malkajgiri, Hyderabad-500055.
D2.Checkatla Venkat Rama Satyanarayan Murthi S/o Cheekatla Brahmadu, H.No. 28-157, Maruthi Nagar, Quthbullapur, Medchal-Malkajgiri, Hyderabad-500055.

Whereas the Plaintiff Bank has instituted the suit for recovery of money against Defendant no.1 and D2 for a sum of Rs. 1,50,241/- with current and future interest costs and other reliefs, the Hon'ble court posted above case on 22.01.2025 at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

**// BY ORDER OF THE COURT //**
**S.INDIRA DEVI ADVOCATE**
H.NO.17-1-388/P/18, Poornodaya Colony, Saidabad, Hyderabad, T.S. Cell No: 9849972122

**IN THE COURT OF THE HON'BLE PRL DISTRICT AND SESSIONS JUDGE AT : BHONGIR**
**O.S.No. 58 of 2024**

**Between:**
Mettu Narasimha and another ...Petitioner/Plaintiffs
AND
AV Infracon PVT. LTD ...Respondent/ Defendant

**NOTICE**

**To,**
AV INFRACON PVT. LTD. Represented by it's Chairman and Managing Director, Sri GOGULA LAKSHMI VIJAYA KUMAR S/O SRI GOGULA VENKATA RAMANA RAO, Resident of Plat No. 1003, Quiescent Heights, Mindspace, Vittal Rao Nagar, Madhapur, Hyderabad.

Please take the notice that the above named petitioner/ Plaintiff find tha above named suit against Respondent/ Defendent, and said case posted to 30-1-2025 for appearance of Respondent, inspite of this notice if you the above named Respondent not fails to appear before mentioned Hon'ble court on 30-1-2025, 10:30 A.M. either in personal (or) Through an Advocate otherwise you will be set exparte and the Hon'ble court will passed appropriate orders on merits.

**(By order of the Court)**
**CH. Narendra Prasad**
**P. Sreedhar**
**I. Kistaiah**
**N. Mahendra**
Advocates, Bhongir.

**IN THE COURT OF THE HON'BLE XXII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT: HYDERABAD**
**O.S.No.318 of 2023**

**Between:**
Canara Bank, Banjarahills Branch, Hyderabad ...Petitioner/Plaintiff
And
Sri Kattela Naveen Kumar ...Respondent/Defendant

To
Sri Kattela Naveen Kumar S/o Kattela Hanumanthu, aged about 29 years, Occ: Cab Service, R/0 H.No.28, Ground Floor, Nandanavanam, T.K.R.College Road, Saroornagar, K.V.Ranga Reddy- 500079.
PH NO: 9666353306.

Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of Rs.3,50,947/- together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the 10th January, 2025, at 10.30 am. In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

**//By Order of the Court//**
**N.Venugopala Rao**
**Advocate**
1-2-234/2/1, Plot no: 2/p, Road No : 4. S.R.L.Colony Kothapet. Hyd

**IN THE COURT OF THE HON'BLE XXII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT: HYDERABAD**
**O.S.No.5962 of 2023**

**Between:**
Canara Bank, Ameerpet Branch, Hyderabad ...Petitioner/Plaintiff
And
Sri K.Srinivas Rao and another ...Respondents/Defendants

To

1.Sri K.Srinivas Rao S/o K.Laxman Rao, aged about 55yrs, Occ: Employee, R/o 14-91, Plot No.64, Veerabadhra Nilayam, R.N. Reddy Nagar, Meerpet, R.R.Dist-500097.
PH NO: 9959994058.
2.Sri K.Kalyan Kumar S/o K.Srinivas Rao, aged about 30 years, Occ: Business, R/o 14-91, Plot No.64, Veerabadhra Nilayam, R.N. Reddy Nagar, Meerpet, R.R. Dist-500097.
PH NO: 9533589894.

Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of Rs.8,23,059/- together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the 10th January, 2025, at 10.30 am. In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

**//By Order of the Court//**
**N.Venugopala Rao**
**Advocate**
1-2-234/2/1, Plot no: 2/p, Road No : 4. S.R.L.Colony Kothapet. Hyd

**IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE :::: CITY CIVIL COURTS;; AT :HYDERABAD**
**OS NO. 3467/2024**

Between:-
State Bank of India, Doordarshan Road Branch, H.No. 2-2-74, 2-2-75, OPP: Maruthi Service Station, Amberpet, Hyderabad, Telangana-13 Rep. by its Branch Manager, ....Plaintiff
And
Mr. Godughu Sudharshan ....Defendant

To
Mr. Godughu Sudharshan, S/o Sri Lakshmi Pathi G, R/o 19-5-33/A, Nandimuslai Guda Kishanbagh, Hyderabad Telangana- 500064
O/o Mali, Zoo Park, Northern Power Distribution Company of Telangna Ltd, Bahadurpura, Hyderabad, TElangana-500064

Please take notice that the above named plaintiff instituted the above suit against you for recovery of Rs 11,97,092 -00 Ps. You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on 22-01-2025 at 10.30 AM. In default of your appearance the suit will be heard and decided in your absence.

**//BY ORDER OF THE COURT//**
**D.K. Lakshmi Kumari,**
Advocate
Flat no.304, Manikanta Paradise Apart. Dwarakanagar, Phase-II Uppal, Hyderabad, Pin Code- 500 039
Cell No. 99488 68080
Counsel for the Plaintiff

**IN THE COURT OF THE M A C T I - ADDL DISTRICT JUDGE AT HANAMKONDA**
**O.P.NO. 273 OF 2023**

Between:
Gopagani Ravali and others ...Petitioners
And
Vali Khan, and others ...Respondents

To.
R-1. Vali Khan, S/o Fatha Khan, aged 23 years, Occupation : Driver of crime Vehicle, R/o. Neembazar, Barmer, Rajasthan
R-2. Kamlesh Motibai Mevada, owner of the Crime Vehicle , Tirumala Transport,Gujarath

Please take notice that the above Petitioners filed OP for Grant of Compensation against the Respondents Where in You are Respondent.No.1 and 2 Please Attend before the Hon'ble Court on 30-01-2025 At 10.30 AM in Person or Through an Advocate otherwise you will be set-exparte.

// By order of the Hon'ble Court //
**P.NAGESH**
**Advocte**
**Hanamkonda**
**Cell No. 9849009396**

**IN THE COURT OF THE HON'BLE PRINICIPAL DISTRICT AND SESSIONS JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: KUSHAIGUDA**
**O.S.S.R.No.8237 OF 2023**
**IN**
**O.S.No.453 of 2012**

**Between:**
Bondalapati Babu Rao ( died) Per Lrs As Plaintiffs No.2 to 4 ...Petitioners/Plaintiffs
And
Chindam Narasimha (died) Per Lrs and others. ...Respondents/Defendants

To
2.K.Sri Lakshmi W/o Ramesh, Aged about 38yrs, Hindu, House-wife, R/o 30-240/62, Old Safilguda, Malkajgiri, Ranga Reddy District.
3.Chindam Mahesh S/o Late Chindam Narasimha, Aged about :29yrs,Occupation not known, R/o H.No.1-2-39/A, Yellareddyguda, Kapra, Ranga Reddy District.
4.Pydikondala Lakshmi Narayana, S/o Venkateswara Rao, Aged about 29yrs, Hindu, Private Employee, R/o Flat No. 206, Sri Santoshi Manasa Priya Apartment Plot No. 24, Geetha Nagar, Old Safilguda, Hyderabad, RangaReddy District.
5.Chindam Vijaya W/o Late Chindam Narasimha, Aged about: 42 years, Hindu, House wife, H.No. 1-2-39/A, Yellareddyguda, Kapra, Ranga Reddy District.
6. Chindam Sandhya D/o Late Chindam Narsimha, Aged about: 26yrs, Hindu, Occ:nil, R/o H.No. 1-2-39/A, Yellareddyguda, Kapra, Ranga Reddy District.
7.Chindam Mounika D/o Late Chindam Narsimha, Aged about: 26yrs, Hindu, Occ:nil, R/o H.No. 1-2-39/A, Yellareddyguda, Kapra, Ranga Reddy District.
(Defendant No.1 died and his Legal Representatives are brought on record as Defendant No.5 to 7 as per I.A.No.19 of 2015 Order dated 24.10.2017. Defendant No.3 is also as Legal heir of Defendant No.1 is already on record on the date of filing of suit) ...Respondents/Defendants.

Please take notice that the Petitioners/Plaintiffs has filed above O.S.S.R.No.8237 of 2023 in O.S.No.453 of 2012 permitting the Plaintiffs to deposit balance sale consideration towards registration of Suit Schedule property in favour of Plaintiffs No.2 to 4, as per Judgment and Decree passed in O.S.No.453 of 2012, dated 15.02.2023. Please take notice that the above said case is posted to 03.02.2025 at 10.30 A.M. in the above court, for your appearance. If you failed to appear on 03.02.2025 either in person or through your counsel before the said Hon'ble Court, the matter will heard and decided in your absence.

**" BY ORDER OF THE COURT"**
**M. SAIRAM, ADVOCATE,**
13-89, FLAT NO 2A, GEERVANI APARTMENTS, YADAVNAGAR, MALKAJGIRI, HYDERABAD 500 047.
Cell No.9989332075.
( Counsel for Plaintiff )

**IN THE COURT OF HON'BLE VII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD**
**O.S.No: 1659 OF 2024**

**Between:**
State Bank Of India .....Plaintiff
Vs
M/s SHIRDI SAI WOMENS HOSTEL & Other . ....Defendant

TO
D1. M/S SHIRDI SAI WOMENS HOSTEL Prop. Mangala Adi Lakshmi D/o Girappa Mangala Aged about: 38yrs; Occ.: Business P.No.8-3-728/1, Yellareddy Guda Near Law College, Ameerpet, Hyderabad-500073.
Ms.Mangala Adi Lakshmi D/o Girappa Mangala P.No.8-3-250/2/1, Yousuf Guda Basthi, Behind Hyderabad Restaurant, Khairatabad Yousufguda, Hyderabad-500045

Whereas the Plaintiff Bank has instituted the suit for recovery of money against Defendant no. 1 and 2 for a sum of Rs. 6,07,168/- with current and future interest costs and other reliefs, the Hon'ble court posted above case on 04.02.2025 at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

**// BY ORDER OF THE COURT //**
**S.INDIRA DEVI ADVOCATE**
H.NO.17-1-388/P/18, Poornodaya Colony, Saidabad, Hyderabad, T.S. Cell No: 9849972122

**IN THE COURT OF THE HON'BLE II ADDL DISTRICT & SESSIONS JUDGE- CUM-I Addl. FAMILY COURT MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: MALKAJGIRI**
**O.S.NO.54 OF 2023**

**BETWEEN:-**
M/s Mendu Infrastructure Projects Pvt.Ltd., Rep.by its Director Sri MSE Swamy ...Plaintiff
AND
M/s.Swagruha Constructions Pvt. Ltd., Rep.by its Board of Directors & 6 Others ...Defendants

Sri B.Srinivas S/o Sri Venkateswarulu, Aged about 58Yrs, Occ: Service, R/o H.No. 8-3-998, Flat No.402, Venu Platinum, Srinagar Colony, Hyderabad ...Defendants No.6

Above named Plaintiff has filed a Suit against Defendants herein for a Specific Performance and the same is posted on 05/02/2025 for above named Defendant No.6 appearance at 10:30 am before the Hon'ble Court failing appearance in person or through counsel shall set you exparte and case shall be tried in your absence.

**M/s SV LAW FIRM**
**J.SATYA PRASAD**
**ADVOCATE**
Address for Service
# 12-1-1518/A Shanthinagar, N.Lallaguda Sec-Bad-500017
Mobile: 9848273664

**IN THE COURT OF HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-VIII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, RANGAREDDY DISTRICT AT: KUKATPALLY**
**OS No.: 364 2023**

Between:
Sri M.Hanmanth Rao, S/O Late Yadagiri, ... Plaintiff
AND
B. Ravinder, S/O B. Rangaiah and 4 others Aged about: 58 years,
4. N. Anil Kumar, S/O N. Gopal, Aged about: 40 years,Occ: Not known to my client ,R/O # 6-3-596/11/B,Venkataramana Colony, Khairatabad, Hyderabad – 500004 (Defendants-4)
5. Md. Hussain S/O Maghdum HussainAged about: 39 years, Occ: Business H.No.: 3-50, Gudlanarva Village,Bajnapally Mandal, Nagarkurnool District – 50920 (Defendant-5)

To,
The defendants 4 & 5, as per the direction of the Hon'ble Court to issue paper publication in Nava Telangana News daily of Khairatabad and Nagarkurnool edition.

Please take this notice that you are hereby informed to appear before the Hon;ble Court on **18-02-2025** in person or through your counsel, otherwise the matter will be heard and decided ex-parte.

**(BY THE ORDER OF THE COURT)**
**M/S SHANTI K HARI ASSOCIATES**
Adv Shanthi Kumar Hari, # Flat-102, Saga City's Sai Sujatha Apts.Geetha Nagar, Road-3,Sainathpuram,Old Safilguda,Hyderabad – 56
Mob: 7416464566.
Counsel for Plaintiff

## నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**నవతెలంగాణ-బంజారాహిల్స్**
ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బడుగు బలహీన వర్గాలతో పాటు కార్మిక వర్గాలకు అండగా ఉంటూ, వాస్తవాలను ప్రజల్లోకి తీసుకువచ్చే వార్త,కథనాలను ప్రచురిస్తూ, సమస్య పరిష్కారం కోసం కృషి చేసే పాత్రను సంపూర్ణంగా పోషిస్తున్న నవతెలంగాణ యాజమాన్యానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అభినందనలు తెలిపారు. శుక్రవారం బంజారాహిల్స్ లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన చేతుల మీదుగా విలేకరి ఎం రఘునాథ్ ఆధ్వర్యంలో నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరించారు. నిత్యం వాస్తవాలను ప్రచురిస్తూ ప్రజల్లో

## వాస్తవాలు తెలియజేస్తున్న నవతెలంగాణ



**ఆబ్కారీ శాఖ ఇన్‌స్పెక్టర్ పటేల్ బాణోత్**
**నవతెలంగాణ-బంజారాహిల్స్**
అమీర్‌పేట ఆబ్కారీ శాఖ ఇన్‌స్పెక్టర్ పటేల్ బాణోత్ చేతుల మీదుగా శుక్రవారం నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వార్త సేకరణ ఎంత ముఖ్యమో నిజ నిర్ధారణ కూడా అంతే ముఖ్యమని ఆయన తెలిపారు. వాస్తవాలు తెలియజేస్తూ ప్రజల్లో నమ్మకాన్ని పొందిన కొన్ని సంస్థల్లో నవతెలంగాణ ఒకటిగా ఉందన్నారు. జవాబుదారీగా పనిచేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండాల ని చెబుతూ ఈ సందర్భంగా నవతెలంగాణ యజమాన్యానికి, విలేకరులకు అభినందనలు తెలిపారు.

## అందరి సమన్వయంతో నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- మేయర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, కార్పొరేటర్లు



**నవతెలంగాణ-సిటీబ్యూరో**
నగరాభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేయాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. న్యూ ఇయర్‌ని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ వివిధ విభాగాల అధికారులు, జోనల్ కమిషనర్లు, కార్పొరే



టర్లు శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ నూతన సంవత్సరం సందర్భంగా అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రజలు, అధికారులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మరింత నిబద్ధతతో కృషి చేస్తామన్నారు. నగరాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్ళడానికి అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. శుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు నగర అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తూ జీహెచ్ఎంసీ ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. ప్రజల సహకారంతో హైదరాబాద్ నగరాన్ని దేశంలోనే అతిపెద్ద నగరంగా అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని మేయర్ అన్నారు. మేయర్‌ను కలిసిన వారిలో జీహెచ్ఎంసీ వివిధ విభాగాల ఉన్నతాధికారులు, జోనల్, డిప్యూటీ కమిషనర్లు, కార్పొరేటర్లు, ఉద్యోగులు తదితరులు ఉన్నారు.



# విద్యార్థులకు భాషా నైపుణ్యం అవసరం

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఓయూలో శిక్షణా కార్యక్రమం ప్రారంభం



**నవతెలంగాణ-ఓయూ**
విద్యార్థులు ప్రపంచ యవనికపై రాణించాలంటే భాషా నైపుణ్యం అత్యంత కీలకమని ఓయూ కులపతి, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు మనపై ఆధిపత్యం కోసం ప్రయోగించిన ఆంగ్ల భాష ప్రస్తుతం వృత్తి పరమైన నైపుణ్యాలను ప్రపంచం ముందు వెల్లడించేందుకు అనివార్యంగా మారిందన్నారు. విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించటం ద్వారా ఆయా రంగాల్లో రాణించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయలను ఇతర ప్రాంతాలతో అనుసంధానం చేసేందుకు వీలవుతుందని సూచించారు. ఓయూ ఆంగ్లభాషా బోధనా కేంద్రం (ఈఎల్‌టీసీ) ద్వారా రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఇద్దరు చొప్పున ఎంపిక చేసిన గిరిజన అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఆంగ్లభాషా శిక్షణ కార్యక్రమాన్ని ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరంతో కలిసి గవర్నర్ ప్రారంభించారు. గవర్నర్ చొరవతో నెల రోజుల పాటు 66 మంది గిరిజన విద్యార్థులకు ఓయూలో వసతి కల్పించి ఆంగ్లభాషపై శిక్షణ ఇవ్వనున్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి, సాధికారత జరిగినప్పుడే వికసిత్ భారత్ ఉద్దేశాలు సాకారమవుతాయని గవర్నర్ వివరించారు. అన్ని సమస్యలకు విద్య మాత్రమే పరిష్కారం చూపుతుందని.. సాధికారత సాధించేందుకు సుస్థిర విద్యాభివృద్ధి ఆవశ్యకతను చెప్పారు. ఓయూతో కలిసి ప్రస్తుతం తొలి అడుగు వేశామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఓయూ వీసీ ప్రొ. కుమార్, ఈఎల్టీసీ డైరెక్టర్ ప్రొ. విజయ చొరవను గవర్నర్ అభినందించారు. ఓయూలో పర్యటించిన గవర్నర్‌కు వీసీ కతజ్ఞతలు తెలిపారు. గిరిజన విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ఉద్దేశించిన నెల రోజుల శిక్షణా బాధ్యతలను ఓయూకు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అట్టడుగు వర్గాలకు సమ్మిళిత విద్య, సామాజికాభివృద్ధిలో ఓయూ తన పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని వీసీ స్పష్టం చేశారు. గవర్నర్ ఆదేశాలకు అనుగుణంగా గిరిజన విద్యార్థులు ఆంగ్ల భాషలో నైపుణ్యం సాధించేలా సమగ్ర పాఠ్య ప్రణాళిక రూపొందించామని ఈఎల్టీసీ డైరెక్టర్ ప్రొ. విజయ వివరించారు. నెల రోజుల పాటు జరిగే ఆంగ్లభాషా బోధన, శిక్షణ కార్యక్రమానికి ప్రొ. కిస్టోఫర్, డాక్టర్ సవీన్ సౌద సమన్వయం చేస్తున్నారు. నెల రోజుల శిక్షణలో భాగంగా తరగతి గది బోధన, పద ప్రయోగం, పరస్పర భాషా ఉచ్చరణ సహా ఉద్యోగావకాశాలకు అవసరమైన నైపుణ్యాలను బోధిస్తారు. ఇందులో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులతో పాటు పరిశ్రమల నుంచి నిష్ణాతులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. కాసీం, గవర్నర్ సంయుక్త కార్యదర్శి భవానీ శంకర్, రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితేంద్రనాయక్ ప్రొఫెసర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**నవతెలంగాణ-కంటోన్మెంట్**
బొల్లారం కళాసిగూడలో వెటరన్ ఎయిర్ వారియర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు నూతనంగా నిర్మించుకున్న మీటింగ్ హాల్‌ను శుక్రవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సైన్యంలో చేరి దేశానికి సేవ చేసి రిటైర్ అయిన వెటరన్ ఎయిర్ వారియర్స్ వారి కోసం ఒక మీటింగ్ హాల్ నిర్మాణం కోసం ఎంతో కాలంగా ప్రయత్నించారని, ఎంతో పోరాటం చేసి చివరికి ఇప్పుడు నిర్మాణం పూర్తిచేసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఇందులో కొంత తన పాత్ర కూడా ఉన్నందుకు సంతోషంగా ఉందన్నారు. వెటరన్స్ దేశానికి ఎంతో సేవచేసి రిటైరయ్యారని.. వారి అనుభవం, జ్ఞానం సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో ఎక్కడ అవసరమో అక్కడ వారి సహాయసహకారాలు తప్పక తీసుకుంటాం అన్నారు. అలగే వెటరన్స్ కోసం కూడా తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వ నిధులతో పాటు అవసరమైతే తాను స్వయంగా నిధులు కేటాయి స్తానని ఆయన హామి ఇచ్చారు .

**కాలనీలో పర్యటన**
కళాసిగూడలో హరి ఓమ్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా ఇంటర్నల్ రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు కాలనీ వాసులు వివరించారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**నవతెలంగాణ-బేగంపేట్**
మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన కార్యాలయం వద్ద రాంగోపాల్ పేట మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో 2 జ్యూట్ బ్యాగ్‌ల కుట్టుమిషన్ లను ఎమ్మెల్యే ఎమ్మెల్యే చేతుల మీదుగా విక్టోరియా రాణిగంజ్ మహిళలకు అందజేశారు. ఒక్కో మిషన్ విలువ రూ. 26 వేలు అని అత్తిలి శ్రీనివాస్ గౌడ్ వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో విక్టోరియా రాణి గంజ్‌తో పాటు నియోజకవర్గ పరిధిలోని పలు బస్తీలకు చెందిన మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థికంగా రాణించాలని చెప్పారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమ ఖాళీ సమయాల్లో ఉపాధిగా మార్చుకోవాలని అన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేలా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లు అత్తిలి మల్లికార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్, ఆంజనేయులు, విజయ్, జనార్ధన్, రాజు, విక్టోరియా రాణి గంజ్‌కు చెందిన మహిళలు లావణ్య భాగ్య, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



## నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరించిన ప్రిన్సిపాల్

**నవతెలంగాణ-ఓయూ**
శంకర్ విద్యాయల హై స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ జి.ఎస్. చంద్రశేఖర్ శుక్రవారం స్కూల్‌లో నవ తెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక రిపోర్టర్ ,ఓయూ పీహెచ్డీ స్టూడెంట్ తలారి. శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 సంవత్సరాలుగా బీజేఆర్ నగర్, మల్కాజిగిరి ప్రాంతంలో విద్యార్థులు అతి సాధారణ ఫీజులతో క్రమశిక్షణ కలిగిన విద్యను సామాజిక బాధ్యతతో అందజే స్తున్నట్టు తెలిపారు. క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటుగా విద్యార్థుల ఆలోచన ,జ్ఞాపక శక్తిని ,పెంపొందించి,సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించేనందుకు " బ్రైటర్ మైండ్స్ " కార్యక్రమన్ని 3 నెలలుగా ఉచితంగా తమ విద్యార్థులకు అందిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం సమాజంలో అభివృద్ధి చెందాలంటే కేవలం విద్యా ద్వారానే సాధ్యం అన్నారు. స్కూల్ టీచర్స్‌కు, విద్యార్థులు,ఉద్యోగులు , తల్లిదండ్రులకు, నవ తెలంగాణ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజా సమస్యలను వెలికితీస్తున్న నవతెలంగాణ

- ప్రిన్సిపాల్ నాగరాజ్

**నవతెలంగాణ-బేగంపేట్**
ఎల్లప్పుడు ప్రజా సమస్యలను వెలికితిస్తూ వారికి న్యాయం జరిగేలా నవతెలంగాణ పత్రిక ఎంతో కృషి చేస్తున్నదని డాన్ బోర్డ్స్ మోడల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ నాగరాజ్ అన్నారు. శుక్రవారం నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఏ సమస్య అయినా పత్రికల్లో రాసి వారికి న్యాయం జరిగేలా నవ తెలంగాణ పత్రిక ఎంతో కృషి చేస్తుందని ఆయన తెలిపారు.



## ప్రపంచంలోనే మొదటి సారిగా
# 27 వారాల పిండానికి గుండె శస్త్ర చికిత్స

**విజయవంతంగా నిర్వహించిన రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్ వైద్య బృందం...**



**నవతెలంగాణ-బంజారాహిల్స్**
తల్లి గర్భంలో ఉన్న పిండానికి హైదరాబాద్ రెయిన్‌బో ఆస్పత్రి వైద్యులు గుండె చికిత్స చేసి వైద్య చరిత్రలో సరికొత్త రికార్డు సష్టించారు. ప్రపంచంలోనే మొదటి సారిగా 27 వారాల పిండంపై గుండె శాస్త్ర చికిత్సను విజయవంతం చేసినట్టు బంజారాహిల్స్ రెయిన్ బో చిల్డ్రన్ హాస్పిటల్ డాక్టర్ నాగేశ్వర్ రావు తెలిపారు. హాస్పిటల్ వైద్యుల బృందం ఈ మేరకు వివరాలను వెల్లడించారు.

హిందూపురంకు చెందిన సోనీ ప్రియా వెంకట రమణా దంపతులు. సోనీ ప్రియా గర్భంలోని పిండం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్టు వైద్య పరీక్షల ద్వారా వైద్యులు గుర్తించారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌లోని మల్టీ డిసిప్లినరీ వైద్యుల బృందం.. ప్రత్యేకమైన పీడియాట్రిక్ హార్ట్ సెంటర్.. గర్భంలో 27 వారాల పిండంపై క్లిష్టమైన వాల్వులోప్లాస్టీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. అధునాతన టెక్నాలజీ, పరికరాల సాయంతో గర్భంలో ఉండగానే శిశువుకు హృదయ సంబంధిత సమస్యలకు సంబంధించి సర్జరీని వైద్యుల బృందం నిర్వహించింది. ఈ ప్రక్రియ ప్రపంచంలోనే తొలిసారని.. వైద్యులు తెలిపారు. ఈ సర్జరీని చీఫ్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కోనేటి నాగేశ్వరరావు, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్వేతా బబ్రు, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీ ఫణిభార్గవి ధూళిపూడి నేతత్వంలో ఫీటల్ మెడిసిన్ స్పెషలిస్టులు, పీడియాట్రిక్ కార్డియాలజిస్టులు, ఇంటర్వెన్షనల్ ఆబ్జెక్టివ్‌లు, ఇంటర్వెన్షనల్ ఆబ్జెక్టివ్ బృందంతో కూడిన మల్టీడిసిప్లినరీ బృందం విజయవంతంగా నిర్వహించింది.

అత్యంత క్లిష్టమైన బెలూన్ డిలేటేషన్,లెఫ్ట్ వెంట్రిక్యులర్ డివైస్ క్లోజర్లతో శస్త్ర చికిత్స చేసినట్లు డాక్టర్ నాగేశ్వర్ రావు వైద్యుల బృందంతో కలిసి తెలిపారు. ఆధునిక ఇమేజింగ్‌తో కవాటం స్థితిని సవరించి... గుండెకు పడ్డ రంధ్రాన్ని డివైజ్‌తో మూసివేసినట్లు తెలిపారు.ప్రస్తుతం బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తల్లి పిల్ల క్షేమంగా ఉన్నారని చెప్పారు. పిండం గుండె చికిత్స అందించడంలో సమిష్టి కృషికి ఇది నిదర్శన మన్నారు. పిడియాట్రిక్ కార్డియాక్ సంరక్షణలో అద్భుతమైన మైలురాయిని సాధించామన్నారు. ఇప్పటివరకు ఇటువంటి విధమైన శాస్త్ర చికిత్సలో 3.2 ఎమ్ ఎమ్ బెలూన్ల వాడకంతో సుమారు 20 నుంచి 25 శాస్త్ర చికిత్సలు నిర్వహించగా మొట్టమొదటిసారి 4.5 ఎంఎం బెలూన్ల ఉపయోగంతో విజయవంతంగా గుండెకు రంధ్రం చేసి దాన్ని మూసి వేస్తూ ప్రత్యేక డివైజ్‌ను ఏర్పాటు చేసి రాబోయే కాలంలో బిడ్డకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రాణాపాయం లేకుండా ముం దస్తు శస్త్ర చికిత్స నిర్వహించి కాపాడగలిగామని వివరించారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక సాంకేతికత, మౌలిక సదుపాయాలు అందు బాటులో ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్వేతా బబ్రు,మరియు పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీ ఫణి భార్గవి ధూళిపూడి వారి ఆధ్వర్యంలో మెడిసిన్ స్పెషలిస్టులు, పీడియాట్రిక్ కార్డియాలజిస్టులు, ఇంటర్వెన్షనల్ ఆబ్జెక్టివ్ బృందం పాల్గొంది



నవతెలంగాణ క్యాలెండర్‌ను ప్రేమ్ రాజ్ శాంతి లాల్ జువెలర్స్ యజమాన్యులు శాంతి లాల్ జైన్, అశోక్ జైన్ శుక్రవారం ఆవిష్కరించారు.
నవతెలంగాణ-బేగంపేట్



## నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ-బేగంపేట్**
సికింద్రాబాద్‌లోని కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్‌లో ఊపిరితిత్తుల డాక్టర్ లక్ష్మణ్ బాబు, తనుశ్రీల చేతుల మీదుగా నవతెలంగాణ క్యాలెండర్ శుక్రవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ నవతెలంగాణ క్యాలెండర్ ను ఆవిష్కరించినందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. క్యాలెండర్ ఎంతో అద్భుతంగా ఉందన్నారు. అలాగే ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సమస్యల పరిష్కార దిశగా నవతెలంగాణ ముందుకు సాగుతున్నదని వారు తెలిపారు.

## పూలే జయంతి సందర్భంగా టీచర్లకు సన్మానం



- సన్మానించిన మాజీ ఉపాధ్యక్షుడు ప్రతాప్

**నవతెలంగాణ-కంటోన్మెంట్**
సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని శనివారం మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ న్యూ బోయినపల్లి బాపూజీనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలలోని మహిళా టీచర్లను శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా కార్యక్రమంలో పాల్గొన్న వీఆర్ హాస్పిటల్ ఎండీ నందకిషోర్ టీచర్లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి 2025 డైరీలను అందజేశారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాటాడుతూ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే అని చెప్పారు. మహిళల విద్యావంతులను ఎంతగానో కషి చేశారని అన్నారు. చదువుకునేందుకు పాఠశాల ఏర్పాటు చేశారని మహిళలను విద్యావంతులు చేసేందుకు విద్యాభివద్ధికి కషిచేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలని కొనాయాడారు. అలాంటి ఉపాధ్యాయురాలిని మహిళా టీచర్లకు మార్గదర్శకమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ బాలు నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు వీరలక్ష్మి, వాణిశ్రీ పద్మావతి, సరితా, శోభారాణి, అనిత, సౌజన్య, మనీషా, హరనాథ్, స్థానికులు అజిత్, శ్రీకాంత్, షకీబ్, మౌలా తదితరులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్ రెడ్డి, మాసబ్ ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరశురాం చుక్కపల్లిల చేతుల మీదుగా నవ తెలంగాణ క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండే మీడియా సంస్థలు వార్తా కథనాలను నిజా నిర్ధారణ చేసుకొని ప్రచురిస్తే ప్రజలకు భరోసాతో పాటు వారి సమస్య పరిష్కారానికి ఒక సులువైన మార్గం లభించినట్టు అవుతుందన్నారు. నవ తెలంగాణ ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని తెలిపారు. నవతెలంగాణ - బంజారా హిల్స్

# సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు





**నవతెలంగాణ-జూబ్లీహిల్స్**
సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బోరబండలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి జయంతి వేడుకలు జనవిజ్ఞాన వేదిక జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర రావు పాల్గొని మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావం సైన్స్ ప్రాముఖ్యతను గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక జూబ్లీహిల్స్ జోన్ కమిటీ కార్యదర్శి పసుపులేటి రమాదేవి మాట్లాడుతూ సావిత్రిబాయి జీవిత విశేషాలు గురించి వివరించారు. ముఖ్యంగా సావిత్రిబాయి ఒక దఢ సంకల్పంతో బాలికల విద్య గురించి, మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సాహసోపేతంగా శ్రమించిందన్నారు. అలాగే సావిత్రిబాయి కవితను పిల్లలతో పలికించారు. శిశు సంక్షేమ శాఖలో ఆఫీసర్ గా పనిచేసి రిటైర్ అయిన విజయ్ వాణి మాట్లాడుతూ, దాదాపు కొన్ని వందల ఏండ్ల సంవత్సరాల తర్వాత కూడా, ముఖ్యంగా ఆడపిల్లల రక్షణ ఎంత దయనీయంగా ఉందో వివరిస్తూ, ఆడపిల్లలు ఎంత దఢంగా కత నిశ్చయంతో పట్టుదలగా ముందుకు ఎదగాలో, అలాగే పుస్తకాలు చదవడం అలవాటుగా చేసుకోవాలని వివరిం చారు . ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. విజయ్ అధ్యక్షత వహించారు. విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా సావిత్రిబాయి గురించి పాటలు ఆలపించారు.. సావిత్రిబాయి మోనో ఆక్షన్ కూడా చేశారు. విజయ్ వాణి , డాక్టర్ విజయలక్ష్మి రాసిన చిన్నోడికి ప్రేమతో అనే పుస్తకాలను ఆ స్కూల్ లైబ్రరీకి కానుకగా అందజేశారు ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు యాదగిరి పాల్గొన్నారు.

**పూలే నిత్య స్ఫూర్తి : సీనియర్ జర్నలిస్టు సి.వనజ**
**ఓయూ :** సమాజ సేవలో సావిత్రిబాయి పూలే అందరికీ నిత్య స్ఫూర్తి అని సీనియర్ జర్నలిస్ట్ సి వనజ అన్నారు. సామాజిక సేవలో ఆమెను మించిన వారు మరెవరూ లేరని కొనియాడారు. జనవిజ్ఞాన వేదిక హైదరాబాద్ నగర కమిటీ , ఆంధ్ర మహిళా సభ డిగ్రీ మహిళ కళాశాల ఆధ్వర్యంలో పూలే జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ బాలిక విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. సావిత్రిబాయి స్ఫూర్తితో నేటితరం యువతులు సమాజ కట్టుబాట్లకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు.మహిళల అణచివేత,దాడులు , లైంగికదాడులు భ్రూణ హత్యలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా ఉద్యమించాలన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాల చారి మాట్లాడుతూ మహిళల విద్య కోసం తన జీవితమంతా పూలే అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. ఆంధ్ర మహిళా సభ కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డాక్టర్ పి.రజిని మాట్లాడుతూ. సావిత్రిబాయి పూలే జీవితం అందరికీ ఆదర్శప్రాయం అన్నారు. పూలే జయంతిని మహిళా టీచర్ల దినోత్సవం గా ప్రకటించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి ఆమె కతజ్ఞతలు తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఎస్వీ లింగస్వామి, డాక్టర్ సమత రోషిని, వెంకట్, ఆంధ్ర మహిళా సభ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఝాన్సీ రాణి ,అధ్యాపక బృందం డాక్టర్ కరుణాదేవి, డాక్టర్ ప్రమీల, హిమబిందు, సంధ్యారాణి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.




**ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రి బాయి జయంతి**
**నవతెలంగాణ-ఓయూ**
అడ్డగుట డివిజన్ పరిధిలో శుక్రవారం ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. నాయకురాలు సరదా, అంజమ్మ ఫాతిమా మాట్లాడుతూ. నిజమైన చదువుల తల్లి సావిత్రిబాయి పూలేకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలన్నారు. చరిత్రలో త్యాగాలు చేసిన వారిని గుర్తించి వారి పేరు ఎల్లకాలం ప్రజల్లో నిలిచినట్టుగా గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం పై ఉందన్నారు. ఐద్వా మహిళా నాయకురాళ్ల పాల్గొన్నారు.





హిమాయత్ నగర్ లోని ఎస్ఆర్.శ్రీ గాయత్రి జూనియర్ కాలేజీలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ నాగేశ్వర రావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. నవతెలంగాణ - సిటీబ్యూరో

# అలాంటి బంధాలే వద్దు



**ఇద్దరి మధ్య గాఢమైన అనుబంధం, ఒకరంటే మరొకరికి చెప్పలేనంత ప్రేమ, సాన్నిహిత్యం.. సాధారణంగా ఏ బంధంలోనైనా ఈ మూడు అంశాలుంటే అది పర్ఫెక్ట్‌గా ఉన్నట్లు లెక్క. అయితే కొందరిలో ఈ మూడూ ఒకే వ్యక్తిపై ఉండాలని రూలేం లేదు. ఈ క్రమంలో ఒకే వ్యక్తి ఒకరితో కలిసి ఉంటూ, మరొకరితో అనుబంధం పెంచుకోవచ్చు. సాధారణంగా ఇదే వివాహేతర సంబంధాలకు కారణమవుతుంది. ఇలాంటి పరిస్థితులు చాలామంది జీవితాల్లో ఎదురవుతూనే ఉంటాయి. ఇష్టంలేని పెండ్లి చేసుకోవడం, దాంపత్య బంధంలో ఎదురయ్యే సమస్యలు, ఒత్తిళ్లు.. ఇతరత్రా ఆకర్షణలు, అవసరాలు.. వంటి పలు కారణాల వల్ల వివాహేతర సంబంధాలను ఆశ్రయిస్తుంటారు కొందరు. అయితే ఆ బంధాలు తాత్కాలికంగా సంతోషాన్ని, ప్రశాంతతను అందించినప్పటికీ చివరికి మిగిలేది, శాశ్వతమయ్యేది మాత్రం నిజమైన భార్యాభర్తల బంధమే అని గుర్తుంచుకోవడం మంచిది.**

ఎక్కువ శాతం మందికి ప్రస్తుతం ఉన్న బంధంలో బోర్ కొట్టడం లేదా అందులోని ఒత్తిడిని తగ్గించుకోవడానికి వేరొకరిని ఆశ్రయించడం, తమని తమ భాగస్వామి కంటే ఎక్కువగా ప్రేమించేవారు ఉన్నారని వారిపై ప్రేమను, నమ్మకాన్ని పెంచుకోవడం.. ఇలా వివాహేతర సంబంధాలకు చాలా కారణాలే ఉంటాయి. కొన్ని వివాహేతర సంబంధాలను పరిశీలిస్తే..

**బంధానికే ముప్పు**

ఎదుటివాళ్లు మనతో కాస్త క్లోజ్‌గా మాట్లాడితే చాలు.. వాళ్లకు మనతో సమయం గడపడమంటే ఇష్టమని, తామిద్దరం ప్రేమలో ఉన్నామని భావిస్తుంటారు మరికొందరు. వీరికోసం అవతలివారు తమ భాగస్వామిని కూడా వదిలేస్తారని వూహించుకుంటారు. కానీ ఇలా మధ్యలో కలిసిన బంధాలు మధ్యలోనే విడిపోతాయి. దీంతో చివరకు నిరాశే మిగులుతుంది. అంతేకాదు.. ఇలాంటి పనులు చేస్తున్నారని అసలు భాగస్వామికి తెలిస్తే.. అప్పటివరకు ఉన్న సదభిప్రాయం పోవడంతో పాటు, వివాహ బంధానికే ముప్పు వాటిల్లే అవకాశముంటుంది. కాబట్టి ఇలాంటి బంధాలు ప్రారంభించడం కంటే మీ భాగస్వామితో మాట్లాడి, వీలైతే సైకాలజిస్ట్.. వంటి నిపుణుల్ని సంప్రదించి చికిత్స తీసుకోవడం.. అలాంటి ఆలోచనలు మదిలోకి రాకుండా జాగ్రత్తపడడం మంచిది.

**పంతాలకు పోయి...**

వివాహేతర సంబంధాల్లో ఈ తరహా బంధాలు చాలా ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. భర్త లేదా భార్య తమతో సరిగ్గా సమయం గడపట్లేదనో.. తాము చెప్పినట్లు వినట్లేదనో కోపగించుకొని వివాహేతర బంధాలను ప్రారంభించే వారూ లేకపోలేదు. మరికొందరు ఇలాంటి బంధాలు కొనసాగించే తమ భాగస్వామిపై కోపగించుకొని వారూ ఇలాంటి బంధాల్ని ఆశ్రయిస్తుంటారు. ఇలాంటి రిలేషన్‌షిప్స్‌లో ప్రస్తుత బంధంలో తమకున్న ఒత్తిడి, సమస్యలను ఎదుటివారితో పంచుకోవడానికి మాత్రమే ఎక్కువ ఆసక్తి చూపిస్తుంటారు. పైగా వీటివల్ల ఒరిగేదేమీ ఉండదు.. దంపతుల మధ్య గొడవలు జరగడం తప్ప. 'తన కోపమే తన శత్రువు' అన్నట్లుగా భాగస్వామిపై కోపంతో ఇలాంటి పంతాలకు పోతే తమ వివాహబంధంలో నిరాశే మిగులుతుంది. కాబట్టి ఇలాంటి బంధాలు ప్రారంభించే బదులు భార్యాభర్తల మధ్య ఉన్న సమస్యలను వారే మాట్లాడుకొని పరిష్కరించుకోవడం వల్ల భేదాభిప్రాయాలన్నీ సమసిపోయి దాంపత్య జీవితం సాఫీగా సాగిపోతుంది.

> **కేవలం కోరికలకే..**
>
> కేవలం కోరికలకే పరిమితమయ్యే బంధాలు కూడా కొన్నుంటాయి. ఇలాంటి సంబంధాల్లో ఉన్నవారికి వివాహేతర సంబంధంలో ఉన్న తమ భాగస్వామిపై తమకున్న కోరికలను నెరవేర్చుకునే వరకు వాళ్లని విడిచిపెట్టాలన్న ఆలోచన ఏమాత్రం రాదు. కేవలం ఆ ఒక్కరితో మాత్రమే శారీరక సంబంధానికి కట్టుబడి ఉండకపోవచ్చు. ఇలాంటి బంధాలు ఎక్కువ కాలం నిలవవు. తమ భాగస్వామితో చక్కటి జీవితం గడుపుతున్నాం.. అన్న ఆలోచన వచ్చి కనువిప్పు కలగగానే ఇలాంటి బంధాలకు దూరంగా ఉండడం ప్రారంభిస్తారు కొందరు.

**మానసిక బంధాలు..**

ఇలాంటి బంధాల్లో సాధారణ దాంపత్య బంధంలోలాగా శృంగారానికి ఆస్కారం ఉండదు. కానీ మానసికంగా ఒకరిపై మరొకరు పూర్తిగా ఆధారపడతారు. అందుకే దీన్ని మనసుకు సంబంధించిన బంధంగా పేర్కొంటారు. ఇలాంటి రిలేషన్‌షిప్‌లో అడుగుపెట్టిన వారు శారీరక సంబంధం కొనసాగించకపోయినా.. దాని గురించి మాట్లాడుకోవడం, పూర్తిగా వ్యక్తిగతమైన విషయాలు కూడా చర్చించుకోవడం వంటివి చేస్తుంటారు. ఒకరి గురించి మరొకరు ఎక్కువగా ఆలోచించడం ఈ బంధంలోనూ కనిపిస్తుంది. ఇలాంటి బంధాలను మొగ్గలోనే తుంచేయడం మంచిది. ఎందుకంటే ఇతరులపై మరీ ఎక్కువగా ఆధారపడడం వల్ల జీవితానికే చేటు జరుగుతుందని గుర్తుంచుకోవాలి. మానసికంగా మరీ ఎక్కువకాలం ఆధారపడిన తర్వాత వారిని మర్చిపోవడం, వదలడం కూడా కష్టంగా మారుతుంది. అందుకే మొదట్లోనే ఇలాంటి బంధాల నుంచి దూరమైతే అందరికీ మంచిది.

**చివరికి బాధే మిగిలేది**

ఇక మరో తరహా బంధంలో ఇద్దరు వ్యక్తులు నిజజీవితంలో భార్యాభర్తల్లాగే ఒకరిపై ఒకరు మానసికంగా ఆధారపడతారు. శారీరకంగా దగ్గరవుతారు. అవతలివారితో ఉన్నప్పుడు వీరు ఎంతో ఆనందంగా ఫీలవుతుంటారు. అంతేకాదు.. వాళ్ల సాంగత్యంలోనే ఆనందాన్ని వెతుక్కుంటారు. అలాగే ఎప్పుడూ వాళ్లతోనే సమయం గడపాలని పించడం.. వారి గురించే ఆలోచిస్తుండడం వల్ల తమ భాగస్వామికి ఎక్కువ సమయాన్ని కేటాయించలేరు. ఇలాంటి బంధాల వల్ల వారి వైవాహిక బంధంలో గొడవలు తప్ప మరే ఉపయోగమూ ఉండదు. ఇది శ్రుతి మించితే విడాకులకు కూడా దారితీయచ్చు. ఒకవేళ ఏదైనా కారణం వల్ల వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఇద్దరూ విడిపోవాల్సి వస్తే.. ఉన్న సమస్యకు అదనంగా మరో సమస్య తోడవుతుంది. ఇలాంటి సంబంధాల వల్ల అన్ని విధాలా చివరికి బాధే మిగులుతుంది. అందుకే దీన్ని తొలి దశలోనే గుర్తించి అసలు భాగస్వామితో మాట్లాడడం, మానసిక వైద్యుల్ని సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం.. వంటివి చేయడం వల్ల ఇలాంటి బంధాలకు దూరంగా ఉండడమే కాదు.. వివాహ బంధాన్నీ అరమరికల్లేకుండా ఆస్వాదించవచ్చు. ■

# నువ్వులతో ఇలా...

నువ్వులు మన శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తాయి. చలికాలంలో ముఖ్యంగా నువ్వులు తినడం చాలా మంచిదని చెబుతారు. అందుకే దీనిని ఈ కాలపు సూపర్ ఫుడ్‌గా కూడా చెబుతారు. ఇందులో ఉండే పోషకాలు అనేక అనారోగ్య సమస్యల నుండి మనల్ని కాపాడతాయి.

నువ్వులలో క్యాల్షియం, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు, ప్రొటీన్లు, పీచు పదార్థాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు తదితరాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఐరన్, ఫాస్పరస్, జింక్, కాపర్ వంటి అనేక పోషకాలు ఇందులో మెండుగా ఉంటాయి.

**ఎముకలకు పుష్టి**

నువ్వులలో క్యాల్షియం పుష్కలంగా ఉంటుంది. పాల కంటే అధికంగా కాల్షియం ఉన్న నువ్వులు తినడం వల్ల ఎముకలు దృఢంగా మారతాయి. కీళ్ల నొప్పులు, కండరాల నొప్పుల నుండి నువ్వులు మనకు ఉపశమనం కలిగిస్తాయి. దంతాలకు కూడా బలం చేకూరుతుంది.

**ఈ సమస్యకు చెక్**

ఇందులో ఐరన్ పుష్కలంగా ఉండడం వల్ల రక్తహీనత సమస్యతో బాధపడే వారికి చాలా బాగా పనిచేస్తుంది. రక్తహీనతతో బాధపడేవారు ఒక స్పూను నువ్వులను తినడం వల్ల ఈ సమస్య నుంచి బయటపడొచ్చు. అలాగే రక్తాన్ని శుద్ధి చేయడానికి కూడా నువ్వులు ఎంతో బాగా ఉపయోగపడతాయి. శరీరంలో హిమోగ్లోబిన్ లెవెల్స్‌ను పెంచడానికి కూడా నువ్వులు దోహదం చేస్తాయి.

**వ్యాధి నిరోధక శక్తి..**

నువ్వులలో జింక్ పుష్కలంగా ఉండడంవల్ల మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచి మనల్ని జబ్బుల బారిన పడకుండా కాపాడతాయి. చలికాలంలో మన శరీరం పైన దాడి చేసే అనేక ఇన్ఫెక్షన్లను రాకుండా ఇవి కాపాడతాయి. ఇందులో అధికంగా ఉండే పొటాషియం, మెగ్నీషియం హైబీపీని నియంత్రిస్తాయి. అలాగే ఇందులోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మన గుండెకు ఆరోగ్యాన్ని ఇస్తాయి.

**గుండె జబ్బులకు చెక్**

గుండెజబ్బులు రాకుండా మనలను కాపాడతాయి. ఇలా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నటువంటి నువ్వులను ప్రతిరోజు ఒక స్పూను తింటే చాలు, లేదా ప్రతిరోజు ఒక నువ్వుల ఉండనైనా తింటే చాలు మన ఆరోగ్యంలో వచ్చే మార్పును మనం ఇట్టే గమనించవచ్చు.



వాతావరణం మారినప్పుడు తరచుగా దగ్గు వస్తుంటే నువ్వులను తీసుకోవడం వల్ల ఉపశమనం పొందవచ్చు. నువ్వుల కషాయాన్ని తాగడం వల్ల దగ్గు నుండి ఉపశమనం లభిస్తుంది. నువ్వులు, పంచదార ఉడికించి తాగితే పొడి దగ్గు నయమవుతుంది.

ఇవి చర్మాన్ని స్మూత్‌గా, జుట్టును బలోపేతం చేయడంలో బాగా ఉపయోగపడతాయి. వీటిలో ఉండే జింక్ చాలా ప్రత్యేకమైనదిగా చెప్పొచ్చు. ఇది చర్మం, జుట్టుకు ఉపయోగకరంగా ఉంటుంది. అంతేకాదు నువ్వుల లడ్డులో విటమిన్ ఈ పుష్కలంగా ఉంటుంది. ఇది వృద్ధాప్యాన్ని తగ్గిస్తుంది.

# వారసత్వ ఉద్యోగాలపై క్యాబినెట్‌లో తేల్చాలి

**నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్**

వీఆర్ఏలు మరోమారు తమ ఐక్యతను చాటారు. జీవో నెంబర్ 81 ప్రకారం రిటైర్డ్ అయిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలని శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు మూకుమ్మడిగా తరలొచ్చారు. 1,500కుపైగా వీఆర్ఏలు శాంతియుత పద్ధతిలో దరఖాస్తులు స్వీకరించే హాల్ బయట బైటాయించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య వారి వద్దకు వచ్చి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'ఇప్పటికే మూడు సార్లు ఇక్కడికొచ్చి వినతిపత్రాలు ఇచ్చాం...కచ్చితంగా న్యాయం చేస్తాం అంటున్నారుగానీ చేయడం లేదు. శనివారం నిర్వహించనున్న క్యాబినెట్‌లో వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు అనే అంశాన్ని తేల్చాలి' అని డిమాండ్ చేశారు. వారికి చిన్నారెడ్డి సర్దిచెప్పారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం వెళ్లారనీ, రాగానే మరోమారు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసానిచ్చారు. అనంతరం వినతిపత్రం స్వీకరించారు. ఆ తర్వాత చాలా మంది వీఆర్ఏలు ప్రజా భవన్ నుంచి సీసీఎల్ఏ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్తామని చెప్పారు. ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉన్న సమయంలో ఇలాంటివి సరిగాదని పోలీసులు వారికి సర్దిచెప్పారు. దీంతో వీఆర్ఏలు తాము వచ్చి వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో సీసీఎల్ఏ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సీసీఎల్ఏ కార్యదర్శి మకరందంకు వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు ప్రజాభవన్ ప్రధాన ద్వారం వద్ద వీఆర్ఏ సంఘాల జేఏసీ కన్వీనర్ వంగూరు రాములు మీడియాతో మాట్లాడారు. వీఆర్ఏల వారసులకు జీవో నెంబర్ 81,85 ప్రకారం రాష్ట్రంలో ఉన్న 20,555 మంది లో 16758 మంది వీఆర్ఏ లకు రెవెన్యూ మున్సిపల్ ఇరిగేషన్ వ్యవసాయం విద్య వైద్యం తదితర శాఖల్లో సర్దుబాటు చేశారని తెలిపారు. ఆ జీవోలో మిగిలిన 3797 మంది వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా 18 నెలలుగా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. వారు 15 ఏండ్లుగా తమ తల్లిదండ్రుల స్థానంలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. గత ఎన్నికల సమయంలో తాము పోరాటాలు చేస్తున్న ప్రదేశాలకు పీసీసీ అధ్యక్షుని హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి వారసులకు ఉద్యోగాలిస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు.

గ్రామంలో చీమ చిటుక్కుమన్నా ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి సమాచారం చేరవేస్తున్న వీఆర్ఏల పట్ల ప్రభుత్వం ఇలా వ్యవహరించడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వీఆర్ఏలకు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దయతలిచి శనివారం జరిగే క్యాబినెట్ సమావేశంలో వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలిస్తున్నట్టు ప్రకటన చేయాలని కోరారు. అదే సమయంలో విద్యార్హత గల వీఆర్ఏలకు విలేజ్ లెవల్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మధు, నగేష్ కుమార్, రమేశ్ పటేల్, శివ, సుల్తాన్ గౌడ్, భరత్ రమేశ్ కుమార్, రాజలింగం, రాజశేఖర్, మధు పటేల్, శ్రీకాంత్, వెంకటేష్, సతీష్, హరీష్ గంగమల్లు, సాగర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ మాట్లాడుతూ కౌలు రైతులకుపెట్టుబడి సాయం రాదనీ, తన పంటను అమ్ముకుందామంటే మార్కెట్‌లో అవకాశం లేదని చెప్పారు. దీంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు.వారికి పెట్టుబడి సాయం, పంటల బీమా, పంట నష్ట పరిహారాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలుదారీ చట్టం 2011ను అమలు చేయాలని కోరారు. రైతు స్వరాజ్యవేదిక జాతీయ నాయకులు విస్సా కిరణ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారిని గుర్తిస్తామని చెప్పినా చేయడం లేదన్నారు. రైతు డిక్లరేషన్‌లోనూ కౌలు రైతులను ప్రస్తావించారని గుర్తు చేశారు. ఏడాది గడిచిన కౌలు రైతుల సమస్యలపై విధి, విధానాలు రూపొందించలేదని విమర్శించారు. గ్రామ సభల్లో కౌలు రైతులను గుర్తించి, బ్యాంకు రుణాలు, పంటను అమ్ముకునేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు పి. శంకర్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకయ్య, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నెగంటి రవి, కొండల్‌రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులను గుర్తించి, వారిని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు.

## హైదరాబాద్‌లో నీటి కొరతకు చెక్

(మొదటిపేజీ తరువాయి)

వరించారు. జలమండలికి వచ్చే ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలకు, తాగునీటి సరఫరా నిర్వహణ ఖర్చులకు సరిపోతుందన్నారు. కానీ, వివిధ ప్రభుత్వ విభాగాలు, కార్యాలయాల నుంచి దాదాపు రూ.4,300 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నాయని, కరెంటు బిల్లులకు జలమండలి దాదాపు రూ.5,500 కోట్లు బాకీ పడిందని, రూ.1,847 కోట్లు గతంలో తీసుకున్న అప్పులున్నాయని, దాదాపు రూ.8,800 కోట్ల రెవెన్యూ లోటు ఉందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆదాయ వ్యయాలు ఆశాజనకంగా లేవని, వీటిని అధిగమించేందుకు ఆర్థిక శాఖ సమన్వయంతో తక్షణ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జలమండలి సొంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని, అందుకు అనుసరించాల్సిన విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. 20 వేల లీటర్ల నీటిని సిటీలో ఉచితంగా సరఫరా చేస్తున్నందున, ఇతర కనెక్షన్ల నుంచి రావాల్సిన నల్లా బిల్లు బకాయిలు క్రమం తప్పకుండా వసూలయ్యేలా చూడాలని చెప్పారు. జలమండలి కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులను సమకూర్చుకోవాలని, తక్కువ వడ్డీతో రుణాలు తెచ్చుకునే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అందుకు వీలుగా ప్రాజెక్టు డీపీఆర్‌లు తయారు చేయించాలన్నారు. మంజీరా ద్వారా 1965 నుంచి సిటీలో పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్న పైపు లైన్లకు కాలం చెల్లిందని, దీంతో రిపేర్లు వస్తే దాదాపు పది నుంచి 15 రోజులు నీటి సరఫరా నిలిచిపోతోందని అధికారులు సీఎంకు వివరించారు. పాత లైను వెంబడి ప్రత్యామ్నాయంగా అధునాతన లైన్ నిర్మించేలా కొత్త ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల జీవన్ మిషన్ ద్వారా నిధులు తెచ్చుకునేందుకు వీలుగా ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎండీ అశోక్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్షీణదశకు రూపాయి

(మొదటిపేజీ తరువాయి)

తాకి.. జీవితకాల కనిష్టాన్ని చవి చూసింది. దేశ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న అత్యంత బలహీనమైన గణంకాలు, స్టాక్ మార్కెట్ల వరుస పతనం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, పేలవ ఎగుమతుల తీరు, దిగుమతులు పెరగడం తదితర అంశాలు రూపాయి విలువను క్షీణించేలా చేస్తున్నాయి.

## వామపక్ష రాజకీయాలతోనే దోపిడీ రహిత సమాజం

(మొదటిపేజీ తరువాయి)

కోసమే పని చేస్తున్నాయని తెలిపారు. వామపక్షాలు అధికారంలోకి వచ్చిన దేశాల్లో, రాష్ట్రాల్లో ప్రజల పక్షాన నిర్ణయాలు తీసుకున్న విషయాలను గుర్తు చేశారు. తమిళనాడులో సాంసంగ్ కంపెనీలో కార్మికులు చేసిన సమ్మెకు వామపక్షాలు తప్ప బూర్జువా, పాలక పార్టీలేవీ మద్దతుగా ఉండలేదని తెలిపారు. బీజేపీ తెచ్చిన నల్ల చట్టాలకు నిరసనగా రైతులు ఏడాది పాటు సాగించిన పోరాటాన్ని బీజేపీ, కాంగ్రెస్, ఇతర ప్రాంతీయ పార్టీలు పట్టించుకోకపోగా నిర్బంధాన్ని ప్రయోగించేందుకు దోహదపడ్డాయన్నారు. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నెలకొల్పుతున్నామని ప్రధాని మోడీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశంలో జరిగే అభివృద్ధి, పెరిగే సంపద ఎవరికి దక్కుతుందనే విషయాన్ని పరిశీలించాలన్నారు. ఒక్క శాతంగా ఉన్న పెట్టుబడిదారుల చేతుల్లో 56 శాతం ఆస్తులున్నాయని, 98 శాతంగా ఉన్న ప్రజల వద్ద కేవలం ఒక్క శాతమే మిగిలిందన్నారు. అంబానీ, అదానీ ఆస్తులు వందల రెట్లు పెరిగిపోతుండగా, సామాన్యుల్లో మాత్రం కొనుగోలు శక్తి తగ్గిపోయిందని చెప్పారు. సరళీకృత ఆర్థిక విధానాల్ని కాంగ్రెస్ అమలు చేస్తే బీజేపీ వాటిని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తున్నదని విమర్శించారు. దాని ఫలితంగానే దేశంలో విద్య, వైద్యం, రైల్వేలు, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి మౌలిక రంగాల్ని ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నాయన్నారు. దాంతో దేశంలో అసమానతలు మరింత పెరిగాయని తెలిపారు. శ్రమను గౌరవించడం, మహిళల్ని సమానంగా గౌరవించడం, హక్కులు, అవకాశాలు కల్పించడం వామపక్ష రాజకీయాల ప్రధాన ఉద్దేశమని స్పష్టంచేశారు. బూర్జువా రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా వామపక్ష రాజకీయాలు బలపడేందుకు అసంతృప్తిగా ఉన్న ప్రజల్ని సమీకరించి మరింత సమరశీలంగా ఉద్యమాలు నిర్వహించేందుకు సీపీఐ(ఎం) కృషి చేస్తోందన్నారు. సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర మహాసభలో ఆ దిశగా కర్తవ్యాలను రూపొందిస్తామని తెలిపారు.

**వామపక్ష బావజాలం బలపడాలి: చెరుపల్లి సీతారాములు**

దేశంలో, రాష్ట్రంలో వామపక్ష బావజాలం మరింత బలపడాల్సిన అవసరముందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. ప్రజల కోసం పనిచేస్తూ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న వామపక్షాలను బూర్జువా శక్తులు బలహీన పర్చేందుకు కుట్రలు చేస్తున్నాయని తెలిపారు. పార్టీలు మారుస్తూ అధికారం చెలాయించిన వాళ్లెవ్వరూ ప్రజల గురించి పట్టించుకోలేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం కలిగిన సంగారెడ్డి గడ్డపై జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల్లో వామపక్ష రాజకీయాలు బలపడేందుకు దోహదపడే చర్చలు, నిర్ణయాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఆహ్వాన సంఘం చైర్మెన్ చుక్క రాములు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంపీ రమణ, బాబురావు, ఎం.అడివయ్య సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, రాష్ట్ర నాయకులు జె.మల్లిఖార్జున్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేశం, కె.రాజయ్య, ఎ.మాణిక్, జి.సాయిలు, ఎం.నర్సింహులు, సిద్ధిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలుకు కృషి

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారని చెప్పారు. సమగ్ర కుటుంబ సర్వేపై ప్రజల్లో వ్యతిరేకత రావాలని కొంత మంది కుట్రలు పన్నారన్నారు. సంవత్సర కాలంగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించలేకపోతున్నామని, కానీ బీసీ వర్గాలకు ఇచ్చిన మాటకు కట్టుబడి కులగణన సర్వేలు వంటి కార్యాచరణను బీసీ సంక్షేమ శాఖ ప్రారంభించిందని చెప్పారు.

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణలోని ఏదైనా ఒక విశ్వవిద్యాలయానికి జ్యోతిరావు– సావిత్రిబాయి పూలే దంపతుల పేరు పెట్టే అంశం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. నగరంలో మూడెకరాల స్థలంలో జ్యోతిరావు– సావిత్రిబాయి పూలే దపంతుల విజ్ఞాన కేంద్రం, ఇద్దరి శిలా విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ కమిషన్ సభ్యులు బాలలక్ష్మి, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మెన్ ఇ.అనిల్ కుమార్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్, ఉత్సవ కమిటీ చైర్మెన్ మణిమంజరి తదితరులు పాల్గొన్నారు.



## ఔటర్ టు త్రిబుల్ ఆర్

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు గుర్తించడంతో భూ సేకరణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల రైతులకు నోటీఫికేషన్లు కూడా ఇచ్చింది. రైతుల నుంచి భూములను సేకరించేందుకు ప్రభుత్వం పకడ్బందీగా ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. పరిహారం విషయంలో రైతులతో ప్రభుత్వ పెద్దలు మంతనాలు చేస్తున్నారు. రహదారుల విస్తరణలో భాగంగా ఇప్పటికే అనేక కొత్త రహదారులకు ప్రతిపాదనలు సిద్ధం కాగా.. ప్రస్తుతం ఉన్న రహదారులను కూడా విస్తరిస్తున్నారు. తెలంగాణ సూపర్ గేమ్ ఛేంజర్‌గా హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డును భావిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు సుమారు 40 కి.మీ దూరంతో ఈ ప్రతిపాదిత రీజినల్ రింగు రోడ్డును ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఉత్తర భాగం నిర్మాణానికి కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. భూసేకరణ కోసం గ్రామాల వారీగా భూములు కోల్పోయే వారి వివరాలతో ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫోర్త్ సిటీ (ఫ్యూచర్ సిటీ) మీదుగా ఈ రోడ్డును నిర్మించనున్నారు.

## కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)


పేర్కొన్నది. ఫార్ములా–ఈ కార్ రేసుకు సంబంధించి రూ.55 కోట్లు విదేశీ కంపెనీకి ఎలా బదిలీ చేశారు? బదిలీ చేయాలని అప్పటి హెచ్ఎండీఏ కమిషనర్ అరవింద్ కుమార్‌ను ఆదేశించారా? ఈ డబ్బులను బదిలీ చేయటానికి ప్రభుత్వానుమతిని కానీ, క్యాబినెట్ అనుమతిని కానీ తీసుకున్నారా? ఫార్ములా–ఈ కార్ రేసింగ్ నిర్వహణకు మీకున్న అధికారాలు ఏమిటి? మొదలైన కోణాల్లో ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను విచారించే అవకాశమున్నదని తెలుస్తున్నది. మరోవైపు, 7న ఇదే కేసుకు సంబంధించి తమ ఎదుట విచారణకు హాజరు కావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఇప్పటికే కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఈ కేసులో తాను దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేయటమేగాక.. తీర్పును వెలువరించేంత వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయొద్దని ఏసీబీని ఆదేశించింది. అయితే, విచారణ కోసం ఏసీబీ, ఈడీల ఎదుట కేటీఆర్ హాజరవుతారా? అనే అనుమానాలు కూడా మరోపక్క వ్యక్తమవుతున్నాయి. క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో తీర్పు రిజర్వ్ చేసిన నేపథ్యంలో దాని ఆధారంగా ఏసీబీ, ఈడీల ఎదుట తాను హాజరు కాకుండా ఏవేని ప్రత్యామ్నాయాలున్నాయా అనే విషయంపై కేటీఆర్ న్యాయ నిపుణులతో సంప్రదిస్తున్నట్టు తెలిసింది.

క్యాలెండర్‌లో ఏడాది మారింది. కానీ గ్రౌండ్‌లో మనోళ్ల ఆట మారలేదు. సిడ్నీ పచ్చిక పిచ్‌పై టీమ్ ఇండియా బ్యాటర్లు చేతులెత్తేశారు. ఆసీస్ పేస్ ప్రతాపానికి దాసోహం అయ్యారు. రిషబ్ పంత్ (40), రవీంద్ర జడేజా (26) మినహా జట్టులో మరో బ్యాటర్ పరుగుల వేటలో రాణించలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ లేకుండానే సిడ్నీ సవాల్‌కు సిద్ధమైన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు కుప్పకూలింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 9/1తో ఆడుతోంది.

# అదే తడబాటు

- మారని భారత బ్యాటర్ల తీరు
- 185కే తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌట్
- ఆదుకున్న రిషబ్ పంత్, జడేజా
- ఆసీస్‌తో సిడ్నీ టెస్టు తొలి రోజు


స్లిప్స్‌లో విరాట్ కోహ్లి (17) క్యాచ్ అందుకున్న ఆసీస్ ఫీల్డర్లు

నవతెలంగాణ-సిడ్నీ

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆఖరు టెస్టు తొలి రోజు టీమ్ ఇండియా చతికిల పడింది. పేసర్లకు అనుకూలించే పచ్చిక పిచ్‌పై తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 185 పరుగులకే కుప్పకూలింది. వికెట్ కీపర్ రిషబ్ పంత్ (40, 98 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (26, 95 బంతుల్లో 3 ఫోర్లు), కెప్టెన్, టెయిలెండర్ జశ్‌ప్రీత్ బుమ్రా (22, 17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) భారత్‌కు ఆ మాత్రం స్కోరు అందించారు. విరాట్ కోహ్లి (17), కెఎల్ రాహుల్ (4), యశస్వి జైస్వాల్ (10), నితీశ్ కుమార్ రెడ్డి (0), వాషింగ్టన్ సుందర్ (14), శుభ్‌మన్ గిల్ (20) నిరాశపరిచారు. ఆసీస్ పేసర్లు స్కాట్ బొలాండ్ (4/31), మిచెల్ స్టార్క్ (3/49) నిప్పులు చెరిగారు. జశ్‌ప్రీత్ బుమ్రా (1/7) మెరుపులతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 9 పరుగులకే ఓ వికెట్ కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్‌లో 176 పరుగుల లోటుతో ఆస్ట్రేలియా రెండో రోజు బ్యాటింగ్‌కు రానుంది.

### టాప్ విఫలం

టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆశించిన ఆరంభం లభించలేదు. ఓపెనర్ కెఎల్ రాహుల్ (4) ఆదిలోనే వికెట్ కోల్పోయాడు. ఫామ్‌లో ఉన్న యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (10)ను బొలాండ్ స్లిప్స్‌లో పట్టేశాడు. 17 పరుగులకే భారత్ ఓపెనర్లను కోల్పోయింది. శుభ్‌మన్ గిల్ (20, 64 బంతుల్లో 2 ఫోర్లు), విరాట్ కోహ్లి (17, 69 బంతుల్లో) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే పనిలో పడ్డారు. ఆసీస్ పేసర్లను ఆచితూచి ఎదుర్కొన్న ఈ జోడీ.. దూకుడుగా ఆడే ప్రయత్నం చేయలేదు. నాథన్ లయాన్ మాయజాలంతో గిల్ డిఫెన్స్‌ను ఛేదించగా.. విరాట్ కోహ్లిని బొలాండ్ స్లిప్స్‌లో సాగనంపాడు. గతంలో మాదిరిగానే కోహ్లి స్లిప్స్‌లో క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. నిజానికి, ఎదుర్కొన్న తొలి బంతికే కోహ్లి అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. స్లిప్స్‌లో క్యాచ్‌ను ఆసీస్ జారవిడటంతో కోహ్లి బతికిపోయాడు. ఒక్కో పరుగే జోడిస్తూ కోహ్లి నిలదొక్కుకునే ప్రయత్నంలో ఉండగా.. బొలాండ్ ఊరించే బంతితో వికెట్ పడగొట్టాడు. అప్పటికి భారత్ స్కోరు 31.3 ఓవర్లలో 72/4.

### పంత్, జడేజా ప్రతిఘటన

శుభ్‌మన్ గిల్‌తో కలిసి 40 పరుగుల భాగస్వామ్యం నమోదు చేసిన విరాట్ కోహ్లి.. లంచ్ విరామం తర్వాత రిషబ్ పంత్‌తో కలిసి 15 పరుగులు జోడించాడు. ఆ తర్వాత పంత్‌తో జతకట్టిన రవీంద్ర జడేజా (26) ఆసీస్ బౌలర్లకు వికెట్ నిరాకరించాడు. పంత్, జడేజా జోడీ 25 ఓవర్ల పాటు ప్రతిఘటించింది. పంత్ సహజశైలికి భిన్నంగా బ్యాటింగ్ చేశాడు. 98 బంతుల్లో మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 40 పరుగులే చేశాడు. జడేజా సైతం వికెట్‌కే ప్రాధాన్యత ఇచ్చాడు. 95 బంతుల్లో మూడు ఫోర్లతో 26 పరుగులే చేశాడు. టీ విరామ సమయానికి భారత్ నాలుగు వికెట్లే కోల్పోయింది.



రిషబ్ పంత్ (40) గాయానికి చికిత్స చేస్తున్న ఫిజియో, పక్కన జడేజా (26)

లోయర్ ఆర్డర్ ఫామ్‌లో ఉండటంతో భారత్ మెరుగైన స్కోరు చేయగలదమే దీమా మొదలైంది.

### పేక మేడలా పడ్డారు

మెల్‌బోర్న్ టెస్టులో భారత్ డ్రా చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ చివరి సెషన్లో ఏకంగా ఏడు వికెట్లు చేజార్చుకుని కోరి మీరీ ఓటమి చెందింది. సిడ్నీలోనూ అదే కథ పునరావృతం అయ్యింది. చివరి ఆరు వికెట్లను భారత్ 22.2 ఓవర్లలోనే కోల్పోయింది. పంత్ నిష్క్రమణతో మొదలైన పతనం.. ఎక్కడా ఆగలేదు. నితీశ్ కుమార్ రెడ్డి (0), వాషింగ్టన్ సుందర్ (14), ప్రసిద్ కృష్ణ (3) నిరాశపరిచారు. టెయిలెండర్లలో కెప్టెన్ జశ్‌ప్రీత్ బుమ్రా (22, 17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) విలువైన పరుగులు జోడించాడు. మహ్మద్ సిరాజ్ (3 నాటౌట్) అజేయంగా నిలిచాడు. 72.2 ఓవర్లలో భారత్ 185 పరుగులకు కుప్పకూలింది. ఆస్ట్రేలియా బౌలర్లలో స్కాట్ బొలాండ్ (4/31), మిచెల్ స్టార్క్ (3/49) రాణించారు.

### బుమ్రా మొదలెట్టాడు

బ్యాట్‌తో ఆదుకున్న జశ్‌ప్రీత్ బుమ్రా.. బంతితో వేట మొదలెట్టాడు. ఇన్నింగ్స్ మూడో ఓవర్లోనే ఆసీస్ ఓపెనర్‌ను పెవిలియన్‌కు చేర్చాడు. తొలి రోజు ఆటలో చివరి బంతికి ఉస్మాన్ ఖవాజా (2) రెండో స్లిప్స్‌లో దొరకబుచ్చుకున్నాడు. దీంతో 9 పరుగులకే ఆసీస్ తొలి వికెట్ కోల్పోయింది. యువ ఓపెనర్ శామ్ కాన్‌స్టాస్ (7 నాటౌట్, 8 బంతుల్లో 1 ఫోర్) ఓ ఫోర్‌తో దూకుడు చూపించాడు. తొలి రోజు 3 ఓవర్లలో ఆస్ట్రేలియా 9 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో మరో 176 పరుగుల వెనుకంజలో నిలిచింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి శామ్ కాన్‌స్టాస్ అజేయంగా నిలిచాడు. తొలి రోజు 75.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యపడింది.

### స్కోరు వివరాలు

**భారత్ తొలి ఇన్నింగ్స్ :** యశస్వి జైస్వాల్ (సి) వెబ్‌స్టర్ (బి) బొలాండ్ 10, కెఎల్ రాహుల్ (సి) కాన్‌స్టాస్ (బి) స్టార్క్ 4, శుభ్‌మన్ గిల్ (సి) స్మిత్ (బి) లయాన్ 20, విరాట్ కోహ్లి (సి) వెబ్‌స్టర్ (బి) బొలాండ్ 17, రిషబ్ పంత (సి) కమిన్స్ (బి) బొలాండ్ 40, రవీంద్ర జడేజా (ఎల్బీ) స్టార్క్ 26, నితీశ్ కుమార్ రెడ్డి (సి) స్మిత్ (బి) బొలాండ్ 0, వాషింగ్టన్ సుందర్ (సి) అలెక్స్ (బి) కమిన్స్ 14, ప్రసిద్ కృష్ణ (సి) కాన్‌స్టాస్ (బి) స్టార్క్ 3, జశ్‌ప్రీత్ బుమ్రా నాటౌట్ 3, ఎక్స్‌ట్రాలు : 26, **మొత్తం : (72.2 ఓవర్లలో ఆలౌట్) 185.**

**వికెట్ల పతనం :** 1-11, 2-17, 3-57, 4-72, 5-120, 6-120, 7-134, 8-148, 9-168, 10-185.

**బౌలింగ్ :** మిచెల్ స్టార్క్ 18-5-49-3, పాట్ కమిన్స్ 15.2-4-37-2, స్కాట్ బొలాండ్ 20-8-31-4, బ్యూ వెబ్‌స్టర్ 13-4-29-0, నాథన్ లయాన్ 6-2-19-1.

**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ :** శామ్ కాన్‌స్టాస్ నాటౌట్ 7, ఉస్మాన్ ఖవాజా (సి) రాహుల్ (బి) బుమ్రా 2, ఎక్స్‌ట్రాలు : 0, **మొత్తం : (3 ఓవర్లలో ఓ వికెట్) 9.**

**వికెట్ల పతనం :** 1-9.

**బౌలింగ్ :** జశ్‌ప్రీత్ బుమ్రా 2-0-7-1, మహ్మద్ సిరాజ్ 1-0-2-0.



## హిట్‌మ్యాన్‌పై వేటు

ఊహించిందే జరిగింది. చీఫ్ కోచ్ గౌతం గంభీర్ కఠిన నిర్ణయం తీసుకున్నాడు. ఫామ్‌లో లేని కెప్టెన్ రోహిత్ శర్మపై వేటు పడింది. సిడ్నీ టెస్టుకు రోహిత్ శర్మను పక్కనపెట్టిన గంభీర్.. బుమ్రాకు కెప్టెన్సీ పగ్గాలు అందించాడు. టాస్‌కు ముందు ఇరు జట్లు పంచుకున్న టీమ్ షీట్‌లో సైతం రోహిత్ శర్మ పేరు కనిపించలేదు. సాధారణంగా, జట్టులోని అందరి పేర్లను టీమ్ షీట్‌లో పొందుపరుస్తారు. రోహిత్ శర్మ పేరు లేకపోవటంతో.. అతడు చివరి టెస్టు జట్టులో అధికారికంగా భాగం కాదు. భారత్ తర్వాత టెస్టు ఈ ఏడాది జూన్‌లో ఆడాల్సి ఉంది. దీంతో రోహిత్ శర్మ ఐదు రోజుల ఆటలో ఆఖరు మ్యాచ్ ఆడేసినట్టేనని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

తాజా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో రోహిత్ శర్మ తేలిపోయాడు. పెర్త్ టెస్టులో ఆడని రోహిత్.. అడిలైడ్‌లో నాయకత్వ బాధ్యతలు తీసుకున్నాడు. బుమ్రా సారథ్యంలో భారత్.. రోహిత్ కెప్టెన్సీలో కంటే మెరుగ్గా కనిపించిందని వ్యాఖ్యాతలు సైతం విమర్శలు చేశారు. చీఫ్ కోచ్ గౌతం గంభీర్ వ్యూహం ప్రకారం జట్టు ప్రణాళికలను రోహిత్ మైదానంలో అమలు చేయలేదని మరో ఆరోపణ. మూడు టెస్టుల్లో కలిపి 31 పరుగులే చేసిన రోహిత్ శర్మ తీవ్ర ఒత్తిడిలో పడ్డాడు. సిడ్నీ టెస్టు ముంగిట ప్రాక్టీస్ సెషన్లోనూ సాధన చేయలేదు. భారత్‌కు వైట్‌బాల్‌లో చిరస్మరణీయ విజయాలు అందించిన హిట్‌మ్యాన్‌ను జట్టు మేనేజ్‌మెంట్ మరింత మెరుగైన రీతిలో చూడాల్సిందని మాజీలు అభిప్రాయపడ్డారు.

## అమెరికా క్రికెట్ బోర్డు చైర్మెన్‌ను సత్కరించిన టీడీసీఏ

**తెలంగాణ క్రికెట్ అభివృద్ధికి అందరూ సహకరించాలి**
**టీడీసీఏ వ్యవస్థాపక అధ్యక్షులు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి**

నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధికి అందరూ సహకరించాలని, గ్రామీణ క్రికెటర్లకు సైతం జాతీయ స్థాయిలో అవకాశాలు దక్కేందుకు తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘానికి (టీడీసీఏ) బీసీసీఐ గుర్తింపు ఇవ్వాలని టీడీసీఏ వ్యవస్థాపక అధ్యక్షులు, శాట్ మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అమెరికా క్రికెట్ బోర్డు చైర్మెన్ పిసికె వేణు రెడ్డిని శాట్ చైర్మెన్ కే. శివసేనా రెడ్డితో కలిసి టీడీసీఏ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా టీడీసీఏ 2025 క్యాలెండర్, అండర్-16 టోర్నమెంట్ ట్రోఫీలను ఆవిష్కరించారు. ' తెలంగాణ బిడ్డ అగ్రరాజ్యం అమెరికా క్రికెట్ బోర్డు చైర్మెన్‌గా ఎదగటం గర్వించదగిన విషయం. గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివద్ధి కోసం టీడీసీఏ కష్టపడుతోంది. ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని' శివసేనా రెడ్డి తెలిపారు. 'అమెరికాలో క్రికెట్‌ను ఐసీసీ గత ఐదారేండ్లలోనే గుర్తించింది. అంతకుముందు, స్వచ్ఛందంగానే ఆట కోసం పని చేశాం. నేను చైర్మెన్‌గా ఉన్న సమయంలోనే అమెరికా జట్టు ఐసీసీ టీ20 వరల్డ్‌కప్‌కు ఆతిథ్యం ఇవ్వటం, రానున్న ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించటం సంతృప్తి అందించాయి. తెలంగాణలో గ్రామీణ క్రికెట్ పురోగతి సాధించాలని కోరుకుంటున్నాను' అని వేణు రెడ్డి పిసికె ఆకాంక్షించారు. ఎస్‌జెఎఫ్ చైర్మెన్ రామిరెడ్డి, పెటా టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రాఘవరెడ్డి, సురేందర్ రెడ్డి, టీఎస్టీఓ రాష్ట్ర కార్యదర్శి ముజీబ్, సినీ నటుడు శ్రీధర్, ప్రవాస తెలంగాణీయులు, తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) జిల్లా కన్వీనర్లు, క్రికెటర్లు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


వేణు రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న శాట్ ప్రస్తుత, మాజీ చైర్మెన్‌లు శివసేనా, అల్లీపురం

## కేటీఆర్ పాయె..శ్రీధర్ బాబు వచ్చె!

**తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడిగా ఐటీ శాఖ మంత్రి**

నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం నూతన అధ్యక్షుడిగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికను బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు పుల్లెల గోపీచంద్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఓ సమావేశంలో ప్రకటించారు. ఐటీ శాఖ మాజీ మంత్రి కె. తారక రామారావు పదవీ కాలం 2026 వరకు ఉన్నప్పటికీ.. అధ్యక్ష బాధ్యతల నుంచి ఆయన అనూహ్యంగా తప్పుకున్నారు. నూతన అధ్యక్షుడు శ్రీధర్ బాబును తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం కార్యవర్గ సభ్యులు సన్మానించారు. ' రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో పని చేస్తోంది. ఒలింపిక్స్‌లో పతకాల సాధనే లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తున్నాం. ప్రతిభావంతులైన గ్రామీణ క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రయత్నం చేస్తామని' శ్రీధర్ బాబు తెలిపారు.


మంత్రి శ్రీధర్ బాబుతో గోపీచంద్

## పంజాబ్ ఫటాఫట్

**హైదరాబాద్‌పై రికార్డు 426 పరుగులు**

**అహ్మదాబాద్ :** విజయ్ హజారే ట్రోఫీలో పంజాబ్ ధనాధన్ కొనసాగుతుంది. ఈ టోర్నీలో రెండు సార్లు 400 ప్లస్ పరుగులు చేసిన జట్టుగా పంజాబ్ నిలిచింది. తొలుత సౌరాష్ట్రపై 424/5 పరుగులు చేసిన పంజాబ్.. శుక్రవారం హైదరాబాద్ 426/4 పరుగులు బాదింది. ప్రభుసిమ్రన్ సింగ్ (137), అభిషేక్ శర్మ (93), రమణ్‌దీప్ సింగ్ (80), అన్మోల్‌ప్రీత్ సింగ్ (46), నేహల్ (35 నాటౌట్) దంచికొట్టారు. ఛేదనలో హైదరాబాద్ 47.5 ఓవర్లలో 346 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ రెడ్డి (111), తనయ్ (74) రాణించారు. గ్రూప్-సిలో ఆరు మ్యాచుల్లో హైదరాబాద్‌కు ఇది మూడో ఓటమి. ఆదివారం జరిగే ఆఖరు మ్యాచ్‌లో అరుణాచల్ ప్రదేశ్‌తో హైదరాబాద్ తలపడనుంది.

## క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్..


మీనాక్షి చౌదరి

వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబోలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఈనెల 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా హీరోయిన్ మీనాక్షి చౌదరి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఈ సినిమాలో పార్ట్ కావడం చాలా హ్యాపీగా ఉంది. ఫస్ట్ టైమ్ కామెడీ జోనర్ ట్రై చేశాను. కామెడీ స్పేస్‌లో కాప్ రోల్ ప్లే చేయడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. అలాగే ఫస్ట్ టైమ్ ఇందులో యాక్షన్ సీక్వెన్స్‌లు చేశాను. కాప్ రోల్ చేయాలనేది నా డ్రీమ్. లక్కీగా నా కెరీర్ బిగినింగ్‌లోనే రావడం సంతోషంగా ఉంది.
- వెంకటేష్‌తో వర్క్ చేయడం సూపర్ ఎక్స్‌పీరియన్స్. ఆయన కామెడీ టైమింగ్ అద్భుతం. అనిల్, వెంకీది సూపర్ హిట్ కాంబినేషన్. ఐశ్వర్య రాజేష్‌తో కలసి స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా బాగుంది. నేను యాక్ట్ చేసిన సినిమాలో అన్ని పాటలు సూపర్ హిట్ కావడం ఇదే తొలిసారి. భీమ్స్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. మ్యూజిక్ లాగానే సినిమా కూడా బ్లాక్‌బస్టర్ అవుతుంది.
- ఈ సినిమా కోసం డిఫరెంట్ పబ్లిసిటీ చేస్తున్నాం. ఇందులో భాగంగా అన్ స్టాపబుల్‌లో బాలయ్యని కలవడం చాలా హ్యాపీగా ఉంది. బాలయ్య.. వన్ అండ్ ఓన్లీ ఓజీ..(నవ్వుతూ) ఎప్పుడూ యాక్టీవ్‌గా, ఎనర్జిటిక్‌గా ఉంటారు. చాలా ఎమోషనల్ అండ్ వండర్ ఫుల్ పర్సన్.
- గత సంక్రాంతికి 'గుంటూరు కారం రిలీజ్' అయ్యింది. ఇప్పుడు ఈ సంక్రాంతికి ఈ సినిమా రిలీజ్ కావడం చాలా ఆనందంగా ఉంది. ఈ జర్నీ ఒక డ్రీమ్‌లా ఉంది. నన్ను నమ్మి ఇంత మంచి అవకాశాల్ని ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు.
- నవీన్ పోలిశెట్టితో ఒక సినిమా చేస్తున్నాను. మరో రెండు సినిమాలు మేకర్స్ అనౌన్స్ చేస్తారు. ఈ ఏడాది కూడా వండర్ ఫుల్‌గా ఉంటుందని ఆశిస్తున్నాను. ఓ నటిగా నన్ను నేను నిరూపించుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాను. ఇంకా మంచి పాత్రలతో అలరిస్తా.


## 'రైజ్ ఆఫ్ ది డ్రాగన్'..

ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన బ్లాక్ బస్టర్ చిత్రం 'లవ్ టుడే'. ఈ చిత్రంలో హీరోగా నటిస్తూనే ప్రదీప్ రంగనాథన్ సినిమాను డైరెక్ట్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి ఈ హిట్ కాంబినేషన్ చేతులు కలిపి రూపొందిస్తున్న చిత్రమే 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'.

ఈ చిత్రానికి కల్పాతి ఎస్.అఘోరం, కల్పాతి ఎస్. గణేష్, కల్పాతి ఎస్.సురేష్ నిర్మాతలు.

ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తోన్న ఈ మూవీని 'ఓరి దేవుడా' ఫేమ్ అశ్వత్ మారిముత్తు డైరెక్ట్ చేస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో రూపొందుతోన్న 26వ సినిమా ఇది. ఈ సినిమా అనౌన్స్‌మెంట్‌కు సంబంధించిన వీడియోకు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి 'రైజ్ ఆఫ్ డ్రాగన్' అనే ఎనర్జిటిక్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేయటం అభిమానుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. లియోన్ జేమ్స్ సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ మూవీలోని పాటను రామజోగయ్య శాస్త్రి రాయగా, లియోన్ జేమ్స్, నదీషా థామస్ పాడారు.

దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ తొలిసారి ఈ పాటలో డాన్స్ చేయటం విశేషం. హీరో ప్రదీప్ రంగనాథన్‌తో కలిసి ఆయన చేసిన డాన్స్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తోంది. ఈ ఎమోషనల్ మూవీకి అర్చనా కల్పాతి క్రియేట్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తుంటే, ఐశ్వర్యా కల్పాతి అసోసియేట్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు.


ప్రదీప్ రంగనాథన్, గౌతమ్ వాసుదేవ్ మీనన్

## నవచిత్రం

## 'ఓ వెన్నెల.. నా రాణిలా..'


అదితి శంకర్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్ కాంబోలో రూపొందుతున్న చిత్రం 'భైరవం'. అదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్లై కథానాయికలుగా నటిస్తున్నారు. విజయ్ కనకమేడల దర్శకుడు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు.

ఈ చిత్రాన్ని పెన్ స్టూడియోస్‌పై డాక్టర్ జయంతిలాల్ గదా సమర్పిస్తున్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. హీరో నాని ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'ఓ వెన్నెల..' సాంగ్ లాంచ్ చేశారు.

శ్రీచరణ్ పాకాల వైబ్రెంట్ ఎనర్జిటిక్ మెలోడీని కంపోజ్ చేశారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ రగ్గడ్ రస్టిక్ అవతార్‌లో కనిపించారు. వెన్నెల పాత్రలో అదితి పల్లెటూరి అమ్మాయిగా ఆకట్టుకుంది. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా కుదిరింది. అనురాగ్ కులకర్ణి, యామిని ఘంటసాల ఫుల్ ఎనర్జీతో పాడారు. తిరుపతి జవాను అద్భుతమైన లిరిక్స్ అందించారు.

## దశావతార ఆలయం నేపథ్యంలో..

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తున్న ఆయన 12వ చిత్రం 35% షూటింగ్ పూర్తి చేసుకుంది. నూతన దర్శకుడు లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మూన్‌షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై మహేష్ చందు నిర్మిస్తున్నారు. శివన్ రామకృష్ణ సమర్పిస్తున్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన క్యారెక్టర్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ కల్ట్ థ్రిల్లర్ 400 ఏళ్ల నాటి దశావతార ఆలయం నేపథ్యంలో ఉంటుంది. ఇందులో సంయుక్త ఫీమేల్ లీడ్‌గా నటిస్తున్నారు.


బెల్లంకొండ సాయి శ్రీనివాస్

## క్యారెక్టర్‌ని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'దిల్ రూబా'. రుక్సర్ థిల్లాన్ హీరోయిన్. శివమ్ సెల్యులాయిడ్స్, మ్యూజిక్ లేబుల్ సారెగమ నిర్మాణ సంస్థ ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకుడు. ఈ సినిమా ఫిబ్రవరిలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. శుక్రవారం ఈ సినిమా టీజర్ రిలీజ్ ఈవెంట్ జరిగింది. కో ప్రొడ్యూసర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ, 'లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. అల్లు అర్జున్‌కు 'ఆర్య' మూవీలా కిరణ్ అబ్బవరంకు 'దిల్ రూబా' అవుతుంది' అని అన్నారు. 'టీజర్‌లో మీరు చూసింది కొంతే. నెక్ట్స్ ట్రైలర్ వస్తుంది' అని ప్రొడ్యూసర్ రవి చెప్పారు. డైరెక్టర్ విశ్వకరుణ్ మాట్లాడుతూ, మనందరి జీవితాల్లోని ప్రేమను స్ఫూర్తిగా తీసుకుని ఈ మూవీ చేశా. మీరంతా ఈ లవ్ స్టోరీని థియేటర్స్‌లో ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు. 'ఈ సినిమాలో నేను చేసిన సిద్ధు, సిద్ధార్థ్ క్యారెక్టర్ చాలా స్పెషల్‌గా హార్ట్ హిట్టింగ్‌గా ఉంటుంది. తను నమ్మిన సిద్ధాంతం కోసం ప్రేమతో సహా ఏ విషయంలోనైనా వెనక అడుగు వేయడు. క్యారెక్టర్‌ను నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ మా సినిమా నచ్చుతుంది' అని హీరో కిరణ్ అబ్బవరం చెప్పారు.


కిరణ్ అబ్బవరం

## నయా పాయింట్‌తో 'డార్క్ చాక్లెట్'


విశ్వదేవ్ రాచకొండ, బిందు మాధవి

రానా దగ్గుబాటి మూడవ సారి వాల్టెయిర్ ప్రొడక్షన్స్‌తో చేతులు కలిపారు. 'పరేషాన్, 35 చిన్న కథ కాదు' చిత్రాల విజయం తర్వాత రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా, వాల్టెయిర్ ప్రొడక్షన్స్‌తో కలిసి 'డార్క్ చాక్లెట్' చిత్రాన్ని అందిస్తున్నారు.

విశ్వదేవ్ రాచకొండ, బిందు మాధవి లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. శశాంక్ శ్రీవాస్తవయ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ శుక్రవారం విడుదలైంది. 'జోనర్ అడగొద్దు, మాక్కూడా తెలీదు' అని పోస్టర్ పై రాయడం ఈ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది.

## మెప్పించే 'బార్బరిక్'



డైరెక్టర్ మారుతి సమర్పకుడిగా, విజయ్‌పాల్ రెడ్డి అడిదల నిర్మిస్తున్న 'బార్బరిక్' మూవీకి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్నారు.

వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో సత్యరాజ్, వశిష్ట ఎన్ సింహా, సాంచి రాయ్, ఉదయ భాను, సత్యం రాజేష్, క్రాంతి కిరణ్ తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు.

తాజాగా ఈ చిత్ర టీజర్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ,'మోహన్, రాజేష్ చాలా కాన్ఫిడెన్స్‌తో సినిమాను స్టార్ట్ చేశారు. విజయ్ ఈ సినిమా కోసం చాలా ఖర్చు పెట్టారు. ఆయనతో కలిసి జీతెలుగుతో మరో సినిమాను చేయబోతున్నాను. ఇన్ఫ్యూజన్ బ్యాండ్ ఈ చిత్రానికి మంచి సంగీతాన్ని ఇచ్చారు. ఈ మూవీ చాలా కొత్తగా ఉంటుంది. మైథలాజికల్ పాయింట్‌లో ఉన్న పాత్ర ప్రజెంట్ జనరేషన్‌కి వస్తే ఎలా ఉంటుందో చూపించారు. ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుంది' అని తెలిపారు.

'ఇలాంటి పెద్ద సినిమాను చేస్తానని నేను అనుకోలేదు. సినిమా అద్భుతంగా ఉండబోతోంది' అని నిర్మాత విజయ్ పాల్ రెడ్డి అడిదల చెప్పారు. దర్శకుడు మోహన్ శ్రీవత్స మాట్లాడుతూ,'టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతంగా రెస్పాన్స్ వచ్చింది. సినిమాకి కూడా అంతే రెస్పాన్స్ వస్తుందని ఆశిస్తున్నాను. ఈ సినిమాని మా నిర్మాత విజయ్ ఎంతో ప్యాషనేట్‌గా, ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. ఇందులోని ప్రతి అంశమూ ప్రేక్షకుల్ని ఎట్రాక్ట్ చేస్తుంది' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

# అదానీకి ఏపీ 'విద్యుత్ శాఖ భవన్'!

- విశాఖ నడిబొడ్డున 2.20 ఎకరాలపై కార్పొరేట్ కన్ను
- 20 అంతస్తుల భవన నిర్మాణానికి రంగం సిద్ధం
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న టిడిపి కూటమి ప్రభుత్వం



విశాఖలోని 'విద్యుత్‌శాఖ భవన్' ఇదే

విశాఖ: అదాని స్మార్ట్ మీటర్ల వ్యాపారానికి విశాఖను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అడ్డాగా మార్చేందుకు రంగం సిద్ధం చేసింది. నగరం నడిబొడ్డునగల గ్రీన్‌పార్క్ హోటల్ ఎదురుగా రోడ్డు పక్కనగల సుమారు 2.20 ఎకరాల స్థలంలోని ఏపి ఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ సర్కిల్ ఆఫీసర్ కార్యాలయ భవన సముదాయం (విద్యుత్‌శాఖ భవన్)ను అదానికి కట్టబెట్టేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నగరం నడిబొడ్డునగల ఈ స్థలం విలువ సుమారు రూ.100 కోట్లకుపైగా ఉంటుంది. ప్రస్తుతమున్న ఇక్కడ ఉన్న రెండు అంతస్తుల భవనంలో విద్యుత్ శాఖ కార్యకలాపాలు చేపడుతున్నారు, ఈ భవనాన్ని నేలమట్టం చేసి సుమారు 20 అంతస్తుల (20 స్టోరీడ్) భవన సముదాయాన్ని అదాని నిర్మించనున్నారు అందులో ఒకటో, రెండో ఫ్లోర్లు ఎపిఇపిడిసిఎల్‌కు ఇచ్చి, మిగిలిన అన్ని ఫ్లోర్లనూ స్వాధీనం చేసుకోనున్నారు. అదాని స్మార్ట్ మీటర్లు, ఇతర కార్యకలాలకు ఈ భవనాలను వినియోగించుకోనున్నారు. ఈ ఒప్పందం పట్ల విద్యుత్ సర్కిల్ కార్యాలయ ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అదానికి డెవలప్‌మెంట్‌కు ఈ భవన సముదాయాలన్నింటినీ ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వీరు బాహాటంగా చెబుతున్నారు. కొత్తగా కట్టనున్న భవనంలో ఇపిడిసిఎల్ ఒకటో, రెండో ఫ్లోర్లు ఇచ్చే అవకాశముందని, లేకపోతే బీచ్‌రోడ్డు సమీపాన సాగర్ నగర్‌లో నిర్మాణం జరుగుతోన్న విద్యుత్ భవన్‌లోకి తమను మార్చే అవకాశముందని అంటున్నారు. అదానితో రాష్ట్రంలో గత జగన్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల రద్దు కోసం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాడేందుకు పిలుపునిచ్చిన చంద్రబాబు, లోకేష్, జనసేన అధినేత పవన్... 2024లో అధికారంలోకి వచ్చాక అదానికి సాగిలపడుతున్నారు.

**చకాచకా ఫైళ్ల కదలిక**

రాష్ట్రంలో కీలక నగరంగా విశాఖ ఉంది. తూర్పు తీరంలో రెండు పోర్టులు, నౌకా నిర్మాణ కేంద్రం, స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ పరిశ్రమలకు నిలయంగా ఉన్నందున విశాఖను అదాని వ్యాపార విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంగా భావిస్తున్నాయి.

అదానికి రాష్ట్రాన్ని కట్టబెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వంతోనూ చకాచకా ఫైళ్లు కదులుతున్నాయి.

**స్మార్ట్ మీటర్ల వివరాలు**

రాష్ట్ర ప్రభుత్వంతో కాంట్రాక్టు నేపథ్యంలో అదాని స్మార్ట్ మీటర్లు ఎపిఇపిడిసిఎల్ పరిధిలో 72 లక్షలు, ఎపిఎస్‌పిడిసిఎల్‌లో 73 లక్షలు, ఎపిసిపిడిసిఎల్ పరిధిలో 52 లక్షలు రానున్నాయి. వీటి ఏర్పాటును రైతులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విద్యుత్ ఛార్జీల భారంతో ప్రజలు తీవ్ర అవస్థల పాలవుతున్నారు. స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని తమిళనాడు ప్రభుత్వం రద్దు చేసుకున్నా, మన రాష్ట్రం మాత్రం కొనసాగిస్తోంది.



## శభాష్ రెడ్ వాలంటీర్ ఆదిత్య !

- 140 కిమీ సైకిల్ యాత్ర
- 14 ఏండ్ల యువ కామ్రేడ్‌కు అభినందనలు

చెన్నయ్ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తమిళనాడు రాష్ట్ర 24వ మహాసభ విజుపురంలో శుక్రవారం ప్రారంభమైంది. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ ఈ మహాసభను ప్రారంభించారు. మహాసభ తొలి రోజున 14 ఏండ్ల ఆదిత్య ప్రధాన ఆకర్షణగా నిలిచారు. మహాసభ నిర్వహణలో స్వచ్ఛందంగా సేవలందించేందుకు ఆదిత్య ఏకంగా 140 కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేశారు. తంబారం నుంచి మహాసభ వేదికైన విజుపురం వరకు అతను ఈ యాత్ర సాగించారు. మహాసభలో సేవలందించేందుకు అంత దూరం నుంచి సైకిల్ పై వచ్చిన యువ కామ్రేడ్ ఆదిత్యను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, కోఆర్డినేటర్ ప్రకాష్ కరత్, మరో పొలిట్‌బ్యూరో సభ్యులు జి రామకృష్ణన్ కూడా పాల్గొన్నారు. తొలుత మహాసభ ప్రారంభ సూచికగా ప్రతినిధుల విప్లవ నినాదాల మధ్యన సీనియర్ నేత ఎస్‌ఎ పెరుమాల్ ఎర్రజెండాను ఆవిష్కరించారు. ప్రారంభ సెషన్‌కు కేంద్ర కమిటీ సభ్యులు పి షణ్ముగం అధ్యక్షత వహించగా..మరో కేంద్ర కమిటీ సభ్యులు యు వాసుకి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సీపీఐ, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శులు ఆర్ ముథురాసన్, పి అసైతంబీ సౌహార్థ సందేశమిచ్చారు. తదనంతరం జరిగిన ప్రతినిధుల సెషన్‌లో సీపీఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి కె బాలకృష్ణన్ నివేదిక ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 500 మంది ప్రతినిధులు మహాసభకు హాజరయ్యారు.



తెలంగాణ బయో డైవర్సిటీ బోర్డు క్యాలెండర్‌ను శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్(హెచ్‌ఓఎఫ్‌ఎఫ్) ఆర్.ఎం.డోబ్రియాల్, తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు చైర్మెన్ కాళిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వెబ్‌సైట్‌లో సూపర్‌వైజర్ అభ్యర్థుల హాల్‌టికెట్లు

- 6,7 తేదీల్లో ఆన్‌లైన్‌లో రాతపరీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (సూపర్‌వైజర్) గ్రేడ్-1 పోస్టులకు ఈనెల ఆరు, ఏడు తేదీల్లో ఆన్‌లైన్‌లో రాతపరీక్ష జరగనుంది. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు హాల్‌టికెట్లను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్ష (సీబీఆర్టీ) విధానంలో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 181 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (సూపర్‌వైజర్) గ్రేడ్-1 పోస్టులకు 2022, ఆగస్టు 27న నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. హాల్‌టికెట్ల కోసం www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఉన్నత విద్యామండలిలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

- సావిత్రిబాయి పూలేకు చైర్మెన్ బాలకిష్టారెడ్డి నివాళి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలిలో శుక్రవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మెన్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి జాయింట్ సెక్రెటరీ సిఎస్ ప్రకాశ్, ఇతర ఉద్యోగులు, తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కతో చర్చలు సఫలం

- గిరిజన ఆశ్రమ పాఠశాలల
- సీఆర్టీల సమ్మె విరమణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్టీ) సమ్మె విరమించారు. శుక్రవారం హైదరాబాద్ లోని సచివాలయంలో మంత్రి సీతక్కతో నిర్వహించిన చర్చించారు. సఫలం కావడంతో సమ్మె విరమిస్తున్నట్టు ప్రకటించారు. నేటి నుంచి విధుల్లో చేరనున్నట్టు తెలిపారు. మంత్రితో జరిగిన చర్చల సందర్భంగా పెండింగ్ సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ, మినిమం టైం స్కేల్ మినహా అన్ని డిమాండ్లకు సానుకూలంగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ప్రతి నెలా ఐదో తారీకు లోపు జీతాలు, మహిళా టీచర్లకు 180 రోజుల ప్రసూతి సెలవులు, డెత్ బెనిఫిట్స్ మంజూరు చేస్తామని మంత్రి సీతక్క హామీనిచ్చారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ, మినిమం టైం స్కేల్ డిమాండ్లపై ముఖ్యమంత్రి చర్చించి మరోసారి సమావేశం అవుదామని తెలిపారు. ఆదివాసి గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వానికి సహకరించాలని ఆమె కోరారు. పదేళ్లుగా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయనీ, ఒక్కో సమస్యను పరిష్కరిస్తున్నామని చెప్పారు. సీఆర్టీ సేవలను పొడిగిస్తూ ముఖ్యమంత్రి ఫైల్‌పై సంతకం చేశారని గుర్తుచేశారు. రెండు, మూడు రోజుల్లో కంటిన్యూస్ ఆర్డర్స్ ఇస్తామని వెల్లడించారు. కనీస సమాచారం ఇవ్వకుండా, ప్రభుత్వానికి నోటీసు ఇవ్వకుండా సమ్మెకు దిగటం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగ క్రమబద్ధీకరణను హైకోర్టు కొట్టి వేసిందని సీతక్క గుర్తుచేశారు. కోర్టు కేసును అధిగమించి ఇలా ఎలాంటి చర్యలు తీసుకోవాలో న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. 15 రోజుల్లో మరోసారి సమావేశమై సమస్యలు పరిష్కరించుకుందామని భరోసానిచ్చారు. తెగేదాక లాగొద్దని ఆమె హితవు పలికారు. పట్టువిడుపులతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.సమస్య పరిష్కారం కోసం చొరవ చూపిన మంత్రి సీతక్క సీఆర్టీలు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అజ్మీర శివ నాయక్, రాష్ట్ర అధ్యక్షులు సోమేశ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదావ్ వినంత్‌రావ తదితరులు చర్చల్లో పాల్గొన్న వారిలో ఉన్నారు.

# సమాజాన్ని మారుద్దాం..

# చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దుతాం

## ప్రయివేటులో ఎల్‌కేజీ చదువుకు లక్షల రూపాయలు

- అందుకే అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రారంభించాం : జిల్లా సంక్షేమ అధికారుల సమీక్షలో మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'సంక్షేమ శాఖలో జిల్లా సంక్షేమ శాఖ అధికారులే మా ప్రభుత్వానికి కలెక్టర్లుగా భావిస్తున్నాం. పేదలు, వెనుకబడిన వారికి సేవ చేసే అవకాశం మీకు కలిగింది. వారి సంక్షేమాన్ని చూసే బాధ్యత మీదే. మీరు మారండి. మనమంతా సమాజాన్ని మారుద్దాం. చిన్నారుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుదాం' అని జిల్లా సంక్షేమ శాఖ అధికారులకు రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) ఉద్బోధించారు. ప్రయివేటు స్కూళ్లలో ఎల్‌కేజీ, యూకేజీ చదువులకు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారనీ, ఈ కారణంతోనే అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్య అందించి తల్లిదండ్రులపై భారం తగ్గించాలనే నిర్ణయాన్ని తమ ప్రభుత్వం తీసుకున్నదని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మధురానగర్ లోని మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్‌లో డిడబ్ల్యూఓలతో సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడీకేంద్రంలోనూ గంట ఏర్పాటు చేయాలనీ, ఉదయం 9 గంటలకు బెల్ మోగించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో డీడబ్ల్యూఓలు సమావేశాలు నిర్వహించి లోటుపాట్లపై నివేదికలు సమర్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణం, టాయిలెట్ల నిర్మాణం, తాగునీటి కనెక్షన్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాభివృద్ధి నిధులను అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాల కోసం వెచ్చించే అవకాశాన్ని పరిశీలిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పొరపాటు కూడా జరగకుండా చూసుకోవాలని సూచించారు. చిన్నారులే ఈ దేశం భవిష్యత్తు అనీ, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత డీడబ్ల్యూఓలదేనని నొక్కి చెప్పారు. అధికారులంతా తమ పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. త్వరలో జిల్లాల్లో పర్యటిస్తానని చెప్పారు. జిల్లాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పిల్లలకు అందిస్తున్న పోషకాహారాన్ని చెక్‌చేయాలని ఆదేశించారు. పిల్లలకు అందించే పోషకాహారాన్ని మరింత మెరుగుపరిచేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. సాంకేతిక కారణాలు, న్యాయపర చిక్కులతో మూతపడ్డ అంగన్‌వాడీ కేంద్రాలను తక్షణమే తెరిపించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో మహిళాభివృద్ధి కార్పొరేషన్ చైర్ ఉమెన్ బంద్రు శోభ, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, వికలాంగుల సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ శైలజ, 33 జిల్లాల డీడబ్ల్యూఓలు, తదితరులు పాల్గొన్నారు.



# గతేడాది అమెరికా పోలీసుల చేతుల్లో 1250 మంది మృతి




వాషింగ్టన్ : గతేడాది కాలంలో అమెరికా వ్యాప్తంగా పోలీసులు 1250మందికి పైగా హతమార్చారని పరిశోధనా గ్రూపు మ్యాపింగ్ పోలీస్ వయొలెన్స్ వెల్లడించింది. 2013 నుండి దేశంలో పోలీసుల హత్యల వివరాలను నమోదు చేస్తూ వచ్చిన ఈ సంస్థ ఆయా గణాంకాలను విడుదల చేసింది. గతంలో ఎన్నడూ ఇంతమంది చనిపోలేదని పేర్కొంది.

ప్రభుత్వ రికార్డులు, వార్తా కథనాల ద్వారా పోలీసుల హత్యల వివరాలను ఈ సంస్థ తెలుసుకుంటూ వుంటుంది. గతేడాది డిసెంబరులో చివరి 13 రోజుల్లో పోలీసులు ఒక్కరిని కూడా చంపలేదని పేర్కొంది. సగటున ప్రతి 7గంటలకు ఒకరు చొప్పున పోలీసుల హింసలో చనిపోయారని ఈ గ్రూపు గుర్తించింది. పోలీసుల కాల్పులు, లాఠీచార్జి, పోలీసు వాహనాలు ప్రజలపైకి దూసుకెళ్ళడం వంటి ఘటనల్లో మరణించిన వారే వీరందరూ. వీరిలో దాదాపు 31శాతం అంటే 387మంది

హింసాత్మక నేరాల్లో మరణించారు. మరో 18శాతం మంది అంటే దాదాపు 200మంది ట్రాఫిక్ ఉల్లంఘనల ఆరోపణలపై లేదా సంక్షేమ తనిఖీల కోసం పోలీసులను పిలిచిన తర్వాత చంపబడ్డారు. మరో 8శాతం మంది ఎలాంటి నేరాలకు పాల్పడకపోయినా చనిపోయారు. హింసాత్మక యేతర నేరాలకు పాల్పడిన వారు మరో 17శాతం మందని ఆ గ్రూపు పేర్కొంది. గ్రామీణ, శివారు ప్రాంతాల్లోనే ఎక్కువగా ఈ హత్యలు చోటు చేసుకున్నాయి.

## జమ్ము కాశ్మీర్‌లో సాధారణ స్థితి నెలకొనలేదు

### సీఎం ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యలు



శ్రీనగర్ : తీవ్రవాద దాడులు కొనసాగుతునే వుండడంతో జమ్ము కాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు పూర్తిగా నెలకొనలేదని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శుక్రవారం వ్యాఖ్యానించారు. 370వ అధికరణ కాశ్మీర్ యువత మనస్సుల్లో వేర్పాటువాదం బీజాలు నాటిందని, ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం లోయలో తీవ్రవాదాన్ని అంతమొందించడమే కాకుండా తీవ్రవాద వ్యవస్థనే నిర్మూలించిందని హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించిన మరుసటి రోజు అబ్దుల్లా వ్యాఖ్యలు వెలువడ్డాయి. షా ప్రకటనపై ఏమీ చెప్పాలనుకోవడం లేదని అన్నారు. ఈ రోజు కూడా కొన్ని చోట్ల దాడులు జరిగినట్లు వార్తలందాయి. ఇప్పటికీ సాధారణ పరిస్థితులు నెలకొనలేదు. ఇదంతా ఒక ప్రక్రియ, రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో చూడాల్సి వుందని అబ్దుల్లా విలేకరులతో అన్నారు. మంచు బాగా కురుస్తున్న పరిస్థితుల్లో ప్రభుత్వ సన్నాహాల గురించి ప్రశ్నించగా, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనడానికి సిద్ధంగా వున్నామన్నారు. గతంలో కూడా ఇలాంటి అనుభవాలు వున్నందున ఒకవేళ ఏమైనా లోపాలు వుంటే వాటిని ఈసారి సరిదిద్దుకుంటున్నామని చెప్పారు. గత కాలంతోపోలిస్తే ఈ ఏడాది విద్యుత్ పరిస్థితి కూడా మెరుగుపడిందన్నారు.

## గొర్రెల మందకు తోడేలు కాపలా కాస్తున్నట్టుగా ఉంది

- బీసీల ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నంలో కవిత
- మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో వ్యవహరించి ఇప్పుడు మమకారం కురిపిస్తే బీసీలు నమ్మే పరిస్థితి లేదు. తోడేలు గొర్రెల మందకు కాపలా కాస్త అన్నట్టుగా కవిత తీరు ఉంది. బీఆర్‌ఎస్ తోడేళ్ల గుంపులాంటిది. వాటికి భక్షించడం తప్ప రక్షించడం తెలియదు. బీఆర్‌స్‌దీ అదే పరిస్థితి' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) విమర్శించారు. శుక్రవారం సాయంత్రం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో ఆమె చిట్‌చాట్ చేశారు. బీసీల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కవిత ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో, రాష్ట్రంలో విద్యా ఉద్యోగ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని నొక్కి చెప్పారు.

జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నదన్నారు. ఎన్నడు లేని విధంగా సమగ్ర కుల గణన చేపట్టిందనీ, బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు న్యాయ నిపుణులతో, మేధావులతో చర్చిస్తున్నామని తెలిపారు. బీసీ ముసుగుతో కవిత మరో రాజకీయ డ్రామా మొదలు పెట్టారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్.. బీసీ మంత్రులకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. తమ ప్రజా ప్రభుత్వంలో సామాన్యులు సైతం ముఖ్యమంత్రిని సులువుగా కలువగలుగుతున్నారన్నారు. బీసీలను బీఆర్‌ఎస్ అడుగడుగునా మోసం చేసిందనీ, ఇప్పుడు బీసీ రాగం ఎత్తుకున్నా ఎవ్వరూ నమ్మే స్థితిలో లేరని చెప్పారు.



మహిళా, శిశు సంక్షేమ కమిషనరేట్ ఆవరణలో ఉన్న ప్రభుత్వ టెక్నికల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలకు హాజరైన మంత్రి సీతక్క సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన మంత్రి. మహిళా టీచర్లను శాలువాలతో సత్కరించిన సీతక్క

## తెలంగాణ భవన్‌లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సంఘ సంస్కర్త, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బడుగుల అభ్యున్నతి కోసం, స్త్రీ విద్య కోసం ఆమె జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని ఆయన అన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్..

- ముగ్గురు మావోయిస్టులు హతం



గరియాబాద్: ఛత్తీస్‌గఢ్ లో మరోసారి ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. గరియాబాద్ జిల్లా ఇందగావ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సొర్నామల్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు.

## మణిపూర్‌లో మళ్లీ హింస..

- ఎస్పీ కార్యాలయంపై దాడి



కాంగ్‌పోక్‌పీ: మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. కాంగ్‌పోక్‌పీలో ఎస్పీ కార్యాలయంపై కుకీ ఆందోళనకారులు దాడి చేశారు. ఈ ఘటనలో ఎస్పీ సహా పలువురు పోలీసు సిబ్బందికి గాయాలైనట్లు సమాచారం. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఇంఫాల్ ఈస్ట్ జిల్లాలో అక్రమ బంకర్లను కూల్చివేసేందుకు భద్రతా దళాలు ఇటీవల భారీ ఆపరేషన్ చేపట్టాయి. వీటిని వ్యతిరేకిస్తూ స్థానికంగా పలు గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి. ఈ క్రమంలో కొందరు మహిళలపై భద్రతా దళాలు లాఠీఛార్జీ చేయడం ఉద్రిక్తతలకు దారితీసింది. కేంద్ర బలగాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వెంటనే వారిని వెనక్కి పంపించాలనే డిమాండ్ మొదలైంది. ఇందులో పోలీసు ఉన్నతాధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం సాయంత్రం భారీ సంఖ్యలో ఆందోళన చేపట్టారు.

భద్రతా దళాలు వారిని అడ్డుకోవడంతో కాంగ్‌పోక్‌పీ జిల్లా ఎస్పీ కార్యాలయం వైపు దూసుకెళ్తూ రాళ్లు, ఇతర ఆయుధాలతో దాడికి పాల్పడ్డారు. దీంతో ఆందోళనకారులకు, భద్రతా దళాలకు ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఎస్పీ ప్రభాకర్ సహా అనేక మంది పోలీసు సిబ్బంది గాయపడ్డారు. అటు పలువురు నిరసనకారులకు కూడా గాయాలైనట్టు సమాచారం.

## పదేండ్లు బీసీల ఊసేత్తలేదు

- పార్టీ కీలక పదవులను బీసీలకు ఇస్తారా? : కల్వకుంట్ల కవితకు మంత్రి పొన్నం సవాల్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్లు అధికారంలోకి ఉండి కూడా బీసీల సంక్షేమంపై ఊసేత్తలేదని రవాణా, సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్‌ఎస్ నేత కల్వకుంట్ల కవితకు బీసీలు గుర్తుకొచ్చారా? అని ప్రశ్నించారు. నిజంగా బీసీలపై బీఆర్‌ఎస్‌కు ప్రేమ ఉంటే, ఆ పార్టీ అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్ష పదవి, శాసనసభలో ప్రతిపక్ష నేత పదవి బీసీలకు ఇస్తారా? అని సవాల్ విసిరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ అనిల్ యాదవ్ కుమార్, ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కుమార్, చరణ్ యాదవ్, గౌరీ సతీష్, డాక్టర్ లింగం యాదవ్, గజ్జి భాస్కర్, వరలక్ష్మితో కలిసి మంత్రి పొన్నం విలేకర్లతో మాట్లాడారు. రాజ్యాంగ బద్ధంగా బలహీన వర్గాలకు అవకాశం ఉండి న్యాయం చేయలేదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు బలహీన వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పదవి కూడా ఇవ్వలేదన్నారు. బీఆర్‌ఎస్‌కు తాను హక్కుదారు అని చెప్పిన ఈటల రాజేందర్‌ను బయటకు పంపించారని గుర్తు చేశారు. కొత్తపల్లి జయశంకర్, దేశిని చిన్నమల్లయ్య, శ్రీకాంత్‌చారి తల్లిని అవమానించినప్పుడు ఎందుకు మాట్లాడలేదని కవితను ప్రశ్నించారు. కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు చేశామనీ, ప్రతి కార్పొరేషన్‌కు రూ. 50 కోట్లు కేటాయించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు.

## మాంటెనెగ్రోలో కాల్పులు

- 12మందిని హత్య చేసి ఆత్మహత్య చేసుకున్న సాయుధుడు



పొడ్గొరికా, మాంటెనెగ్రో : ఇద్దరు చిన్నారులతో సహా 12మందిని కాల్చి చంపిన సాయుధుడు పోలీసులు చుట్టుముట్టడంతో తనను తాను కాల్చుకున్నాడని అధికారులు గురువారం తెలిపారు. సెటింజ్ పట్టణంలో బార్‌లో గొడవ జరగడంతో బుధవారం జరిగిన ఈ కాల్పుల్లో మరో నలుగురు గాయపడ్డారు. కాల్పులు జరిపిన వ్యక్తిని 45ఏళ్ళ మార్టినోవిక్‌గా గుర్తించారు. బార్ యజమానిని, యజమాని పిల్లలను, ఆయన కుటుంబ సభ్యులను ఆ వ్యక్తి చంపేశాడని హోం మంత్రి డానిలో సరనోవిక్ తెలిపారు. ఈ ఘటన తర్వాత సాయుధుడు పారిపోయాడని, తర్వాత పోలీసులు గుర్తించి అతడిని చుట్టుముట్టడంతో తనను తాను కాల్చుకుని చనిపోయాడని మంత్రి చెప్పారు. మూడు రోజులు సంతాప దినాలుగా ప్రభుత్వం ప్రకటించింది.

ఈ కాల్పులను తీవ్రమైన విషాదంగా ప్రధాని మిలొజ్‌కొ స్పాజిక్ వ్యాఖ్యానించారు. కొన్నిసార్లు ఇలాంటి వ్యక్తులు కరడుగట్టిన నేరస్తుల కంటే కూడా అత్యంత ప్రమాదకరంగా మారతారని సరనోవిక్ చెప్పారు. బుధవారం ఉదయమంతా బార్‌లోనే వున్న మార్టినొవిక్ ఈ గొడవ జరిగిన వెంటనే ఇంటికి వెళ్ళి ఆయుధం తెచ్చుకుని మరీ కాల్పులు జరిపాడని, సాయంత్రం 5.30గంటల సమయంలో ఈ కాల్పులు చోటు చేసుకున్నాయని సరనొవిక్ చెప్పారు. బార్‌లో నలుగురిని చంపేసిన తర్వాత మరో మూడు చోట్ల కూడా కాల్పులు జరిపాడని మంత్రి తెలిపారు. అతిచిన్న దేశమైన మాంటెనెగ్రోలో తుపాకి సంస్కృతి ఎక్కువ. చాలామంది ఆయుధాలను కలిగి వుంటారు. ఈ ఘటనతో దిగ్భ్రాంతి చెందానని అధ్యక్షుడు జకొవ్ వ్యాఖ్యానించారు.